శుక్రవారం
16•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 52
• పేజీలు: 14 + 16

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




## త్రివిధ దళాల ప్రధానాధికారిని నియమిస్తాం

- సైనిక వ్యవస్థకు నాయకత్వం, త్రివిధ దళాల మధ్య సమన్వయమే లక్ష్యం
- 70 ఏండ్లలో చేయలేనిది 70 రోజుల్లోనే చేసి చూపెట్టాం
- ఆర్టికల్ 370 రద్దుతో 'ఒకే దేశం- ఒకటే రాజ్యాంగం' కల నెరవేరింది
- రూ.3.5 లక్షల కోట్లతో జల్ జీవన్ మిషన్.. 2024 నాటికి ప్రతి ఇంటికీ నల్లా నీరు
- జనాభా విస్ఫోటంతో భవిష్యత్తు తరాలకు అనర్థం
- దేశీయ పర్యాటకరంగాన్ని ప్రోత్సహించండి

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ


ఢిల్లీ ఎర్రకోట పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

# నయా భారత్

**దేశ** సైనిక వ్యవస్థకు నాయకత్వం వహించడంతోపాటు త్రివిధ దళాల మధ్య సమన్వయానికి త్వరలో త్రివిధ దళాల ప్రధానాధికారిని (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్) నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. నవ భారత్ నిర్మాణం కోసం గత 70 ఏండ్లలో తీసుకోలేని ఎన్నో నిర్ణయాలను తమ ప్రభుత్వం 70 రోజుల్లోనే తీసుకున్నదని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో 'ఒకే దేశం- ఒకటే రాజ్యాంగం' అనే స్ఫూర్తి వాస్తవరూపం దాల్చిందన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళల జీవితాలు మెరుగుపడుతాయని ధీమా వ్యక్తంచేశారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ గురువారం ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఇప్పటికే జీఎస్టీతో 'ఒకే దేశం- ఒకే పన్ను', విద్యుత్ గ్రిడ్‌తో 'ఒకే దేశం-ఒకే గ్రిడ్' కలలు సాకారం చేశామన్నారు. రూ.100 లక్షల కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 'జల్ జీవన్ మిషన్' కింద ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. జనాభా విస్ఫోటాన్ని అదుపుచేయాలని పేర్కొన్నారు. 2022 నాటికి దేశంలోని ప్రతిఒక్కరూ దేశంలోని 15 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని పిలుపునిచ్చారు. జమిలి ఎన్నికలపై విస్తృత చర్చ జరుగాల్సి ఉన్నదన్నారు. రాబోయే ఐదేండ్లలో భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

వివరాలు 5వ పేజీలో

ధర్మగంట

## మా భూమిని కాపాడండి

**అటవీభూముల్లో కలిసిన సాగుభూములు**

**ట్రెంచ్‌కటింగ్ చేసిన ఫారెస్ట్ అధికారులు**

**స్పందించని రెవెన్యూ అధికారులు**

**నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో రైతుల గగ్గోలు**

రెవెన్యూ, అటవీశాఖల మధ్య భూవివాదం రైతులపాలిట శాపంగా మారింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లిలో రైతులకు దశాబ్దాల తరబడి వారసత్వంగా సంక్రమించిన భూములున్నాయి. రెవెన్యూశాఖ పక్కాగా జారీచేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నాయి. అయినా అటవీశాఖ అధికారులు ఆ భూములన్నీ తమవేనంటున్నారు. ఆ భూముల చుట్టూ ట్రెంచ్ కటింగ్ చేశారు. ఇదేమని అటవీశాఖ అధికారులను అడిగితే.. తమకు ఉన్న ఆదేశాల ప్రకారం ఆ భూములన్నీ అటవీభూములని అంటారు. రెవెన్యూ అధికారులను అడిగితే.. మండలం మొత్తానికి ఒకే సర్వేయర్ ఉన్నాడు.. అతనికి తీరికలేదంటారు. మొత్తం మీద అన్సాన్‌పల్లి రైతుల పరిస్థితి అయోమయంగా మారింది.

6

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) | (రూ.) | | |
|---|---|---|---|
| ఫారం ధర | 72.00 | రిటైల్ లైవ్ | 94.00 |
| డ్రెస్డ్ | 136.00 | స్కిన్‌లెస్ | 155.00 |

| గుడ్ల ధరలు (వందకు) | (రూ.) | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 331.00 | రంగారెడ్డి | 331.00 |
| మెదక్ | 331.00 | కరీంనగర్ | 334.00 |
| వరంగల్ | 334.00 | చిల్లర ధర | 3.90 |

# త్వరలో రెవెన్యూ చట్టం

## బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ముందుకు

### రైతులకు లక్ష రూపాయల రుణమాఫీకి ఆదేశాలు

### సుపరిపాలనకు 60 రోజుల ప్రణాళిక

- ప్రజల వద్దకు పాలన కోసమే సంస్కరణలు
- రెట్టింపైన రాష్ట్ర సంపద
- కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే నియామకాలు
- కరంట్ సమస్యల పరిష్కారానికి 'పవర్ వీక్'
- రాష్ట్ర ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్
- బస్తీ దవాఖానల సంఖ్య పెంపు
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు వేగంగా పూర్తి

వచ్చే జూన్ నుంచి సాగుకోసం.. గోదావరిలో అదనంగా 575 టీఎంసీల నీరు: సీఎం కేసీఆర్


పంద్రాగస్టు వేడుకల్లో గోల్కొండ బురుజులపై కళాకారుల ప్రదర్శన


గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకల్లో పోలీసు దళం మార్చ్‌ఫాస్ట్

- పల్లెలు, పట్టణాలన్నీ పరిశుభ్రంగా ఉండాలి
- బడ్జెట్‌లో 10 శాతం పచ్చదనానికి కేటాయించాలి
- బంగారు తెలంగాణకు పునాదులు పడ్డాయి
- ఆత్మవిశ్వాసం- సానుకూల దృక్పథంతో ముందుకు
- స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ప్రజలకు, రైతులకు ఎలాంటి యాతన లేకుండా సేవలందించడమే లక్ష్యంగా కొత్త రెవెన్యూ చట్టం రూపుదిద్దుకొంటున్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. త్వరలో జరుగనున్న బడ్జెట్ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు. ప్రజలవద్దకు పాలన అందించడం కోసమే సంస్కరణలు తీసుకొస్తున్నామని, ఆత్మవిశ్వాసం- సానుకూల దృక్పథంతో సుపరిపాలనదిశగా ముందుకు సాగుతున్నామని సీఎం పేర్కొన్నారు. గోల్కొండ కోట వేదికగా గతంలో అనేక కార్యక్రమాలను ప్రారంభించుకొని ఫలితాలు సాధించామని చెప్పారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు తెలంగాణ పల్లెలు, పట్టణాలను బాగుచేసుకుందామని పిలుపునిచ్చారు. ఇందుకోసం అరవైరోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పాలనా సంస్కరణల ఫలితంగా తండాలు, గూడేల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాను ఎగురవేసిన దృశ్యం ఆవిష్కృతమైందని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను ఐక్యరాజ్యసమితి ప్రశంసించటం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా గౌరవం పెరిగిందన్నారు. రైతులకు లక్ష రూపాయల

మిగతా 2వ పేజీలో


గురువారం గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకల్లో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

> **గ్రామాలు,** పట్టణాల్లో 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తున్నది. ఫైనాన్స్ కమిషన్ల గ్రాంట్ నిధులను ఈ 60 రోజుల ప్రణాళిక అమలుకుముందే స్థానిక సంస్థలకు విడుదలచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రణాళికలో ప్రజాప్రతినిధులు, అధికారులు విశేషమైన ప్రజాభాగస్వామ్యం సాధించి గ్రామాలు, పట్టణాల రూపురేఖల్ని మార్చాలి.
>
> – సీఎం కే చంద్రశేఖర్‌రావు

## ఎరువుల ధరలు తగ్గించిన ఇఫ్కో

- ఒక్కో సంచిపై రూ.50 తగ్గింపు
- అమలుల్లోకి వచ్చిన కొత్త ధరలు

9

## ఎగువన స్థిరంగా వరద

- ఉదయం నుంచి ఆల్మట్టికి తగ్గిన ప్రవాహం
- శ్రీశైలం, సాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

3

## ప్రాణహితలో పెరిగిన ప్రవాహం

- మధ్యమానేరుకు 1600 క్యూసెక్కుల జలాలు
- భద్రాచలం దగ్గర పెరిగిన గోదావరి నీటిమట్టం









epaper.ntnews.com



గురువారం 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చారిత్రక గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండాకు వందనం చేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



ప్రగతిభవన్‌లో జెండాకు వందనం చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, నవీన్‌కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు కూడా ఉన్నారు.



# త్వరలో రెవెన్యూ చట్టం

మొదటిపేజీ తరువాయి...

రుణమాఫీ అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని సీఎం పేర్కొన్నారు. గురువారం 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చారిత్రక గోల్కొండ కోటలో సీఎం కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు జాతీయజెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోల్కొండ కోటలో పతాకావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.. ప్రసంగం ఆయన మాటల్లోనే..

## రెట్టింపైన రాష్ట్ర సంపద

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనులకు ఈ సందర్భంగా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రాన్ని సరైన దిశలో పెట్టేందుకు ఐదేండ్లలో మనం చిత్తశుద్ధితోచేసిన ప్రయత్నాలు సఫలమయ్యాయి. అవుతున్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి ఐదేండ్లుగా స్థిరంగా కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం, 2018-19 ఆర్థిక సంవత్సరంలో 14.84 శాతం వృద్ధిరేటుతో జీఎస్డీపీలో మన రాష్ట్రం ముందువరుసలో ఉన్నది. రాష్ట్ర సంపద ఐదేండ్లలో రెట్టింపయింది. రాష్ట్రం ఏర్పడిననాడు తెలంగాణలో రూ.4 లక్షల కోట్ల విలువైన సంపద ఉంటే, నేడు 8.66 లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవడం మన ఆర్థిక ప్రగతికి సంకేతంగా నిలుస్తున్నది.

## నాటి దుష్పరిణామాలను అధిగమించాం

రాష్ట్రంలో శాంతిసామరస్యాలు వెల్లివిరుస్తున్నాయి. ఆదర్శవంత పాలనతో దేశం దృష్టిని ఆకర్షించగలిగాం. సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో జరిగిన జీవన విధ్వంసం సృష్టించిన దుష్పరిణామాలను అధిగమించగలిగాం. రాష్ట్రం ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ముందడుగు వేస్తున్నది. స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో తెలంగాణ పల్లెలను, పట్టణాలను బాగుచేసుకునే ప్రణాళికను ఆవిష్కరించాలని, సుపరిపాలన దిశగా ప్రయాణం ప్రారంభించాలని ప్రభుత్వం తలపెట్టింది.

## ప్రజల వద్దకు పాలన కోసమే సంస్కరణలు

గ్రామాలను, పట్టణాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం చట్టపరమైన సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడంకోసం కొత్త పరిపాలనా విభాగాలను ఏర్పాటుచేసింది. గతంలో పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను 33 జిల్లాలుగా చేసుకున్నాం. 43 రెవెన్యూ డివిజన్లను 69కి పెంచుకున్నాం. 459 మండలాలను 584 మండలాలుగా చేసుకున్నాం. గతంలో 68 మున్సిపాలిటీలుంటే ఇప్పుడు 142 మున్సిపాలిటీలున్నాయి. కొత్తగా 7 మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసుకుని, కార్పొరేషన్ల సంఖ్యను 13కు పెంచుకున్నాం. గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలు, మారుమూల పల్లెలను ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చింది. గతంలో 8,690 గ్రామపంచాయతీలుంటే, వాటి సంఖ్యను 12,751కు పెంచాం. ఇటీవలే కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ఇవాళ మొదటిసారిగా గ్రామపంచాయతీలుగా మారిన తమ పల్లెలు, తండాలు, గూడేల్లో సగర్వంగా జాతీయ పతాకాన్ని ఎగురేసుకుంటున్న దృశ్యం ఆవిష్కృతమైంది.

## దేశం అబ్బురపడుతున్నది

**అతితక్కువ** సమయంలో విద్యుత్ సమస్యను సమర్థంగా పరిష్కరించుకొన్నాం. దేశమే అబ్బురపడి మన నుంచి నేర్చుకొనే విధంగా 'మిషన్ భగీరథ'తో మంచినీటి ఎద్దడిని నివారించుకోగలిగాం. ఎన్నికల్లో ఇచ్చిన మాటప్రకారం ఆసరా పెన్షన్లను రెట్టింపు చేసుకొన్నాం. వృద్ధాప్య పెన్షన్ వయోపరిమితిని 65 ఏండ్ల నుంచి 57 సంవత్సరాలకు తగ్గించి.. పెంచిన పెన్షన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల జాబితా రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

## కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే నియామకాలు

ఉద్యోగావకాశాలు స్థానికులకే ఎక్కువ దక్కాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటుచేసింది. లోకల్ క్యాడర్ ఉద్యోగాలు 95 శాతం స్థానికులకే దక్కేలా ప్రభుత్వం చట్టంచేసి, కేంద్ర ప్రభుత్వ ఆమోదాన్ని కూడా పొందింది. ఇప్పుడు కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే రాష్ట్రంలో ఉద్యోగనియామకాలు జరుగుతున్నాయి.

## వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టం

బూజుపట్టిన పాత రెవెన్యూ చట్టాలు రైతులకు, ప్రజలకు అపార నష్టం కలిగించాయి. ఈ నష్టాన్ని నివారించుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రజలకు, రైతులకు ఎలాంటి యాతన లేకుండా సేవలందించడమే లక్ష్యంగా, కొత్త రెవెన్యూ చట్టం రూపుదిద్దుకుంటున్నది. చట్టం రూపకల్పనలో ప్రభుత్వం నిమగ్నమైంది. అవినీతికి ఆస్కారం లేని, అలసత్వానికి అవకాశం లేని నూతన రెవెన్యూ చట్టాన్ని త్వరలోనే జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడుతామనే సంతోషకరమైన విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలన అందించడానికి ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని, నూతన పురపాలక చట్టాన్ని తీసుకొచ్చింది. నూతన రెవెన్యూ చట్టం కూడా రూపుదిద్దుకుంటున్నది. ఈ మూడు కొత్త చట్టాల వెలుగులో రాష్ట్రంలో కచ్చితంగా పరిశుభ్రమైన, పచ్చదనం వెల్లివిరిసే గ్రామాలు, మున్సిపాలిటీలను తయారుచేసుకోగలమనే దృఢమైన విశ్వాసం నాకున్నది.

## కరంటు సమస్యల పరిష్కారానికి 'పవర్ వీక్'

గ్రామాలు, పట్టణాల లోపలా, పరిసరాల్లోనూ కొన్ని వంగిపోయిన కరంట్ స్తంభాలు.. తుప్పుపట్టిన పాత స్తంభాలు, వేలాడుతున్న కరంట్ వైర్లు దర్శనమిస్తున్నాయి. మూడో వైర్ (థర్డ్ వైర్) లేకపోవడం వల్ల కొన్నిచోట్ల వీధిదీపాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ దుస్థితిని నివారించడానికి 60 రోజుల ప్రణాళికలో భాగంగా వారంపాటు విద్యుత్‌శాఖ, ప్రజల భాగస్వామ్యంతో పవర్‌వీక్ నిర్వహించుకోవాలి. విద్యుత్‌శాఖ సిబ్బంది వారంపాటు గ్రామాల్లో, డివిజన్లలో అందుబాటులో ఉంటారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవాలి.

## ప్రతి ఇంటికి ఆరు మొక్కలు

60 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి పట్టణం, ప్రతి గ్రామం తమకు అవసరమైన నర్సరీలను స్థానిక సంస్థల ఆధ్వర్యంలోనే ఏర్పాటుచేసుకోవాలి. జిల్లా హరిత కమిటీ (గ్రీన్ కమిటీ) అందించే సూచనలను పాటించాలి. పట్టణ, గ్రామ బడ్జెట్‌లో పదిశాతం నిధులను పచ్చదనంపెంచే పనులకు కేటాయించాలి. పట్టణాల్లో, గ్రామాల్లో ప్రతి ఇంటికీ ప్రజలు కోరుకొనే ఆరు మొక్కలను సరఫరాచేయాలి. ప్రజలంతా వాటిని చక్కగా కాపాడి పెంచి, పెద్ద చేసేలా ప్రేరణ కలిగించాలి. డబ్బు పెట్టి ఎన్ని సుఖాలైనా కొనుక్కోవచ్చు. వానలు కొనలేం, గాలిని కొనలేం, ప్రశాంతతను కొనలేం. రాబోయే తరానికి ఆస్తిపాస్తులిస్తే సరిపోదు. ఆకుపచ్చని పర్యావరణాన్ని వారసత్వంగా అందించడమే మన నిజమైన కర్తవ్యం కావాలి.

## కార్యదీక్షతో పనిచేయాలి

60 రోజుల ప్రత్యేక కార్యాచరణలో ఒక ఆదర్శవంతమైన విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. ఈ విధానాన్ని అనుసరించి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికోసం ఆయా పాలకమండళ్లు వార్షిక, పంచవర్ష ప్రణాళికలను రూపొందించాలి. ఈ ప్రణాళికలు ఖచ్చితంగా గ్రామసభల ఆమోదం పొందాలి. దానికి అనుగుణంగానే స్థానిక సంస్థలు నిధులు ఖర్చుచేయాలి. పంచాయతీరాజ్‌శాఖలోని అన్ని విభాగాల్లో అన్ని ఖాళీలను వేగవంతంగా భర్తీచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నూతన చట్టాలు నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చడంకోసం ప్రజాప్రతినిధులు, అధికారులు మరింత నిబద్ధతతో, కార్యదీక్షతో పనిచేయాలి. ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం పొందేలాగా సేవలందించాలి.

## మూడేండ్లలోనే పూర్తయిన కాళేశ్వరం

వడివడిగా రూపుదిద్దుకుంటున్న కృష్ణ, గోదావరి ప్రాజెక్టులు మన కండ్లముందే కనిపిస్తున్నాయి. ప్రపంచమే అబ్బురపడే కాళేశ్వరం ప్రాజెక్టును ఈ మధ్యనే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల సమక్షంలో మనం సగర్వంగా ప్రారంభించుకొన్నాం. తెలంగాణ ప్రభుత్వ పరిపాలనా పరిణతికి, దౌత్యనీతికి, స్నేహ సంస్కారానికి ప్రతిబింబంలా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి గొప్ప సందేశం ఇచ్చిందని యావత్‌దేశం కొనియాడుతున్నది. తెలంగాణ రాష్ట్రం అవలంబిస్తున్న 'లివ్ అండ్ లెట్ లివ్' పాలసీ అన్ని రాష్ట్రాలకు అనుసరణీయమైన విధానమనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇంతటి భారీ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా మూడు షిఫ్టులు శ్రమించి, మూడేండ్ల స్వల్ప వ్యవధిలోనే పూర్తిచేసిన ఇంజినీర్లు, అధికారులు, కార్మికులు, ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నాను.

## శరవేగంగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం

పాలమూరు జిల్లాలో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చాలా వేగంగా పూర్తిచేసింది. జూరాలతో కలిపి పాలమూరు జిల్లాలో నేడు 11.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించుకోగలుగుతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా నిర్మించి ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా రైతులకు సాగునీరు అందిస్తాం.

## 906 గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నాం

దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలకు చెందిన పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి 906 గురుకుల పాఠశాలలు నిర్వహిస్తూ మనం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాం. న్యాయవాదులు, జర్నలిస్టుల సంక్షేమం కోసం దేశంలో మరెక్కడాలేని విధంగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసుకుంటున్నాం.

## హెల్త్ ప్రొఫైల్‌కు సమాయత్తం

ప్రభుత్వం అనుసరిస్తున్న వైద్యవిధానం పేదల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతున్నది. కేసీఆర్ కిట్స్ పథకంతో రాష్ట్రంలో మాతా శిశుమరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. దృష్టిలోపాలు సరిచేసుకునేందుకు ప్రజలకు కంటివెలుగు గొప్ప అవకాశం కల్పించింది. ప్రజలందరికీ సంపూర్ణంగా ఆరోగ్య పరీక్షలు జరిపి, తెలంగాణ ఆరోగ్య సూచిక 'హెల్త్ ప్రొఫైల్' తయారుచేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు నిర్వహిస్తున్న బస్తీ దవాఖానల సంఖ్యను మరింత పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

## ఐటీ ఎగుమతులు రెట్టింపు

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి వేగంగా పరుగులు పెడుతున్నది. ఐటీ అభివృద్ధి స్థిరంగా కొనసాగుతున్నది. గడిచిన ఐదేండ్లలో ఐటీ ఎగుమతులు రూ.52 వేల కోట్ల నుంచి 1.10 లక్షల కోట్లకు చేరుకోవడం ఐటీ రంగంలో మనం సాధించిన ప్రగతికి అద్దం పడుతున్నది.

## శాంతిభద్రతల పరిరక్షణలో ప్రథమ వరుసలో రాష్ట్రం

శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశంలోనే ప్రథమవరుసలో ఉన్న రాష్ట్రాల సరసన చేరింది. శాంతి భద్రతల పర్యవేక్షణతోపాటు ప్రకృతి వైపరీత్యాలు, జాతరలు, ఉత్సవాలు తదితర భారీ కార్యక్రమాలను నిశితంగా గమనించేందుకు హైదరాబాద్‌లో నిర్మిస్తున్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ త్వరలోనే అందుబాటులోకి రానున్నది. నేరాల అదుపులో అద్భుత పనితీరు కనబరుస్తున్న యావత్ పోలీసు యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.

## యజ్ఞంలా తెలంగాణ పునర్నిర్మాణం

'పోరాడి సాధించుకున్న తెలంగాణలో గత ఐదేండ్లలో పునర్నిర్మాణ ప్రణాళికను ఒక యజ్ఞంలా నిర్వహించాం. తెలంగాణ ఒక ఆదర్శ రాష్ట్రంగా దేశం ముందు గర్వంగా నిలబడ్డది. బంగారు తెలంగాణ అనే సౌధం నిర్మించడానికి కావాల్సిన పునాదులు పడ్డాయి. స్వరాష్ట్రంలో సుపరిపాలన అనే నినాదంతో ముందుకు సాగుదాం. అందరూ ఇందులో భాగస్వాములు కావాలి' అని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## అభివృద్ధికి 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ

**కొత్త** చట్టాల అమలుకు శ్రీకారం చుడుతూ నూతన ఒరవడిని ప్రవేశపెట్టడంకోసం గ్రామాలు, పట్టణాల్లో 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తున్నది. ఫైనాన్స్ కమిషన్ల గ్రాంట్ నిధులను ఈ 60 రోజుల ప్రణాళిక అమలుకుముందే స్థానిక సంస్థలకు విడుదలచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లో అయినా, పట్టణాల్లో అయినా అపరిశుభ్రతే అనారోగ్యానికి కారణం. అనాగరిక వ్యవస్థకు సంకేతం. ఈ చెడ్డ పేరును మనం తొలిగించుకోవాలి. 60 రోజుల ప్రణాళికలో ప్రజాప్రతినిధులు, అధికారులు విశేషమైన ప్రజాభాగస్వామ్యం సాధించి గ్రామాలు, పట్టణాల రూపురేఖల్ని మార్చాలి. 'క్లీన్లీనెస్ ఈజ్ గాడ్లీనెస్' అని, పరిశుభ్రమైన పరిసరాల్లోనే పరమాత్ముడు కొలువై ఉంటాడని మనందరికీ తెలిసిన విషయమే. అలాగే నిరుపయోగంగా ఉన్న బోరు బావులను వెంటనే పూడ్చివేయాలి.

## రైతుబంధు, రైతుబీమాతో ప్రపంచ ఖ్యాతి

**వ్యవసాయాభివృద్ధి** కోసం ప్రపంచవ్యాప్తంగా అమలయ్యే గొప్ప కార్యక్రమాల జాబితాలో మన రైతుబంధు, రైతుబీమా పథకాలను పేర్కొనడం ద్వారా ఐక్యరాజ్యసమితి తెలంగాణ కీర్తిని అంతర్జాతీయస్థాయిలో పెంచింది. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుబంధు పథకాన్ని ఎకరానికి ఏడాదికి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంచి అందిస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయల వరకున్న పంటరుణాలను మాఫీ చేయడం కోసం ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించుకున్నాం.

### జూన్ నుంచి సాగుకు అదనంగా 575 టీఎంసీల గోదావరి నీళ్లు

**కాళేశ్వరం** ప్రాజెక్టు ద్వారా ప్రతిఏటా 400 టీఎంసీల నీటిని నికరంగా ఉపయోగించుకునే అవకాశం మన రాష్ట్రానికి ఏర్పడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీరివ్వడానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీరివ్వడానికి దేవాదుల ద్వారా 75 టీఎంసీల నీటిని నికరంగా వాడుకోవడానికి వీలు కలుగుతుంది. గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల వచ్చే జూన్ నుంచి తెలంగాణ రైతాంగం ఇప్పుడున్న గోదావరి ప్రాజెక్టులకు అదనంగా 575 టీఎంసీల నీటిని నికరంగా ఉపయోగించుకునే అవకాశం కలుగుతుంది.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



గోల్కొండ కోటలో జెండాకు వందనం చేస్తున్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు

## పోలీసుల గౌరవవందనం స్వీకరించిన సీఎం కేసీఆర్ | అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. గురువారం ఉదయం ప్రగతిభవన్‌లో జాతీయజెండాను ఆవిష్కరించిన సీఎం కేసీఆర్ అక్కడి నుంచి నేరుగా సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఉన్న సైనిక అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి గోల్కొండ కోటకు చేరుకొన్న సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాలలో ఒడిశాకు చెందిన పోలీసుల బృందం కవాతులో పాల్గొన్నది. ఒడిశా బృందాన్ని సీఎం అభినందించారు. బృందానికి నాయకత్వం వహించిన అధికారికి సీఎం జ్ఞాపికను బహూకరించారు. స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా గోల్కొండ కోటలో సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి సాంస్కృతిక బృందాలు వచ్చి వివిధ ప్రదర్శనలు ఇచ్చాయి. తెలంగాణ సంస్కృతి, చరిత్రను అద్భుతంగా ప్రతిబింబించిన ఈ ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. గుస్సాడి, ఢింసా, డప్పు, బోనాలు తదితర అనేక కళారూపాలు ఆకర్షించాయి. కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకొన్నారు. ఈ వేడుకలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.



73వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా గురువారం గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



గోల్కొండ కోటలో జరిగిన పంద్రాగస్టు వేడుకలకు హాజరైన అతిథులకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్


## ముహూర్తం

సూర్యోదయం: 6.03 గంటలకు

సూర్యాస్తమయం: 6.38 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, పాడ్యమి రాత్రి 8.24 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ధనిష్ఠ ఉదయం 10.56 వరకు, తదుపరి శతభిషం, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 10.46 నుంచి మధ్యాహ్నం 12.20 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.46 నుంచి 1.36 వరకు, వర్జ్యం: రాత్రి 7.02 నుంచి 8.38 వరకు.

## లోకం పోకడ







గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో సైనిక స్మారకస్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో సైనిక స్మారకస్తూపం వద్ద సెల్యూట్‌చేస్తున్న ఆర్మీ అధికారులు. చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ కూడా ఉన్నారు.

# రాజ్‌భవన్‌లో వేడుకగా 'ఎట్ హోం'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఏర్పాటుచేసిన 'ఎట్ హోం' వేడుకగా సాగింది. 'ఎట్ హోం' పేరుతో రాజ్‌భవన్‌లో ఇచ్చిన తేనీటి విందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు గవర్నర్ నరసింహన్ దంపతులు ఆత్మీయస్వాగతం పలికారు. జాతీయ గీతాలాపన అనంతరం గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ రాజ్‌భవన్ లాన్స్ ప్రాంగణమంతా కలియతిరిగారు. అందరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, మండలి మాజీ చైర్మన్ చక్రపాణి, సీఎస్ ఎస్కే జోషి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగరావు, మాజీ సీఎస్‌లు ఎస్పీ సింగ్, ప్రదీప్‌చంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీలు కే కేశవరావు, సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, సుబ్బరామిరెడ్డి, రేవంత్‌రెడ్డి, మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీల నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




గురువారం రాజ్‌భవన్‌లో ఎట్‌హోంకు హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న గవర్నర్ నరసింహన్ దంపతులు.. కాంగ్రెస్ నేత జానారెడ్డిని ఆప్యాయంగా పలుకరిస్తున్న సీఎం కేసీఆర్

# హైకోర్టు జడ్జీల సంఖ్య పెంచాలి

- కేంద్రానికి చీఫ్ జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ విజ్ఞప్తి
- హైకోర్టులో స్వాతంత్య్ర వేడుకలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ హైకోర్టులో మొత్తం జడ్జీల సంఖ్యను 24 నుంచి 42కు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ విజ్ఞప్తిచేశారు. గత ఏడు దశాబ్దాల్లో ఎన్నో మైలురాళ్లను దాటిన ఘనతను సొంతం చేసుకున్నామని చెప్పారు. 73వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం హైకోర్టులో జాతీయజెండాను ఎగురవేసిన ఆయన హైకోర్టు ఈ-పోర్టల్‌లో ఈ-ఫైలింగ్‌కు వీలుగా యాప్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. బార్‌కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తులు, ఎమ్మెల్సీ రామచంద్రరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యులు, ఏజీ బీఎస్‌ప్రసాద్, అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పంద్రాగస్టు వేడుకలో మాట్లాడుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్



గురువారం రక్షాబంధన్ సందర్భంగా ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆశీర్వదిస్తున్న ఆయన సోదరీమణులు జయమ్మ, లలితమ్మ



బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు నివాసంలో ఆయనకు రాఖీ కడుతున్న సోదరి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

# సీఎంకు తోబుట్టువుల రాఖీ

- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు రాఖీకట్టిన సోదరి కవిత
- ట్విట్టర్‌లో ఫొటోలను షేర్‌చేసిన కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రాఖీపౌర్ణమిని గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ఆయన సోదరీమణులు గురువారం రాఖీ కట్టారు. సీఎం కేసీఆర్ అక్కాచెల్లెళ్లు లక్ష్మి, విజయ, సకల, వినోద, లలిత హైదరాబాద్ ప్రగతిభవన్‌కు వచ్చి రాఖీ కట్టి.. స్వీట్లు తినిపించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మహిళా నాయకురాళ్లు తుల ఉమ, గుండు సుధారాణి సైతం సీఎం కేసీఆర్‌కు రాఖీలు కట్టారు.

### కేటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత

రక్షాబంధన్ సందర్భంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు ఆయన సోదరి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత రాఖీ కట్టారు. గురువారం బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసానికి వెళ్లిన కవిత.. బొట్టుపెట్టి, హారతి ఇచ్చి.. 'కేటీఆర్' పేరుతో ఉన్న రాఖీని కట్టి ఆయనకు స్వీట్ తినిపించారు. అనంతరం ఎంపీ సంతోష్‌కుమార్‌కు కవిత రాఖీ కట్టారు. సంతోష్‌కుమార్‌కు ఆయన సోదరి సౌమ్య కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. 'కొన్ని బంధాలు నిజంగా ప్రత్యేకమైనవి' అంటూ.. కేటీఆర్ గురువారం ట్విట్టర్‌లో రాఖీపండుగ ఫొటోలు షేర్ చేశారు.

### కేటీఆర్ శుభాకాంక్షలు

తెలంగాణభవన్‌లో గురువారం పలువురు టీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీకట్టినవారిలో మాజీ ఎంపీ సుధారాణి, నాయకురాళ్లు ముక్తవరం సుశీలారెడ్డి, మూల విజయారెడ్డి, సుచిత ఉన్నారు.

### హిమాన్షుకు అలేఖ్య రాఖీ

సీఎం కేసీఆర్ మనుమడు, కేటీఆర్ కుమారుడు కల్వకుంట్ల హిమాన్షుకు ఆయన సోదరి అలేఖ్య రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు. అనంతరం హిమాన్షు.. సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు.



రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మాజీ ఎంపీ కవిత. చిత్రంలో కేటీఆర్ కూడా ఉన్నారు.



సీఎం కేసీఆర్ మనుమడు, కేటీఆర్ కుమారుడు కల్వకుంట్ల హిమాన్షుకు రాఖీ కడుతున్న చెల్లెలు అలేఖ్య. చిత్రంలో కేటీఆర్ సతీమణి శైలిమ ఉన్నారు



గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఆశీస్సులు అందుకుంటున్న కేటీఆర్ తనయుడు హిమాన్షు





గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాఖీలు కడుతున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత, టీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు తుల ఉమ, గుండు సుధారాణి

# ఎగువన స్థిరంగా వరద

- ఆల్మట్టికి తగ్గిన ఇన్‌ఫ్లోలు
- దిగువ ప్రాజెక్టుల్లో నీటి నిల్వకు నిర్ణయం
- శ్రీశైలం, సాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**హైదరాబాద్ /జోగుళాంబ గద్వాల /నల్లగొండ /నాగర్‌కర్నూల్ /సూర్యాపేట ప్రధాన ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:** కృష్ణమ్మ ఉగ్రతీవ్రత నెమ్మదిస్తున్నది. ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఆల్మట్టి జలాశయానికి వరద కొంతమేర తగ్గినప్పటికీ.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు మాత్రం ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రానికి ఆల్మట్టికి 4.94 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఆల్మట్టి నుంచి దిగువకు 5.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపురకు 5.40 లక్షల క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 5.27 లక్షల క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు. జూరాలకు 7.06 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు 6.90 లక్షల క్యూసెక్కులను విడుదలచేస్తున్నారు. మరోవైపు పులిచింతలకు గురువారం ఉదయం 2.87 లక్షల ఇన్‌ఫ్లో ఉండగా రాత్రి 11 గంటలకు 7.52 లక్షల క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్టు నిండటంతో.. వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద క్రమంగా తగ్గుతుండటంతో.. శుక్రవారం నుంచి ప్రాజెక్టుల్లో వాటి సామర్థ్యాన్ని బట్టి నిల్వను పెంచడానికి అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. ఉజ్జయినితోపాటు తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయిలో నిండింది. తుంగభద్రకు 66 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 80 వేల క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు.

### శ్రీశైలానికి స్థిరంగా వరద

మరోవైపు ఎగువ నుంచి శ్రీశైలానికి భారీ ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. గురువారం రాత్రి 11 గంటల వరకు శ్రీశైలం ప్రాజెక్టుకు 8.54 లక్షల పైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జలాశయంలో 885 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికిగాను 881.70 అడుగుల స్థాయిలో 197.46 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఏపీ కుడిగట్టు ద్వారా 31,749 క్యూసెక్కులు, తెలంగాణ ఎడమగట్టు ద్వారా 38,140 క్యూసెక్కుల నీటితో కరంట్ ఉత్పత్తి చేస్తున్నారు. గురువారం రాత్రి పది గంటల వరకు శ్రీశైలం నుంచి అవుట్‌ఫ్లో 8.62 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది.

### సాగర్‌కు పెరిగిన వరద

మరోవైపు నాగార్జునసాగర్‌కు వరద పెరిగింది. సాగర్‌కు 8.18 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో కూడా దాదాపు 8.18 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. గురువారం రాత్రి పది గంటల సమయానికి 304.47 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి కాల్వకు 6,324 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 2,400 క్యూసెక్కుల డిశ్చార్జీ కొనసాగుతున్నది. ప్రకాశం బరాజ్‌కు భారీ ఎత్తున కృష్ణాజలాలు వస్తుండటంతో దిగువకు 6.44 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. గురువారం రాత్రి వరకు 70 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలో కలిశాయి.



గురువారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దుంకుతున్న జలాల వద్ద పర్యాటకుల సందడి

**కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో గురువారంనాటి నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1701.28 | 129.72 | 103.16 | 494260 | 550000 |
| నారాయణపుర | 1615.00 | 1606.14 | 37.64 | 26.35 | 540000 | 527300 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 17129 | 10939 |
| జూరాల | 1045.00 | 1038.39 | 9.66 | 6.08 | 706000 | 690315 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.51 | 66344 | 80438 |
| శ్రీశైలం | 885.00 | 881.70 | 215.81 | 197.46 | 854654 | 860915 |
| నాగార్జునసాగర్ | 590.00 | 586.80 | 312.05 | 304.47 | 818597 | 818587 |
| పులిచింతల | 175.00 | 170.29 | 45.77 | 38.84 | 752997 | 760997 |

# ఉన్నత విద్యకు సహకారం

- మాజీ సైనికుడి కుమార్తెకు సాయం అత్యంత సంతోషాన్నిచ్చింది
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



తెలంగాణభవన్‌లో విద్యార్థిని మహాలక్ష్మికి ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్య్ర దినోత్సవం రోజున మాజీ సైనికుడి కూతురు ఉన్నత విద్య కోసం సహకారం అందించడం అత్యంత సంతోషాన్నిచ్చిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. తెలంగాణభవన్‌లో గురువారం జాతీయజెండా ఎగురవేసిన అనంతరం మాజీ సైనికుడు వీరభద్రాచారి కూతురు మహాలక్ష్మి ఉన్నత విద్య కోసం అవసరమైన చెక్కును కేటీఆర్ స్వయంగా అందించారు. తన కూతురు తెలంగాణ ఏవియేషన్ అకాడమీలో శిక్షణ పొంది పైలట్‌గా మారాలనుకుంటున్నారని, అంత ఆర్థికస్తోమత లేనందున సహాయం చేయాల్సిందిగా ఈ నెల 10న కేటీఆర్‌ను ట్విట్టర్ ద్వారా వీరభద్రాచారి కోరారు. 'ఒక సైనికుడిగా మీ ధైర్యసాహసాలు అమూల్యమైనవి. ఉన్నత విద్యకు సహకరిస్తా' అని కేటీఆర్ ట్విట్టర్‌లో భరోసాఇచ్చారు. తెలంగాణ ఏవియేషన్ అకాడమీ డైరెక్టర్ భరత్‌తో ఫోన్‌లో మాట్లాడి వీరభద్రాచారి కూతురు అడ్మిషన్ వివరాలు తెలుసుకున్నారు. గురువారం వీరభద్రాచారిని తెలంగాణభవన్‌కు పిలిపించారు. తెలంగాణ ఏవియేషన్ అకాడమీలో ఆయన కూతురు అడ్మిషన్ పొందేందుకు అవసరమైన ఆర్థికసహాయాన్ని కేటీఆర్ మిత్రుడి ద్వారా అందించారు. దేశ స్వాతంత్య్ర దినోత్సవం రోజున మాజీ సైనికునికి సహాయం అందించం కన్నా గొప్పగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోవడం ఏముంటుందని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# ప్రాణహితలో పెరిగిన ప్రవాహం

- భద్రాచలం దగ్గర పెరిగిన నీటిమట్టం
- శ్రీరాంసాగర్‌కు పెరుగని ఇన్‌ఫ్లోలు
- మధ్యమానేరుకు 1600 క్యూసెక్కుల జలాలు
- కొనసాగుతున్న గాయత్రి పంప్‌హౌస్ 4, 5 మోటర్ల వెట్‌రన్

జలాభిషేకం

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి/ జయశంకర్ భూపాలపల్లి ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** గోదావరికి వరద స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ, ప్రాణహితలో మళ్లీ ప్రవాహం పెరిగింది. దీంతో కాళేశ్వరం దగ్గర గురువారం సాయంత్రం వరకు 4.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని సాగునీటిశాఖ ఇంజినీర్లు తెలిపారు. గోదావరి 9.70 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది. ప్రాణహిత నది నుంచి గోదావరికి వరద కొనసాగుతుండటంతో.. లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌లో 55 గేట్లు ఎత్తి 3.61 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. గురువారం సాయంత్రం వరకు ఈ బరాజ్‌లో 4.584 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదేవిధంగా సరస్వతి (అన్నారం) బరాజ్‌కు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. సరస్వతి బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. గురువారం మధ్యాహ్నం రెండు గేట్లు తెరిచి 9,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మరోవైపు భద్రాచలం ఏజెన్సీలో గోదావరి మళ్లీ పెరుగుతున్నది. గత కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన గోదావరి గురువారం ఉదయం నుంచి మళ్లీ పెరిగింది. భద్రాద్రి వద్ద గురువారం రాత్రి పది గంటలకు 39.9 అడుగులకు చేరుకున్నది. పేరూరు మీదుగా వరద ప్రవాహం 3.70 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. ధవళేశ్వరం వద్ద గురువారం ఉదయం 4.40 లక్షల ఇన్‌ఫ్లో ఉన్నది. మరోవైపు శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లోలు ఇంకా తక్కువగానే ఉన్నాయి. గురువారం 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 389 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. జలాశయంలో నీటినిల్వ 90 టీఎంసీలకు గాను 17.18 టీఎంసీలుగానే ఉన్నది. కడెంకు కూడా వరద స్వల్పంగా పెరిగింది. గురువారం 2,015 క్యూసెక్కులు వస్తుండగా.. దిగువకు 880 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎల్లంపల్లి జలాశయానికి వరద కొంత తగ్గింది. ఇన్‌ఫ్లో 7853 క్యూసెక్కులు ఉండగా.. అంతేమొత్తంలో నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 20.17 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వకుగాను 19.62 టీఎంసీల నిల్వ ఉన్నది. మరోవైపు ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద 8.34 మీటర్లకు చేరింది. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 84.50 మీటర్లకు చేరుకున్నది. దీంతో రెండు మోటర్ల ద్వారా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఈ నీటి సంవత్సరంలో ఇప్పటి వరకు గోదావరి జలాలు 1342 టీఎంసీలు సముద్రంలో కలిశాయి.

### గాయత్రి పంప్‌హౌస్‌లో కొనసాగుతున్న వెట్‌రన్

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మధ్యమానేరు జలాశయానికి గురువారం 1600 క్యూసెక్కుల నీరు చేరింది. కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌లో 4, 5వ బాహుబలి మోటర్ల వెట్‌రన్ కొనసాగుతున్నది. ఈ రెండు మోటర్లను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మోటర్లు ఎత్తిపోసిన జలాలు మధ్యమానేరు జలాశయానికి చేరుకొన్నాయి. బుధవారం 2,600 క్యూసెక్కుల నీరు చేరగా గురువారం మరో 1,600 క్యూసెక్కులు చేరాయి. దీంతో మధ్యమానేరు జలాశయం కింద రైతులను అధికారులు అప్రమత్తంచేశారు.

### జల భాండాగారంగా తెలంగాణ

కాళేశ్వరం నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రం జల భాండాగారంగా రూపుదిద్దుకున్నదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌ను గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి సందర్శించారు. గాయత్రి పంపుహౌస్‌లోని డెలివరీ సిస్టర్న్ చేరుకొని ఐదోపంపు నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా మధ్యమానేరుకు వెళుతున్న కాళేశ్వరం నీటిని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేవలం మూడేండ్లలోనే అహర్నిశలు డిజైన్ చేసి పనులు పూర్తిచేసి ఆ ఫలాలను ఈ వర్షాకాలంలో రైతులకు అందించబోతున్నామన్నారు. గాయత్రి పంపుహౌస్‌లో అన్ని మోటర్ల ట్రయల్‌రన్ అయిపోయి పూర్తి సామర్థ్యంతో నీరు ఎత్తిపోసినట్టయితే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకునే అవకాశం ఉన్నదన్నారు. ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ కలిగేటి కవిత, విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు మంత్రి వెంట ఉన్నారు.



గురువారం రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్ వద్ద డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలు

**గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులలో గురువారంనాటి నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| సింగూరు | 1717.93 | 1670.49 | 29.91 | 0.46 | 0 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.36 | 17.80 | 0.14 | 26 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1062.90 | 90.31 | 17.18 | 2000 | 389 |
| లోయర్‌మానేర్ | 920.00 | 881.85 | 24.07 | 3.52 | 0 | 204 |
| మిడ్ మానేర్ | 1043.31 | 995.01 | 25.873 | 3.86 | 3078 | 83 |
| కడెం | 700.00 | 697.43 | 7.60 | 6.95 | 2015 | 880 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.91 | 20.18 | 19.62 | 7853 | 7850 |



గురువారం రాజ్‌భవన్‌లో చిన్నారులతో కలిసి రక్షాబంధన్ జరుపుకొంటున్న గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ
(తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ)
ప్రధాన కార్యాలయం, హైదరాబాద్

Tender No.TSWC/B4/H&T/ OG&IG/Tenders/1616/2016-17 టెండర్లు కోరుతూ ప్రకటన తేది: 13-08-2019

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల వద్ద (Own, IG & AMC) నిరంతర హ్యాండ్లింగ్ మరియు రవాణా కాంట్రాక్టర్లను నియమించుటకు ఆసక్తిగల పార్టీల నుండి ఇ-టెండర్లు కోరడమైనదీ: 1) సిద్దన్న పేట & గుర్రాల గొంది (Own) 2) జడ్చెర్ల (Own) 3) నల్గొండ (Own) (4) నేరేడుచెర్ల (Own) 5) హుజూర్‌నగర్ (Own) 6) ఖమ్మం I&II (Own) 7) కొత్తగూడెం (Own) 8) కరీంనగర్ (Own) 9) జమ్మికుంట (Own) (10) సారంగపూరు (Own) 11) కామారెడ్డి (Own) 12) మహబూబాబాద్ -I(IG) 13) మహబూబాబాద్ -II (IG) 14) అక్కారం (IG) 15) జహీరాబాద్ (IG) 16) జనగామ (యశ్వంతపూర్ (IG) 17) ఖానాపూర్ -I (IG) వరంగల్ (R) జిల్లా. 18) ఖానాపూర్ -II (IG) (వరంగల్ (R)జిల్లా) 19) వరంగల్ (ధర్మారం) IG 20) వంగపల్లి (IG) 21) కోదాడ (ద్వారకుంట) -II - IG 22) లీజ -IG 23) నార్కేట్‌పల్లి -IG 24) బాదలాపూరం -IG 25) కాలూరు -1 (IG) (దయానంద /జ్యోతి గోదాములు. 26) కాట్నపల్లి -IG 27) సుద్దాల -III (IG) 28) జనకంపేట -IG 29) జనగామ -వడ్లకొండ (PEG) 30) మదనపురం -వనపర్తి (AMC) 31) సదాశివపేట (AMC) 32) నరసాపూర్ (AMC) 33) స్టేషన్ ఘన్పూర్ (AMC) 34) కేసముద్రం (AMC) & నెల్లికుదూరు (AMC) 35) వెంకటాపురం (AMC) 36) మల్లారం, NZB(AMC) 37) గారెపల్లి (AMC) 38)లో కేశ్వరం (AMC) www.tswhc.co.in మరియు www.tenderwizard.com/TSWC వెబ్‌సైట్ల ద్వారా వివరాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

గమనిక: శాఖ/AMC గోదాములు కలిపి

సం/- మేనేజింగ్ డైరెక్టర్

DIPR RO No. 310-PP/CL/Advt/1/2019-20, Dt: 14/08/2019



దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అసువులుబాసిన వీరులకు వందనాలు. కశ్మీర్ బిడ్డ షా ఫైజల్‌కు ఎందుకు స్వేచ్ఛను నిరాకరిస్తున్నారు? కొన్నేండ్ల కిందటే ఐఏఎస్‌లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు అతనికి నీరాజనాలు పట్టారు. ఇవ్వాళ అతనితో ప్రజాభద్రతకు ముప్పు ఎలా ఏర్పడింది.


**పి.చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి**

కశ్మీరీ అక్కాచెల్లెండ్లు, అన్నాతమ్ముళ్లకు ఈ స్వాతంత్ర్య దినోత్సవం గొప్ప శుభోదయం. వారు ఆర్టికల్ 370 అనే సంకెళ్ల నుంచి విముక్తులయ్యారు. కశ్మీర్ అభివృద్ధికి ఒక నవశకం ఆరంభమైంది. కశ్మీర్, లద్దాఖ్‌లు ఇప్పుడు అభివృద్ధికి సంకేతంగా నిలుస్తాయి.

**యోగీ ఆదిత్యనాథ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**




1936

బెర్లిన్‌లో ముగిసిన 11వ వేసవి ఒలింపిక్ గేమ్స్.

1969

భారత నాలుగవ రాష్ట్రపతిగా వి.వి.గిరి ఎన్నిక.





1990

హింసాత్మక ఆందోళనలు తీవ్రమవ్వటంతో నెల్సన్ మండేలాతో అత్యవసరంగా సమావేశమైన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు ఎఫ్.డబ్ల్యూ.డీ క్లార్క్.

సిక్కింలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్)కు చెందిన పది మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు అధికార సిక్కిం క్రాంతికారీ మోర్చాలో చేరారు. మూన్నెళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఒక్కసీటు కూడా గెల్చుకోలేదు. కేవలం 1.6 శాతం ఓట్లు సాధించి కనిష్ఠ స్థాయిలో నిలిచిన పార్టీగా అట్టడుగున ఉన్నది. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో బీజేపీ నేతృత్వంలోని నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయెన్స్ అధికారం చేజిక్కించుకునే దిశగా అడుగులువేయటం గమనార్హం.

**ది హిందూ**

స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నవేళ.. గత పోరాట స్మృతులను నెమరేసుకోవటంతోనే సరిపుచ్చుకోకుండా విలువల గురించి కూడా ఆలోచించాల్సిన అవశ్యత ఉన్నది. 'ఎక్కడైతే తలెత్తుకొని.. ఏ విధమైన భయాలకు తావులేని స్వేచ్ఛా భారతం కోసం.. దేశమా మేల్కొను..' అంటూ ఠాగూర్ రాశారు. అలాగే 'ఏ ప్యాసేజ్ టు ఇండియా'లో ఇక్కడ అందరూ భయకూపంలోకి లాగబడుతున్నారని ఈఎం ఫర్‌స్టర్ రాశాడు. ఇప్పటి పరిస్థితులు దానికి భిన్నంగా ఏమీలేని స్థితిని చాటిచెప్పటం మనం ఎక్కడికి చేరుకుంటున్నామో చెబుతున్నాయి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# మోదీ అజెండా

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట మీదినుంచి చేసిన ప్రసంగం ద్వారా ప్రధాని మోదీ తన అభిప్రాయాలను, కార్యాచరణను స్పష్టంగా వెల్లడించారు. తన కార్యాచరణ వేగంగా సాగుతుందని, లోతైన సంస్కరణలు చోటుచేసుకుంటాయని ఆయన స్పష్టంచేశారు. వెనుకాముందు చూడకుండా తాను అనుకున్న దారిలో దూసుకుపోయే విధానం మనం ఇకముందు చూడబోతున్నాం. 21వ శతాబ్దపు భారత్ గురించి ఆలోచించవలసిన సమయమిదని ఆయన గుర్తు చేశారు. ప్రజల ఆలోచనాసరళి మారిందని, తదనుగుణంగా ప్రభుత్వం కొత్తగా ఆలోచించాలనేది మోదీ అభిప్రాయం. 'గతంలో ఒక రైల్వే స్టేషన్‌కు పథకం వేస్తే సంతోషించే వారు, కానీ ఇప్పుడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తమ ప్రాంతానికి ఎప్పుడొస్తుందని అడుగుతారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ మాత్రమే కాదు, విమానాశ్రయం కోసం అడుగుతున్నారు. ఒకప్పుడు మొబైల్ ఫోన్ కావాలనుకునేవారు, ఇప్పుడు మెరుగైన డేటా స్పీడ్ కోరుకుంటున్నారు. కాలం మారింది, దానిని మనం ఆమోదించాలె' అని ప్రధాని వివరించారు. దశలవారీగా ఎదుగుదల సరిపోదని, దేశం దూకుడు ప్రదర్శించాలనేది ప్రధాని ఆలోచన. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ విధానాలను స్వీకరించి, వేగంగా అడుగులు వేయాలంటున్నారు. మోదీ చేపట్టబోమే మార్పులు ఆర్థిక, పారిశ్రామిక విధానాలతో పాటు సామాజికరంగంలో కూడా కనిపించవచ్చు. ఏ మాత్రం సంకోచం లేకుండా వేగవంతమైన నిర్ణయాలు, విప్లవాత్మకమైన మార్పులు ఉంటాయనేది ప్రధాని ప్రసంగం ద్వారా అర్థమవుతున్నది.

దేశ పారిశ్రామికాభివృద్ధి ప్రధాని మోదీ అజెండాలో అత్యంత ప్రాధాన్యం పొందుతున్నది. దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేయాలనే దృఢ సంకల్పం మోదీ మాటల్లో కనిపిస్తున్నది. భారీ ఎత్తున ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం అనేది మోదీ విధానంగా ఇప్పటికే స్పష్టమైంది. వంద లక్షల కోట్లతో భారీ ఎత్తున మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టబోతున్నట్టు మోదీ తమ ప్రసంగంలో తెలిపారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి ఎగుమతులను పెంచాలని కూడా అన్నారు. దీనివల్ల గ్రామీణ ఆర్థికవ్యవస్థ కూడా మెరుగుపడుతుంది. వ్యాపార కౌశలాన్ని, సంస్కృతిని ప్రోత్సహించాలనే దృక్పథాన్ని కూడా వ్యక్తంచేశారు. సులభ వ్యాపారంలో భారత్‌ను యాభై స్థానాలలోపు నిలబెట్టాలని ప్రధాని భావిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం–190 దేశాల జాబితాలో భారత్ 142వ స్థానం నుంచి 77వ స్థానానికి ఎగబాకింది. ఈ 2019 జాబితాలో న్యూజిలాండ్ ప్రథమ స్థానంలో ఉంటే అమెరికా 8వ, చైనా 46వ స్థానాలలో ఉన్నాయి. విదేశాంగ విధానంలో అఫ్ఘానిస్థాన్‌కు ప్రాధాన్యం ఇవ్వబోతున్నట్టు ప్రధాని వెల్లడించారు. కొంతకాలంగా సాగుతున్న అఫ్ఘానిస్థాన్ చర్చలలో భారత్ వెనుకబడిందనే విమర్శలున్నాయి. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ పదవిని సృష్టించనున్నట్టు ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిపాదన కార్గిల్ యుద్ధం తర్వాత ముందుకువచ్చింది. సైన్య నిర్వహణలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భారీగా సైన్యాన్ని నిర్వహించడానికి బదులు వేగమైన కదలికలు ఉండే దళాల నిర్మాణం కొత్త పోకడ. అత్యాధునిక సాంకేతికాభివృద్ధిని మిళితం చేసుకోవడం, మిశ్రమ దళాల ఏర్పాటు కూడా ప్రధానం.

> **జనాభా నియంత్రణ అభిలషణీయమైనదే అయినప్పటికీ ప్రభుత్వం ఏ విధానాన్ని అనుసరిస్తుందనే అనుమానాలు నెలకొనడం సహజం. ప్రత్యేకించి అల్పసంఖ్యాకవర్గాలను దృష్టిలో పెట్టుకునే ఈ ఆలోచన చేస్తున్నారా, బలహీన వర్గాలపై ఈ ప్రభావం ఎట్లా ఉంటుందనే చర్చ సాగవచ్చు. అయితే దీనిపై చర్చ జరుగాలని ప్రధాని ప్రతిపాదించారు. 'ఒకే దేశం ఒకే విధానం' అనే మోదీ నినాదం కూడా సమాఖ్య తత్వాన్ని కోరుకునే భిన్న ప్రాంతాల వారికి అనుమానాలు కలిగేవిగా ఉన్నాయి.**

మోదీ తన ప్రసంగంలో 'జనాభా నియంత్రణ' అంశాన్ని ప్రస్తావించారు. 'జనాభా విస్ఫోటం రాబోయేతరాలకు పలు సమస్యలను సృష్టిస్తుంది. చిన్న కుటుంబ విధానాన్ని అనుసరించేవారు అభివృద్ధికి దోహదం చేస్తారు, ఇదొక రకమైన దేశభక్తి' అని ఆయన వివరించారు. జనాభా నియంత్రణ ప్రచారం 1970 దశకం నుంచే సాగుతున్నది. దీనివల్ల ఇప్పటికే కొన్ని ఉన్నతవర్గాల కుటుంబాలు ఒక కుమారుడు లేదా కుమార్తెతో సరిపెట్టుకుంటున్నాయి. సాధారణంగా సామాజిక సమూహాల ఆర్థిక, సాంఘిక అభివృద్ధికి జనాభా నియంత్రణ పాటించడానికి సంబంధం ఉంటుంది. జనాభా నియంత్రణ అభిలషణీయమైనదే అయినప్పటికీ ప్రభుత్వం ఏ విధానాన్ని అనుసరిస్తుందనే అనుమానాలు నెలకొనడం సహజం. ప్రత్యేకించి అల్పసంఖ్యాక వర్గాలను దృష్టిలో పెట్టుకునే ఈ ఆలోచన చేస్తున్నారా, బలహీన వర్గాలపై ఈ ప్రభావం ఎట్లా ఉంటుందనే చర్చ సాగవచ్చు. అయితే దీనిపై చర్చ జరుగాలని ప్రధాని ప్రతిపాదించారు. 'ఒకే దేశం ఒకే విధానం' అనే మోదీ నినాదం కూడా సమాఖ్య తత్వాన్ని కోరుకునే భిన్న ప్రాంతాల వారికి అనుమానాలు కలిగేవిగా ఉన్నాయి. ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనేది కూడా కేంద్రీకృత విధానంలో భాగం కావచ్చు. మోదీ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులు, అనుసరిస్తున్న విధానాలు గమనించిన వారికి కేంద్రీకృత ధోరణులు పెరిగిపోతున్నాయనే భయాందోళనలు కలుగుతున్నాయి. దేశాభివృద్ధి ఎంత అవసరమో ప్రజాస్వామ్యబద్ధమైన విధానాలు అనుసరించడం అంతకన్నా అవసరం. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నాటి పెద్దలు నిరంకుశ, ఏకపార్టీ వ్యవస్థలను కోరుకోలేదు. ప్రజల చైతన్యానికి అనుగుణమైనరీతిలోనే రాజకీయవ్యవస్థ ఉంటుందని వారికి తెలు సు. ప్రజలు కోరుకునేటువంటి అభివృద్ధిని వారు కోరుకున్న రీతిలోనే సాధించడం ప్రజాస్వామ్య లక్షణం. లక్ష్యమే కాదు, మార్గం కూడా ఉత్తమమైనదై ఉండాలనే గాంధీ హితవు అనుసరణీయం.

**జనగళం**

### అందరి బాధ్యత

స్వచ్ఛతే లక్ష్యంగా గ్రామాలు, పట్టణాల ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం ముదావహం. గ్రామాల్లో, పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. దీనికి అనుగుణంగా ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. అప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుంది. ఉపయోగంలో లేని బోర్లు ఎక్కడున్నా మూసివేయాలని ప్రభుత్వం కోరుతున్నది. ఇది మంచి నిర్ణయం. గతంలో ఈ బోరుబావుల వల్ల జరిగిన విషాద సంఘటనలు మన అనుభవంలో ఉన్నవే. కాబట్టి పౌర సమాజం ఇలాంటి బోరుబావుల సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి మూసివేయించాలి. ప్రజా సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలి.

**- ఎం.మోహన్, మంథని**

### అభినందనలు

వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో అద్భుత సెంచరీ సాధించి జట్టు విజయంలో కోహ్లీ కీలకపాత్ర పోషించాడు. అట్లనే ఈ దశాబ్దకాలంలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా కూడా కోహ్లీ రికార్డు సృష్టించారు. కెప్టెన్‌గా 21 సెంచరీలు సాధించి ఇతర యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తున్న కోహ్లీకి అభినందనలు. కోహ్లీ దేశానికి ఇలాంటి విజయాలు మరిన్ని అందించాలి. మరెన్నో రికార్డులు సాధించాలి.

**- జి.అజయ్, హైదరాబాద్**

### చైనా తీరు గర్హనీయం

కశ్మీర్ విషయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ మొదటినుంచి వ్యతిరేకిస్తున్నది. కానీ చైనా మొదటినుంచి పాకిస్థాన్ చర్యలకు పరోక్ష మద్దతు ఇస్తున్నది. ఒకవైపు భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తామని చెబుతూనే మరోవైపు కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వాదనకు వంతపాడటం గర్హనీయం. ఆసియాలోనే అతిపెద్ద ఆర్థికశక్తులుగా ఉన్న భారత్, చైనా దేశాలు సహృద్భావంతో మెలగాలి. అంతేగాని పాకిస్థాన్ చేసే కవ్వింపు చర్యలను సమర్థించేవిధంగా వ్యవహరించడం మంచిది కాదు. ఇప్పటికైనా చైనా తన వైఖరిని మార్చుకోవాలి..

**- బి.వేణుగోపాల్, సంగారెడ్డి**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

వ్యవసాయం



**డాక్టర్ పిడిగెం సైదయ్య**

# ఆహారశుద్ధికి చిరునామా

**దేశంలో వ్యవసాయరంగానిది విచిత్ర పరిస్థితి. అనావృష్టి వస్తే పంటలు పండవు, ధరలు బాగుంటాయి. వానలు బాగా పడితే పంటలు పండుతాయి, ధరలు పడిపోతాయి. వీటిని అధిగమించేందుకు ఉన్న అవకాశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రధానమైనదని ముఖ్యమంత్రి గుర్తించాడు. త్వరగా చెడిపోయే గుణమున్న ఆహారపదార్థాలతోను ఎక్కువకాలం నిల్వ ఉంచుకొని ఉపయోగించుకోవచ్చు. మిగతా అన్నిరంగాలతో పోలిస్తే ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి.**

రాష్ట్రంలోని ప్రజలకు కల్తీ లేని ఆహారాన్ని అందించటంతో పాటు రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన. అందుకే 'ఫుడ్ ప్రాసెసింగ్' రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే మన రాష్ట్రం విత్తనరంగంలో అగ్రగామిగా ఉన్నది. త్వరలోనే ఫుడ్ ప్రాసెసింగ్‌కు చిరునామా కాబోతున్నది. ఈ దిశగా ఎదుగడానికి కావలసిన ముడిసరుకులతో పాటు జాతీయ, అంతర్జాతీయ రవాణా సదుపాయాలు, శీతల గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయి. ఈ విధానంతో విలువల జోడింపు కూడా సాధ్యం. అలాగే పంటల వైవిధ్యీకరణ, రైతులకు గిట్టుబాటు ధర, ఉపాధి, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పారిశ్రామికీకరణ సాధ్యమవుతుంది. దీంతో పాటు ఆహారభద్రతకు ఊతమివ్వటంతో పాటు ఆహార ద్రవ్యోల్బణాన్ని అరికట్టవచ్చు.

దేశంలో వ్యవసాయరంగానిది విచిత్ర పరిస్థితి. అనావృష్టి వస్తే పంటలు పండవు, ధరలు బాగుంటాయి. వానలు బాగా పడితే పంటలు పండుతాయి, ధరలు పడిపోతాయి. వీటిని అధిగమించేందుకు ఉన్న అవకాశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రధానమైనదని ముఖ్యమంత్రి గుర్తించాడు. త్వరగా చెడిపోయే గుణమున్న ఆహారపదార్థాలతోను ఎక్కువకాలం నిల్వ ఉంచుకొని ఉపయోగించుకోవచ్చు. మిగతా అన్నిరంగాలతో పోలిస్తే ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయ, ఉద్యాన, పౌల్ట్రీ, ఉత్పత్తుల్లో తెలంగాణది ప్రత్యేక స్థానం. పసుపు, బత్తాయి, నిమ్మ ఉత్పత్తులలో తెలంగాణకు ప్రత్యేకత ఉన్నది. ఎండు మిరప, మక్కజొన్న ఉత్పత్తులలో రాష్ట్రం మూడో స్థానంలో ఉన్నది. కోడి గుడ్ల ఉత్పత్తిలోనూ రాష్ట్రానిది 3వ స్థానం. ప్రత్యేకించి ఉద్యాన పంటలలో దేశంలో ఏ రాష్ట్రానికి లేని అనుకూల వాతావరణం తెలంగాణలో ఉన్నది. అందుకే మొత్తం పండ్ల ఉత్పత్తిలో పదో స్థానంలో ఉండగా, విస్తీర్ణం పరంగా మూడవ స్థానం మనది. మాంసం ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం ఐదవ స్థానంలో ఉన్నది.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలు కొన్ని పంటలకు ప్రత్యేక సాగు, ఉత్పత్తి క్లస్టర్లుగా ఉన్నాయి. నల్గొండ, సూర్యపేట, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలు వరి; వరంగల్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, నిజామాబాద్, జనగాం, పెద్దపల్లి మక్కజొన్న; సంగారెడ్డి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, కరీంనగర్, మెదక్ జిల్లాలు మామిడి; నల్ల గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలు బత్తాయి, నిమ్మ పంటలకు అనుకూలమైనవి. ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో పాల ఉత్పత్తులు; మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలలో గుడ్లు, కోడి మాంసం బాగా ఉత్పత్తవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు ప్రాసెసింగ్‌కు అనుకూలం. వీటితోపాటు రంగారెడ్డి, వికారాబాద్, జిల్లాల్లో అపరాలు; వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్, నల్గొండ జిల్లాల్లో వం టనూనె ప్రాసెసింగ్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఖమ్మం, నల్గొండ నిజామాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలలో ప్యాకేజ్డ్ ఫుడ్ ప్రాసెసింగ్; రంగారెడ్డి, కామారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలలో–డైరీ ప్రాసెసింగ్‌కు; హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో స్నాక్స్, బేకరీ పుడ్లకు మేజర్ ప్రాసెసింగ్ క్లస్టర్లున్నాయి. ఆయా ప్రాంతాలు, జిల్లాల్లో ముడిసరుకులు, వ్యవసాయోత్పత్తులు తక్కువ ధరతో కావాల్సిన మొత్తంలో ఉన్నాయి. కాబట్టి ఈ జిల్లాలు వ్యవసాయ ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధికి, కొత్త పరిశ్రమల స్థాపన కు దోహదపడుతాయి.

వ్యవసాయం పట్ల ఇష్టం, రైతు ఉన్నతి, వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రూపకల్పన చేసిన పలు పథకాలు రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ పథకాలు పలు దేశాలకు, రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఫలితంగా ఫుడ్ ప్రాసెసింగ్‌కు అవకాశాలు పెరిగాయి. 'మిషన్ కాకతీయ' ద్వారా చెరువుల పునరుద్ధరణతో లక్షల హెక్టార్లకు అదనంగా సాగునీరు అందుతున్నది. సాగునీటి కింద ఉన్న విస్తీర్ణం రెండింతలయ్యింది. ఫలితంగా వ్యవసాయ–ఉద్యాన ఉత్పత్తులు పెరిగాయి. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంతో కోటి ఎకరాల మాగాణి సాగు సాకారం కానున్నది. దీంతో అన్ని పంటలలో ఉత్పాదకత పెరిగింది. అయితే ఇప్పుడు పెరిగిన ఉత్పాదకతతో ధరలు పడిపోకుండా చూడాలి. రైతుల నుంచి గిట్టుబాటు ధరలకు సేకరించాలి. ఇందుకు పరిష్కారం ఫుడ్ ప్రాసెసింగ్. ఈ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించగలిగే సత్తా తెలంగాణ రాష్ట్రానికి ఉన్నది.

2022 నాటికి రాష్ట్రంలో రైతుల ఆదాయాలు భారీగా పెరుగుతాయి. రెట్టింపునకు ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీతో 15.8 శాతం పైనే పెరుగనున్నాయి. నిల్వ మౌలిక సదుపాయాల కల్పన (2.5 శాతం), లైవ్‌స్టాక్ మద్దతు(6.6 శాతం), నీలి విప్లవం (6.6 శాతం), మార్కెట్ సంస్కరణలు (9.1 శాతం), క్షీర విప్లవం (10.41 శాతం), సాగునీటి ప్రాజెక్టుల (15.81) ఆదాయ పెరుగుదలకు దోహదపడుతాయి. సహజంగా పెరిగే ఆదాయాలు 37.5 శాతం మేర ఉంటాయి. వీటన్నింటిలో ప్రాసెసింగ్‌కు మహర్దశ రానుంది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు కావలసిన మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో ఉన్నాయి. 151 మార్కెట్ యార్డులు, 44 ఈ–నామ్ మార్కెట్‌లు, రెండు మిలియన్ టన్నుల మేర హౌజింగ్ సామర్థ్యం, రెండు లక్షల టన్నుల శీతల గిడ్డంగుల సామర్థ్యం, అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా లక్షల టన్నుల కార్గ్ కెపాసిటీ, 8500 టన్నుల సాలీనా త్వరగా చెడిపోయే ఆహార ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతున్నాయి.

> **పొలాల్లో పంట కోత అనంతరం నుంచి మార్కెట్‌కు చేరే లోపు నష్టాలు ఎక్కువగా ఉన్నాయి. పండ్లు, కూరగాయలలో 30-50 శాతం, పప్పుధాన్యాలలో 20-30 శాతం, ఆహారధాన్యాలలో 5-10 శాతంపైనే నష్టం జరుగుతుంది. ఫుడ్‌ప్రాసెసింగ్ ద్వారా ఈ నష్టానికి అడ్డుకట్ట వేయవచ్చు. దీంతోపాటు రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఈ తరహా ఉత్పత్తులలో మొత్తం ఆహార పదార్థాలలో 35 శాతం వాటా ఉన్నది. కానీ దేశవ్యాప్తంగా అందులో రెండు శాతం కూడా ప్రాసెసింగ్ చేయడం లేదు.**

రాష్ట్రంలో పలు ఆహార పదార్థాల విలువ జోడింపునకు అపార అవకాశాలున్నాయి. చిరుధాన్యాలకు ఆదరణ పెరుగుతున్నది. కార్న్‌ఫ్లేక్స్, మూసెల్లీ, రైస్‌ఫ్లేక్స్ రూపంలో విలువల జోడింపు అవకాశాలున్నాయి. దేశంలో మన రాష్ట్రం పసుపు ఉత్పత్తిలో మొదటిస్థానం, ఎండుమిరపలో రెండవస్థానంలోఉన్నది. దీంతో పసుపు, మిరప పొడుల వ్యాపారానికి అవకాశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మక్కజొన్న స్టార్చ్ కు మార్కెట్ విలువ పెరుగుతున్నది. దేశంలో దీని వినియోగ రేటు 6 శాతం పైనే. డెక్ట్రోస్జ్, సార్బిటాల్, గ్లూకోజ్ స్టార్చ్ ఉత్పత్తులు, వాటి ఆధారిత ఉత్పత్తులను ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా తయారుచేసుకోవచ్చు. సజ్జ, జొన్న, రాగి, కొర్ర, సామల వంటి చిరుధాన్యాలు రాష్ట్రంలో పుష్కలంగా ఉత్పత్తవుతున్నాయి. వీటితో పాస్తా, వెర్మిసెల్లి, నూడిల్స్‌లకు మార్కెట్ డిమాండ్ పెరుగుతుంది. పండ్లు, కూరగాయలతో చేసే ప్యాకేజ్డ్ పండ్ల రసాలు, డీహైడ్రేటెడ్ ఉత్పత్తులకు డిమాండు ఉన్నది. మొత్తం ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల మార్కెట్‌లో ఇవి 28 శాతం. కాబట్టి 'ప్రాసెస్డ్ ఉత్పత్తులకు ముడిసరుకుతో పాటు మంచి మార్కెటింగ్ అవకాశాలు రాష్ట్రంలో ఉన్నాయి.

దేశంలోనే గొర్రెల మాంసం అత్యధికంగా అందుబాటులో ఉన్న రాష్ట్రం తెలంగాణ. 75 శాతం సబ్సిడీపై పాలిచ్చే బర్రెలను ప్రభుత్వమే రైతులకు అందిస్తున్నది. దీంతో పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని చెరువుల్లో 40 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. హరితగృహాల సంఖ్యను 95 శాతం సబ్సిడీ అందిస్తూ వాటి సంఖ్యను గణనీయంగా పెంచింది. ఫలితంగా కూరగాయల, పూల ఉత్పత్తి పెరిగింది. ఫలితంగా గిట్టుబాటు ధరలు రావాలంటే కొత్త మార్కెట్‌లు అందిపుచ్చుకోవాలి. లేదా విలువల జోడింపు ప్రాసెసింగ్ ద్వారా కొత్త మార్కెట్‌ను సంపాదించుకోవాలి.

పొలాల్లో పంట కోత అనంతరం మార్కెట్‌కు చేరే లోపు నష్టాలు ఎక్కువగా ఉన్నాయి. పండ్లు, కూరగాయలలో 30–50 శాతం, పప్పుధాన్యాలలో 20–30 శాతం, ఆహారధాన్యాలలో 5–10 శాతంపైనే నష్టం జరుగుతుంది. ఫుడ్‌ప్రాసెసింగ్ ద్వారా ఈ నష్టానికి అడ్డుకట్ట వేయవచ్చు. దీంతోపాటు రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. కానీ దేశవ్యాప్తంగా అందులో రెండు శాతం కూడా ప్రాసెసింగ్ చేయడం లేదు. అదే మలేషియాలో 83 శాతం, ఫిలిప్పీన్స్‌లో 78 శాతం, చైనాలో 23 శాతం పైగా ప్రాసెసింగ్ చేయబడుతున్నాయి. కాబట్టి ఈ రంగాలలో ప్రాసెస్డ్ ఆహారానికి మన దేశంలో మంచి భవిష్యత్ ఉన్నది.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని తీసుకొచ్చింది. సీఎం అన్నట్టు ప్రతి నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పితే, ఆయా ప్రాంతాల్లో పండే పంటలకు మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుంది. తద్వారా ఉపాధి పెరుగుతుంది. ప్రాసెసింగ్‌కు అన్నిరకాల పంటలు అనుకూలం కాదు. కాబట్టి 'ప్రాసెసింగ్'కు సరిపోయే పంట రకాలపై పరిశోధనలు జరుగాలి. అదేవిధంగా రైతులను ఐక్యం చేయాలి. వారితోనే స్టార్టప్‌లు ఏర్పాటుకు కృషిచేయాలి. పంటల క్లస్టర్లు ఏర్పాటుచేసి, వీటిని పంటల కాలనీతో అనుసంధానం చేయాలి. అప్పుడు ఈ ఫుడ్ ప్రాసెసింగ్‌తో రాష్ట్రంలోని రైతులకు అదనపు ఆదాయమార్గం లభిస్తుంది.

**(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)**

# వికేంద్రీకరణతో వికాసం

విశ్లేషణ



**గోసుల శ్రీనివాస్ యాదవ్**

2014 ఎన్నికల తర్వాత నాలుగున్నరేండ్ల పాలనలో తనదైన శైలిలో అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రజలందరికీ అందేలా చేశా రు సీఎం కేసీఆర్. సాగునీటి కోసం 'మిషన్ కాకతీయ', తాగునీటి అవరాల కోసం 'మిషన్ భగీరథ' వంటి ప్రజాహిత కార్యక్రమాలను ప్రారంభించిన ఘనత ఆయనది. తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో స్వల్పకాలంలోనే కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేసిన అపరభగీరథుడు కేసీఆర్. కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ తెలిసినవే. ముందెన్నడూ లేనివిధంగా సంక్షేమాన్ని సమ్మిళితం చేసిన పద్ధతి అద్వితీయం. స్వయంపాలనలో అందరికీ సంక్షేమం అందాలనే లక్ష్యంతో పోరాడి సాధించిన తెలంగాణలో ఇవన్నీ ఒకెత్తయితే పాలనపరంగా సౌలభ్యం కోసం, ఇంటి ముందుకు పాలన తీసుకురావడం హర్షణీయమని తెలంగాణ ప్రజలు ఆయనను కీర్తిస్తున్నారు.

పాలనా సౌలభ్యం కోసం, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనే సంకల్పంతో పది జిల్లాలున్న తెలంగాణను, ముప్పై మూడు జిల్లాలుగా రూపొందించారు. మండలాల సంఖ్యను పెంచారు. గూడాలను పంచాయితీలుగా మార్చింది తెలంగాణ ప్రభుత్వం. మా తండాల్లో మా రాజ్యం నినాదానికి కార్యరూపం ఇచ్చారు. కొత్త గ్రామపంచాయితీల ఏర్పాటు అధికార వికేంద్రీకరణకు మంచి ఉదాహరణ. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటానికి ఈ ప్రక్రియ ఎంతో దోహదం చేసింది. ప్రజలు తమ జిల్లాలకు, మండలాలకు, గ్రామ పంచాయతీలకు వెళ్లడానికి దూరాన్ని తగ్గించింది. సమయం వృథాను అరికట్టింది. శ్రమనూ తగ్గించింది. ప్రభుత్వం, పాలన తన దగ్గరికొచ్చిందన్న విశ్వాసాన్ని కలిగిచింది. జిల్లాల విభజనను కూడా ప్రతిపక్షాలు విమర్శించాయి. వాస్తవాలను చూడకుండా విమర్శించడమే ప్రతిపక్షాల పని. కేసీఆర్ గ్రామ పంచాయతీల, మండలాల, జిల్లాల సంఖ్యను పెంచి ప్రజలకు చేరువయ్యారు. కేసీఆ ర్ తీసుకున్న ఈ చర్యల వల్ల ప్రజల ముంగిటికి పాలన ఎలా వచ్చిందో, తాము కూడా పాలనలో భాగమేనన్న భావం ఎలా కలిగిందో పరిశీలిద్దాం.

ఇంతవరకు గిరిజన తండాలు ముఖ్యంగా లంబాడి తండాలు ఓ ఊరుగాను పంచాయతీ కింద ఉండేవి. ఏ చిన్న పనికైనా సరే ఈ తండా ప్రజలు ఆ గ్రామానికి వెళ్ళవలసి వచ్చేది. ఆ తండా నుంచి ఓ పంచాయతీ మెంబరున్నా సర్పంచ్, ఇతర అధికారులంతా ఆ గ్రామానికి చెందినవాళ్లే. ఈ తండాలు ఆ గ్రామ పంచాయతీ కింద ఉప గ్రామంగా మాత్రమే ఉండేవి. ఈ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం వల్ల వాటికి గ్రామ ప్రతిపత్తి వచ్చింది. ప్రత్యేక నిధులనిచ్చారు. ఆ తండాల నుంచే సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. గ్రామ పరిపాలనా పగ్గాలు ఆ గిరిజన తండాల చేతుల్లోకి వచ్చాయి. ఇందంతా అభివృద్ధికరమైన చర్యలే అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఇవ్వాలన్న మానవీయ ప్రతిపాదన కు ఇది అతి దగ్గరగా ఉన్నది. ఇప్పుడు తండా నుంచి సర్పంచ్‌లు ఎంపీటీసీలుగా వెళ్లే అవకాశం మరింత మెరుగైంది. ఇలా ఆనాదిగా ఓటర్లుగా మిగిలిపోయిన గిరిజనతండవాసులు నేడు పాలకులుగా ఆత్మగౌరవంతో వారి తండాలను వారే పరిపాలించుకుంటున్నారు.

జిల్లాల సంఖ్యను పెంచడం వల్ల ప్రజలకు చెప్పలేనన్ని ప్రయోజనాలు చేకూరాయి. జిల్లా కేంద్రానికి ఒకప్పుడు సామాన్య ప్రజలు చేరు కోవాలంటే ఐదారు గంటలు పట్టేది. ఏ చిన్న పని కోసమైనా జిల్లా కేంద్రానికి రావాలంటే రోజంతా వృథా అయ్యేది. భరించరాని ఖర్చు. ఉదాహరణకు సిర్‌పూర్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే 6 గంటలు పట్టేది. రావడానికి మరో 6 గంటలు. పనికాకుంటే అక్కడే ఉండాలి. ఇప్పుడు మంచిర్యాల జిల్లా కేంద్రం కావడం వల్ల రెండున్నర గంటల్లో రాగలుగుతున్నారు. పనిచేసుకొని ఇంటికెళ్తున్నారు. ఏ కారణం చేతనైనా పనికాకుంటే తెల్లవారి రావచ్చు. దీంతో ఖర్చు, సమయం ఆదా అవుతున్నది. ఇటు ప్రజలకు, అటు అధికారులకు దురాభారం తగ్గింది. అంబేద్కర్ చెప్పిన చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఎంత ప్రజాస్వామ్యమో చిన్న జిల్లాల ఏర్పాటు కూడా అంతే ప్రజాస్వామికం. లంబాడీ తండాలకు గ్రామ పంచాయతీ హోదా ఇచ్చి గాంధీ చెప్పిన గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేశారు కేసీఆర్. చిన్న జిల్లాలను చేసి ప్రజల వాకిళ్లలోకి అధికారులను నడిపించా రు. కలెక్టర్లు, విద్యాధికారులు, పోలీసు అధికారులను, జిల్లా పరిషత్ చైర్మన్‌ను, ఇతర అధికారుల ను, ప్రజాప్రతినిధులను కలువడానికి సామాన్య మానవులకు మార్గం సుగమమైంది. జిల్లాల విభజనతో ఆ జిల్లాలో అన్ని ప్రాంతాలపై దృషిపెట్టే అవకాశాలు మెరుగయ్యాయి.

10 జిల్లాల నుంచి 33 జిల్లాలు కావడం వల్ల అనేకమందికి పదోన్నతులు లభించడమే కాకుండా ఉద్యోగావకాశాలు కూడా మెరుగయ్యాయి. చిన్నచిన్న టౌన్‌లుగా ఉన్న కొత్త జిల్లా కేంద్రాలు పెద్ద పట్టణాలుగా అభివృద్ధిచెందే అవకాశాలు పెరిగాయి. జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న గ్రామాలు కేంద్రంలో కలిసిపోవడమే కాకుండా ఆయా గ్రామాల్లో భూముల ధరలు పెరిగాయి. జిల్లాల విభజనతో అధికార వికేంద్రీకరణ జరుగడమే కాకుండా అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజల ఇళ్లల్లకు చేరు తున్నాయి.

> **తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, మండలాల సంఖ్యను పెంచి, జిల్లాల సంఖ్యను పెంచి స్వయం పాలనకు, ప్రజల ముంగిట్లోకి పాలన, అధికార వికేంద్రీకరణ తద్వారా తెలంగాణ ఆత్మ గౌరవానికి ద్వారాలు తెరిచారు సీఎం కేసీఆర్. ఇదివరకెప్పుడూ లేని అనేకానేక సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలతో పాటు పాలనాపరమైన సంస్మరణలు చేసి న ప్రజాబంధు కేసీఆర్ ఈ వినూత్న కార్యక్రమాల వల్లనే మరోసారి తెలంగాణలో అధికారంలోకి వచ్చారు.**

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, మండలాల సంఖ్యను పెంచి, జిల్లాల సంఖ్యను పెంచి స్వయం పాలనకు, ప్రజల ముంగిట్లోకి పాలన, అధికార వికేంద్రీకరణ తద్వారా తెలంగాణ ఆత్మ గౌరవానికి ద్వారాలు తెరిచారు సీఎం కేసీఆర్. ఇదివరకెప్పుడూ లేని అనేకానేక సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలతో పాటు పాలనాపరమైన సంస్మరణలు చేసిన ప్రజాబంధు కేసీఆర్ ఈ వినూత్న కార్యక్రమాల వల్లనే మరోసారి తెలంగాణలో అధికారంలోకి వచ్చారు. ప్రజల మనసులను గెలుచుకున్న గొప్ప వ్యక్తి కేసీఆర్ అనడంలో సందేహం లేదు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## ప్రధాని పంద్రాగస్టు సందేశంతో స్ఫూర్తి

- ప్లాస్టిక్, వ్యర్థాలు సేకరించిన విద్యార్థులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వద్ద జాతీయ జెండా ఎగురవేసిన తర్వాత ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగ రహిత భారత్‌కు అక్టోబర్ 2న ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజకీయ సర్వోదయ విద్యాలయ, సర్వోదయ కన్యా విద్యాలయకు చెందిన విద్యార్థులు ప్రధాని సందేశంతో స్ఫూర్తి పొందారు. కార్యక్రమం అనంతరం అందరూ వెళ్లిపోయాక స్వచ్ఛ భారత్‌కు శ్రీకారం చుట్టారు. ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన వారు పడేసిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వారు సేకరించారు. అక్కడ ఏర్పాటు చేసిన డబ్బాలలో వాటిని పారవేశారు. తమ విద్యార్థులు స్వచ్ఛందగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ఉపాధ్యాయుడు రాజ్ కుమార్ మౌర్య తెలిపారు.



ప్రధాని మోదీతో కరచాలనానికి పోటీ పడుతున్న విద్యార్థులు

## మోదీతో కరచాలనానికి పోటీపడ్డ విద్యార్థులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గురువారం ప్రధాని మోదీతో కరచాలనం చేయడానికి పాఠశాల విద్యార్థులు పోటీ పడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం అనంతరం ప్రధాని మోదీ అందరికీ అభివాదం చేస్తూ తన కాన్వాయ్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వేల మంది విద్యార్థులను చూసిన మోదీ కారు దిగి, సెక్యూరిటీ నిబంధనలను పక్కకుపెట్టి వారి వద్దకు వెళ్లారు. దీంతో ఆనందానికి గురైన విద్యార్థులు ప్రధానితో కరచాలనం చేయడానికి పోటీపడ్డారు. అంతదగ్గర నుంచి మోదీని చూస్తానని అస్సలు ఊహించలేదని ఓ విద్యార్థి ఆనందం వ్యక్తం చేశాడు.



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్





రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొన్న త్రివిధ దళాధిపతులు కరమ్‌బీర్ సింగ్ (నౌకాదళం), బిపిన్ రావత్(ఆర్మీ), బీఎస్ ధనోవా(వాయుసేన)

# మరో మెట్టుకు మన సైన్యం

త్వరలో త్రివిధ దళాల ప్రధానాధికారిని నియమిస్తాం ■ దేశ సైనిక వ్యవస్థకు నాయకత్వం, త్రివిధ దళాల సమన్వయమే లక్ష్యం

- ఆర్టికల్ 370 రద్దుతో 'ఒకే దేశం-ఒకటే రాజ్యాంగం' కల నెరవేరింది
- రూ.3.5 లక్షల కోట్లతో జల్ జీవన్ మిషన్.. 2024 నాటికి ప్రతి ఇంటికీ నల్లా నీరు
- దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించండి
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ పిలుపు
- 95 నిమిషాలపాటు సుదీర్ఘంగా సాగిన ప్రసంగం



గురువారం ఎర్రకోటపై జెండా ఎగురవేసిన అనంతరం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 15:** మన దేశ మిలిటరీ సంస్కరణల్లోనే కీలకమైన అడుగుగా భావిస్తున్న 'త్రివిధ దళాల ప్రధానాధికారి' (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్) వ్యవస్థ త్వరలోనే కార్యరూపం దాల్చనున్నది. దేశ సైనిక వ్యవస్థకు నాయకత్వం వహించడంతోపాటు త్రివిధ దళాల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు త్వరలో సీడీఎస్ నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ గురువారం ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. దాదాపు గంటన్నరకుపైగా సాగిన ప్రసంగంలో 'నవ భారత నిర్మాణం' లక్ష్యంగా తన ప్రణాళికను ఆవిష్కరించారు. 70 ఏండ్లలో తీసుకోలేని ఎన్నో నిర్ణయాలను 70 రోజుల్లోనే తీసుకున్నామని చెప్పారు. ఇంటింటికీ నల్లా నీళ్లు అందించేదుకు 'జల్ జీవన్ మిషన్'ను ప్రకటించారు. ఇంకా అనేక అంశాలను ప్రస్తావించారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

**భారత్‌కు సైతం 'సీడీఎస్'**

దేశ భద్రతలో ఎదురవుతున్న సవాళ్లను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు సైనిక సంస్కరణలు తప్పనిసరి. యుద్ధ తంత్రాలు వేగంగా మారిపోతున్నాయి. మనం గిరిగీసుకొని కూర్చుంటే సరిపోదు. మన భద్రతా బలగాలు దేశ గౌరవానికి ప్రతీకలు. త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరుచాల్సి ఉన్నది. అందుకే ఎర్రకోట సాక్షిగా కీలక ప్రకటన చేస్తున్నా. త్వరలో త్రివిధ దళాల ప్రధానాధికారిని నియమిస్తాం. ఆయన త్రివిధ దళాలకు నేతృత్వం వహిస్తారు. వాటి మధ్య సమన్వయాన్ని పెంచుతారు.

### దేశంలోనూ పర్యటించండి

'ఏటా రెండు కోట్ల మంది భారతీయులు విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. మీరు మనదేశంలోనూ పర్యటించండి. 2022 నాటికి 15 పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని లక్ష్యంగా పెట్టుకోండి. మీరు ఒక్కసారి స్వదేశీ పర్యటనలు ప్రారంభిస్తే కచ్చితంగా వసతులు మెరుగుపడతాయి. యువతకు ఉపాధి దొరుకుతుంది. మన దేశ సంపదను పిల్లలకు పరిచయం చేస్తే, వారు మన మూలాలను అవగతం చేసుకుంటారు'.

**జమ్ము ప్రజలకు చేయూతనిద్దాం**

ఆర్టికల్ 370, 35-ఏ వల్ల జమ్ముకశ్మీర్‌లో అవినీతి పెరిగిపోయింది. అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగింది. అందుకే రద్దుచేశాం. ఇకపై జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రజలు తమ ఆశలు, ఆశయాలను నెరవేర్చుకునే క్రమంలో 130 కోట్ల మంది భారతీయులు మద్దతుగా నిలువాలి. ఇది మనందరి బాధ్యత.

**ఇంటింటికీ నల్లా నీళ్లు**

2024 నాటికి దేశంలోని ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం 'జల్ జీవన్' మిషన్‌ను ప్రకటిస్తున్నా. దీనికోసం రాబోయే కాలంలో మొత్తం రూ.3.5 లక్షల కోట్లకుపైగా వెచ్చిస్తాం. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తాయి. అదే సమయంలో నీటి సంరక్షణ, పునర్వినియోగంపై దృష్టిసారిస్తాం. మరికొన్ని వారాల్లోనే భారత్‌ను 'బహిరంగ మల విసర్జన రహిత దేశం'గా ప్రకటిస్తామనే నమ్మకం నాకు ఉన్నది.

**జనాభాను నియంత్రిద్దాం**

జనాభా విస్ఫోటనం మనకు అనేక సమస్యలను తెచ్చిపెడుతున్నది. ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలు కూడా ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చిన్న కుటుంబాల గురించి అవగాహన పెంచుకోవాలి. తద్వారా కుటుంబానికి, దేశానికి మేలుచేసినవారవుతారు. జనాభా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.

**రసాయన ఎరువులు తగ్గిద్దాం**

విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడుతూ నేలను ధ్వంసం చేస్తున్నాం. 2022 నాటికి రసాయనాల వాడకాన్ని 10-25 శాతం తగ్గిద్దాం. 'రైతుల ఆదాయాన్ని పెంచాలని మా ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ఈ క్రమంలో పీఎం కిసాన్ పథకం కింద రూ.90 వేల కోట్లు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.87 వేల కోట్లు కేటాయించాం. 14.5 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి ఏటా రూ.6000 వేలు నగదు జమ చేస్తున్నాం. రైతులకు పింఛన్ అందించే పథకానికి శ్రీకారం చుట్టాం' అని మోదీ వివరించారు.

### 70 ఏండ్లలో చేయలేనిది 70 రోజుల్లోనే చేసిచూపెట్టాం

'ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో 70 ఏండ్లలో తీసుకోలేని ఎన్నో నిర్ణయాలను మా ప్రభుత్వం 70 రోజుల్లోనే తీసుకున్నది. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, రైతులు, వ్యాపారుల కోసం సంక్షేమ పథకాలు ప్రకటించడం వంటివి దీనికి ఉదాహరణలు. 370, 35-ఏ అధికరణలను రద్దు చేయడానికి 70 ఏండ్లలో ఏ ప్రభుత్వమూ సాహసించలేదు. మేము 70 రోజుల్లోనే పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజార్టీతో ఆ అధికరణలను రద్దుచేశాం. దీంతో 'ఒకే దేశం-ఒకటే రాజ్యాంగం' అనే స్ఫూర్తి వాస్తవరూపం దాల్చింది. దేశం మొత్తం ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుంటే.. కొందరు రాజకీయ నాయకులు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారు. ఒకవేళ 370, 35-ఏ అధికరణలు నిజంగానే ప్రజలకు మేలు చేసేవే అయితే.. ఇన్నేండ్లు వాటిని 'తాత్కాలిక హోదా'లో ఎందుకు ఉండనిచ్చారు? ఎక్కువ కాలంపాటు మీరే అధికారంలో ఉన్నారు కదా.. వాటికి రాజ్యాంగంలో శాశ్వత స్థానం ఎందుకు కల్పించలేదు?. మీరు కేవలం రాజకీయ కోణంలోనే ఆలోచిస్తారు. మేము 'దేశం' కోణంలో చూస్తాం. నాకు వ్యక్తిగత అజెండా లేదు. దేశ ప్రజలు అప్పగించిన బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. దేశాన్ని సమైక్యంగా, అత్యున్నతంగా తీర్చిదిద్దాలన్న పటేల్ ఆకాంక్షలను నెరవేరుస్తున్నాం'.

### మోదీ ప్రసంగంలో మరిన్ని అంశాలు...

- 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' కూడా సాకారమైతే మరో కీలక అడుగు పడుతుంది. జమిలి ఎన్నికలపై ఇప్పటికే రాష్ట్రాలతో చర్చలు జరుగుతున్నాయి.
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్'.. భారతీయుల ఆకాంక్షలకు ప్రతిరూపం. ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తాం.
- ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూసి, లాభనష్టాలను బేరీజు వేస్తే భవిష్యత్తు తరాలు అవస్థలు పడుతారు.
- ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళల జీవితాలు మెరుగుపడుతాయి. దీన్ని రాజకీయ కోణంలో చూడొద్దు. సతీసహగమనం, బాల్యవివాహాలు, వరకట్నం, భ్రూణ హత్యలను దురాచారాలుగా పరిగణించినప్పుడు ట్రిపుల్ తలాక్‌ను ఎందుకు వ్యతిరేకించరు?
- ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తూ, ఇతర దేశాలపైకి వదులుతున్న వారి నిజస్వరూపం ప్రపంచానికి తెలియాల్సిందే. భారత్‌తోపాటు బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్ సైతం ఉగ్ర బాధిత దేశాలే.
- ఈ నెల 19న 100వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోబోతున్న ఆఫ్ఘనిస్థాన్ ప్రజలకు నా శుభాకాంక్షలు.
- అవినీతి, పక్షపాతం అనే చెదపురుగులు ప్రజల జీవితాలను నాశనం చేశాయి. అవినీతి మూలాలు అన్ని రంగాల్లో, అనేక స్థాయిల్లో చాలా లోతుకు పాతుకుపోయి ఉన్నాయి. టెక్నాలజీ సాయంతో వాటిని పారదోలడానికి ప్రయత్నిస్తున్నాం. కొంతమేర విజయం సాధించాం.
- పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి. గోనె సంచులు, వస్త్ర సంచులు వాడండి.
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 'ఒకే దేశం-ఒకే కార్డ్' (నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్-ఎన్‌సీఎంసీ) వ్యవస్థను అభివృద్ధి చేశాం. ఈ కార్డుతో బస్సు, రైలు చార్జీలు, టోల్, పార్కింగ్ ఫీజులు చెల్లించొచ్చు. షాపింగ్ చేయొచ్చు. ఏటీఎం నుంచి డబ్బు కూడా తీసుకోవచ్చు.

## 19 ఏండ్లకు..

- సీడీఎస్ ఏర్పాటుకు నిర్ణయం
- 1999లోనే ప్రతిపాదనలు
- రాజకీయ కారణాలతో రెండు దశాబ్దాలుగా పెండింగ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 15:** త్రివిధ దళాల మధ్య సమన్వయం నెలకొల్పి, వాటికి నేతృత్వం వహించడానికి త్రివిధ దళాల ప్రధానాధికారిని (సీడీఎస్) నియమించాలనే ప్రతిపాదన 19 ఏండ్లుగా ఉన్నది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ మధ్య సమన్వయం తోపాటు సంయుక్త శిక్షణ, ప్రణాళిక, సంక్షోభ సమయంలో సమర్థంగా స్పందించడం, వ్యూహరచన వంటివి సీడీఎస్ బాధ్యతలు. 1999 కార్గిల్ యుద్ధం తర్వాత దేశంలోని భద్రతా లోపాల గుర్తింపునకు కే సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఉన్నతస్థాయి కమిటీ తొలిసారిగా సీడీఎస్ ప్రతిపాదనను కేంద్రం ముందుంచింది. అత్యున్నత హోదా కల అధికారిని సీడీఎస్‌గా నియమించాలని, ఆయన రక్షణ మంత్రి సలహాదారుగానూ వ్యవహరించాలన్నది. దేశ భద్రతకు తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై అధ్యయనానికి 2001లో ఏర్పాటైన మంత్రుల సంఘం సైతం సీడీఎస్ ఏర్పాటుచేయాలని స్పష్టంచేసింది. ఆ తర్వాత నరేశ్ చంద్ర నేతృత్వంలోని ఉన్నతాధికారుల కమిటీ సైతం చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీకి (సీవోఎస్సీ) శాశ్వత అధ్యక్షుడిని నియమించాలని సూచించింది. సీవోఎస్సీ అనేది దేశ భద్రతకు సూచనలిస్తుంది. త్రివిధ దళాల అధిపతుల్లో సీనియర్ అధికారి దీనికి అధ్యక్షులుగా ఉంటారు. మాజీ సైన్యాధిపతి ఎన్సీ విజ్, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ హెచ్ఎస్ పనాగ్ వంటివారూ సీడీఎస్ ఏర్పాటు అత్యవసరమని పలు సార్లు చెప్పారు. అన్నిపార్టీల మధ్య ఏకాభిప్రాయం లేకే సీడీఎస్ ఏర్పాటు పూర్తికావడం లేద ని 2016లో కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. రాజకీయ నేతలు సైన్యంపై పెత్తనం కోసమే సీడీఎస్‌ను వ్యతిరేకిస్తున్నారని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ హెచ్ఎస్ పనాగ్ విమర్శించారు. మోదీ సర్కార్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సీడీఎస్ ఏర్పాటుపై రాజకీయ ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నది. దివంగత పారికర్ రక్షణశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సీడీఎస్ ఏర్పాటుకు మలి ప్రయత్నాలు మొదలయ్యాయి.

### మొదటి సీడీఎస్ ఎవరు?

త్రివిధ దళాల ప్రధానాధికారిని నియమిస్తామని ప్రధాని ప్రకటించినా.. పూర్తి వివరాలను చెప్పలేదు. సీడీఎస్ ర్యాంకు, హోదా, ఎవరు అర్హులు? వంటి వివరాలను త్వరలో ప్రకటిస్తారని అంచనా. త్రివిధ దళాల అధిపతుల్లో ఒకరిని సీడీఎస్‌గా నియమిస్తారని భావిస్తున్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవా మిగతా వారి కంటే సీనియరైనా 2 నెలల్లో రిటైర వుతారు. దీంతో సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ తొలి సీడీఎస్‌గా బాధ్యతలు చేపడుతారనే ప్రచారముంది. ఆయన డిసెంబర్ 31న రిటైరవుతారు. సీడీఎస్‌పై మోదీ నిర్ణయం పట్ల కార్గిల్ యుద్ధ సమయంలో సైన్యాధిపతిగా వ్యవహరించిన జనరల్ (రిటైర్డ్) వీపీ మాలిక్ హర్షం వ్యక్తం చేశారు.

## మోదీవి పనికిరాని ముచ్చట్లు

ప్రధాని ప్రసంగంపై ఒవైసీ ఎద్దేవా



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశంలోని యువశక్తిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియక ప్రధాని మోదీ పనికిరాని ముచ్చట్లు చెప్తున్నారని మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ ఈ మేరకు ట్వీట్ చేశారు. 'దేశం అత్యధిక యువ జనాభాతో శక్తి సంపన్నంగా ఉన్నది. ఈ అనుకూలత 2040 సంవత్సరం వరకే ఉంటుంది. యువశక్తిని దేశాభివృద్ధికి ఏ విధంగా వినియోగించాలో ప్రధానికి తెలియదు. అందుకే పనికిరాని, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తన బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు' అని ఒవైసీ విమర్శించారు.

## విదేశాల్లో ఉత్సాహంగా పంద్రాగస్టు

- వేలాదిగా తరలివచ్చిన ప్రవాస భారతీయులు

**బీజింగ్/ఇస్లామాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవం సంబురాల్లో జాతి యావత్తు మునిగి తేలింది. విదేశాల్లోని వేల మంది భారతీయులు కూడా మువ్వన్నెల జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. జాతీయ గీతాన్ని, దేశభక్తి గేయాల్ని పాడుతూ జాతి ఔన్నత్యాన్ని చాటారు. ఆస్ట్రేలియా, చైనా, పాకిస్థాన్, గల్ఫ్, నేపాల్, సింగపూర్, ఇజ్రాయెల్, ఇండోనేషియాతో పాటు వివిధ దేశాల్లో నివసిస్తున్న దేశ ప్రజలు పంద్రాగస్టు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పెద్ద సంఖ్యలో ఎన్నారైలు పాల్గొన్నారు. చైనాలోని భారత రాయబారి విక్రమ్ మిశ్రీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్రపతి కోవింద్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన సందేశాన్ని చదివి వినిపించారు. ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ కార్యాలయం, మెల్‌బోర్న్, సిడ్నీ తదితర నగరాల్లోని దౌత్యవేత్త కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు వైభవంగా జరిగాయి. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ ప్రవాస భారతీయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్థాన్‌లోని భారత హైకమిషనరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత డిప్యూటీ హై కమిషనర్ గౌరవ్ అహ్లువాలియా జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నేపాల్‌లోని భారత దౌత్య కార్యాలయం స్థానిక దవాఖానలకు 30 అంబులెన్సులు, ఆరు బస్సులను విరాళంగా ఇచ్చింది. కెనడా, ఇజ్రాయెల్, ఇండోనేషియా, సింగపూర్, గల్ఫ్ దేశాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రవాసులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఇస్లామాబాద్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న భారత డిప్యూటీ హైకమిషనర్ గౌరవ్ అహ్లువాలియా

**శుభాకాంక్షలు చెప్పిన ప్రపంచ దేశాలు**

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాలు ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాయి.భారత్ తమకు సన్నిహిత మిత్రదేశమని కొనియాడాయి. మాల్దీవులు అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సొలేహ్ ట్వీట్ చేస్తూ 'భారత్ మాకు పొరుగు దేశమే కాకుండా మంచి మిత్రదేశం. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలను మరింత పటిష్ఠపర్చడానికి ఇకపైనా కలిసి పనిచేస్తాం' అని పేర్కొన్నారు. భూటాన్ ప్రధాని లోటే షేరింగ్ ట్వీట్ చేస్తూ 'భారత్, భూటాన్ మధ్య స్నేహానికి సంబంధించి కొత్త అధ్యాయాన్ని చూస్తున్నాను. భారత ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. శాంతియుత, సంపన్న భారత్ కోసం ప్రార్థిస్తున్నా' అని తెలిపారు. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ మాట్లాడుతూ 70 ఏండ్లుగా ఎదుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థను చూస్తుంటే సంతోషంగా ఉన్నదన్నారు. మరోవైపు శుభాకాంక్షలు చెప్పిన వారందరికీ ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు.

### అక్టోబర్ 29 నుంచి ఢిల్లీలో మహిళలకు ఉచిత ప్రయాణం

కేజ్రీవాల్ రక్షా బంధన్ కానుక

**న్యూఢిల్లీ:** ప్రజా రవాణా సంస్థ బస్సుల్లో అక్టోబర్ 29 నుంచి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్స వం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షా బంధన్ నాడు తన సోదరీమణులకు ఈ కానుకతో భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీ రవాణాసంస్థ (డీటీసీ) బస్సులతోపాటు క్లస్టర్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. దీనిని ఎన్నికల జిమ్మిక్కుగా విపక్షాలు విమర్శించడాన్ని కేజ్రీవాల్ ఖండించారు. 'ప్రజాధనాన్ని నేను దోచుకోవడం/ దుర్వినియోగం చేయడంలేదు. నేను కాపాడిన ఆ నిధులను ప్రజల సౌకర్యాలకు వినియోగిస్తున్నాను' అని అన్నారు. ఢిల్లీలో పనిచేసే వారిలో 90% మగవారు కాగా మహిళలు కేవలం పది శాతమేనన్నారు. ప్రజా రవాణాను ఉపయోగించేవారిలో పురుషులు 70% కాగా మహిళలు 30 శాతమేనని తెలిపారు. ఉచిత ప్రయాణాలతో మహిళలు తమ కలలను నెరవేర్చుకునే అవకాశమున్నదన్నారు.

## మతోన్మాదానికి స్థానం లేదు!

- అన్యాయం, అసహనంపై పోరాడుదాం
- కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పిలుపు
- పార్టీ ఆఫీసులో జెండావిష్కరణ



ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణలో కాంగ్రెస్ నేతలకు అభివాదం చేస్తున్న సోనియా

**న్యూఢిల్లీ:** మూఢత్వానికి, మతోన్మాదానికి దేశంలో స్థానం లేదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. అన్యాయం, అసహనం, వివక్షలపై పోరాడుతూ స్వేచ్ఛను పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆమె ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మువ్వన్నెల జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలంతా కలిసికట్టుగా సమగ్రాభివృద్ధి సాధించి రాజకీయం, సమాజం, దేశ ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు తేవాలన్నారు. 'మన ప్రజాస్వామ్య దేశం 73వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నది. మూఢత్వం, వివక్ష, మతోన్మాదం, జాత్యహంకారం, అసహనం, అన్యాయాలకు ఇక్కడ తావులేదు. అయినా.. రోజూ లక్షల మంది వివక్షకు గురవుతున్నారు' అని అన్నారు. 'మన హక్కుల కోసం పోరాడుతూ.. అన్యాయం, అసహనం, వివక్షకు వ్యతిరేకంగా జాతి ఏకమవ్వాలి' అని పిలుపునిచ్చారు. యువత చేతులపైనే సమసమాజ జాతి నిర్మాణం ఆధారపడి ఉన్నదన్నారు. దేశ సమగ్రత పరి రక్షణకు మన సాయుధ దళాలు చేసిన అత్యున్నత త్యాగాల్ని ఎప్పటికీ మరిచిపోకూడదన్నారు. ఈ సందర్భంగా సైనికుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. రైతులు, కార్మికులు, చేతివృత్తులవారు, శాస్త్రవేత్తలు, కళాకారులు, రచయితలు, మేధావుల సేవలు జాతి నిర్మాణానికి సాయపడుతాయని ప్రశంసించారు. ఈ వేడుకల్లో పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, అహ్మద్ పటేల్, మన్మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదికగా జాతికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

### మోదీకి రాఖీ కట్టిన ఇష్రత్ జహాన్



ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేయాలంటూ ఉద్యమించిన ఇష్రత్ జహాన్ గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీకి రాఖీ కట్టి ధన్యవాదాలు తెలిపారు. దుబాయ్‌లో ఉన్న ఇష్రత్ భర్త 2014లో ఫోన్‌లో ఆమెకు ట్రిపుల్ తలాక్ చెప్పాడు. నాటి నుంచి దీని రద్దు కోసం ఆమె పోరాడారు. సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేశారు.

## సమాజం కోరిక మేరకే ఆర్టికల్ 370 రద్దు

- స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి
- ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్ వ్యాఖ్యలు



**నాగ్‌పూర్, ఆగస్టు 15:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370కి సమాజమంతా వ్యతిరేకంగా ఉన్నదని, అందుకే దీన్ని కేంద్ర ప్రభుత్వం తొలిగించిందని ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్ చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలను మెచ్చుకుంటున్నానని, ఆర్టికల్ 370 రద్దు లాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజల దృఢ సంకల్పమే ఆయనకు శక్తినిచ్చిందని తెలిపారు. ప్రధాని పీఠం మీద మోదీ ఉంటే ఏదైనా సాధ్యమేనని ప్రజలు అనుకుంటున్నారని, ఇది తప్పుకాదని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం ఆయన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం వద్ద, డాక్టర్ హెడ్గేవర్ స్మృతి మందిరం వద్ద మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహనీయులను ఈ రోజు స్మరించుకోవాలని సూచించారు. ఏ విషయంలోనైనా ప్రజల దృఢ సంకల్పం గట్టిగా ఉంటే నాయకుడు మరింత శక్తిమంతుడు కాగలడని, సమాజం కోసం కీలక నిర్ణయాలు తీసుకోగలడని చెప్పారు. మన స్వాతంత్ర్య పోరాటమే దీనికి ఉదాహరణ అని వివరించారు.

## భారత జవాన్లు చనిపోలేదు!

- పాక్ ప్రకటన అవాస్తవమన్న భారత్
- కాల్పుల్లో ముగ్గురు పాక్ సైనికులు మరణించారని వెల్లడి

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంబడి జరిగిన కాల్పుల్లో ఐదుగురు భారత సైనికులు మరణించారన్న పాకిస్థాన్ ప్రకటనను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ కల్పిత వాదనలేనని కొట్టిపారేసింది. పాక్ జరిపిన కాల్పుల్లో ఐదురుగు భారత సైనికులు చనిపోయారని పాక్ ఆర్మీ మేజర్ జనరల్ అసిఫ్ గఫూర్ గురువారం ట్వీట్ చేశారు. దీనికి స్పందించిన భారత సైన్యం పాక్ ఆరోపణలన్నీ అవాస్తవాలేనని కొట్టిపారేసింది. 'పాక్ వాదనలు కల్పితం. పాక్ ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని భారత ఆర్మీ ప్రతినిధి కల్నల్ అమన్ ఆనంద్ అన్నారు. నియంత్రణ రేఖ వెంబడి గురువారం పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం వల్ల భారత్ దీటుగా స్పందించాల్సి వచ్చిందని.. భారత్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు పాక్ సైనికులు మరణించారని అధికారులు తెలిపారు.

# మా భూమిని కాపాడండి

- అటవీభూముల్లో కలిసిన సాగుభూములు
- పట్టాలున్నా.. స్వాధీనం చేసుకొన్న అటవీశాఖ
- ట్రెంచ్‌కటింగ్ చేసిన ఫారెస్ట్ అధికారులు
- దశాబ్దాలుగా వారసత్వంగా వస్తున్న భూములు
- స్పందించని రెవెన్యూ అధికారులు
- నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో రైతుల గగ్గోలు



రావుల భాస్కర్ సాగుచేస్తున్న భూమిలో మామిడి మొక్కలు. (ఇన్‌సెట్‌లో) తనకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకం, పహాణీలను చూపుతున్న బాధితుడు రావులపల్లి భాస్కర్

**ఇందల్వాయి:** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లి గ్రామంలో రెవెన్యూ, అటవీ భూముల వివాదంతో రైతులకు తిప్పలు మొదలయ్యాయి. గ్రామానికి చెందిన పలువురు రైతులు తాతముత్తాతల కాలంనుంచి సాగుచేసుకొంటున్న భూములు అటవీశాఖవి అంటూ ఆ శాఖ అధికారులు ఆ భూముల్లో ట్రెంచ్ కటింగ్‌చేశారు. ఏండ్లుగా సాగుచేసుకొంటున్న తమ భూములను అటవీ అధికారులు ట్రెంచ్ కటింగ్ చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ భూవివాదంపై అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన రావుల భాస్కర్ అనే రైతు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. భాస్కర్‌కు సర్వే నంబర్ 1740/2/1 లో 1.03 ఎకరాల భూమి తాత ముత్తాతల నుంచి వారసత్వంగా సంక్రమించింది. గత ఫిబ్రవరి, మార్చిలో అటవీశాఖ అధికారులు తన భూమిని ట్రెంచ్ కటింగ్ చేశారని భాస్కర్ వాపోయారు. గ్రామంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న మరికొందరు రైతుల వ్యవసాయ భూములను కూడా అటవీ క్షేత్రంలో కలుపుకొని అధికారులు ట్రెంచ్ ఏర్పాటుచేశారని భాస్కర్ తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు తాసిల్దార్‌కు విన్నవించానని, మండలానికి ఒకే ఒక్క సర్వేయర్ ఉన్నారని, ఆ సర్వేయర్ అన్ని గ్రామాలు తిరిగి భూ సమస్యలు పరిష్కరిస్తారని.. అందువల్ల సమయం పడుతుందని తాసిల్దార్ జవాబు చెప్పారని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. ఓపక్క రెవెన్యూ అధికారులు భూ రికార్డుల ప్రక్షాళన అనంతరం భాస్కర్‌తోపాటు మిగతా రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు మంజూరుచేశారు. మరో పక్క అటవీశాఖ అధికారులు ఆ భూములు తమవేనంటూ కందకాలు తవ్వుతారు. 30 నుంచి 35 ఎకరాల వరకు భూములను అటవీభూముల్లో కలిపేశారు. దశాబ్దాలుగా తమకు వారసత్వంగా సంక్రమిస్తున్న భూమి తమది కాకుండా పోయిందని భాస్కర్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ వ్యవహారంపై తాసిల్దార్, సర్వేయర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా వారు పట్టించుకోవడంలేదని బాధితులు పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి సుభాష్‌చంద్ర యాదవ్‌ను వివరణ కోరగా.. తమకు ఉన్న ఆదేశాల ప్రకారం అన్సాన్‌పల్లి గ్రామంలోని వ్యవసాయ భూముల్లో అటవీ భూమి ఉన్నదని, అందుకే అక్కడ ట్రెంచ్ కటింగ్ చేశామని వెల్లడించారు. అటవీశాఖ అధికారులు ట్రెంచ్ కటింగ్‌చేసిన భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలున్నాయి. 50 నుంచి 60 మంది వరకు రైతులు పట్టాదారులుగా ఉన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూములను అటవీశాఖ నుంచి విడిపించాలని రైతు రావుల భాస్కర్ వేడుకొంటున్నారు.

## మా మాట!


### రెవెన్యూ ప్రక్షాళనను స్వాగతిస్తున్నాం



ఎన్నో ఏండ్ల నుంచి భూసమస్యలతో సతమతమవుతున్న రైతులకు 'నమస్తే తెలంగాణ' చేపట్టిన ధర్మగంట వరంలా మారింది. గతంలో రైతులు భూమి పట్టాదారు పాస్‌పుస్తకాలు చేయించుకోవాలంటే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏండ్ల తరబడి తిరిగినా పనికాకపోయేది. ఇప్పుడు వెంటనే అవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అంతమొందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉన్నది. ప్రక్షాళనను స్వాగతిస్తున్నాం. ధర్మగంట కార్యక్రమం చేపట్టిన 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు.

**-ధరావత్ శంకర్, హనుమతండా, సూర్యాపేట జిల్లా**

### సీఎం కేసీఆర్‌ది సాహసోపేతమైన నిర్ణయం



'నమస్తే తెలంగాణ'లో ధర్మగంట ప్రారంభం నాటి నుంచి రెవెన్యూ అధికారులు, సిబ్బంది అప్రమత్తమై భూసమస్యలపై వెంటనే స్పందిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటినుంచి భూరికార్డుల ప్రక్షాళన వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొంటూ నిరంతరం ప్రజలకు మేలుచేసేలా సమస్యలను పరిష్కరిస్తూ పాలన కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రెవెన్యూశాఖలో ఎన్నో ఏండ్లుగా పేరుకుపోయిన పనులు వేగవంతంగా పరిష్కారమవుతున్నాయి.

**- కంచర్ల శ్రీధర్‌రెడ్డి, టేకుమట్ల, సూర్యాపేట మండలం, సూర్యాపేట జిల్లా**


### సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



గత ప్రభుత్వాల పాలనలో అధికారులు పనిచేయకపోవడంతో రైతుల భూసమస్యలు పరిష్కారం కాలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అంతం చేయడానికి నిర్ణయం తీసుకోవడంతో అధికారుల్లో చలనం మొదలైంది. ఇప్పుడు ఏ సమస్య అయినా అధికారుల వద్దకు వెళ్తే వెంటనే పరిష్కారం లభిస్తున్నది. భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు.

**- బంటు సైదులు, కాసరబాద, సూర్యాపేట జిల్లా**

### రైతుల పక్షాన నిలబడిన నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు



'ధర్మగంట' ద్వారా రైతుల భూసమస్యలు తీరుతున్నాయి. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళన చేపట్టింది. అయితే కొంతమంది రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో కొన్నిచోట్ల పాతవాటితోపాటు కొత్త సమస్యలు ఏర్పడ్డాయి. కానీ 'నమస్తే తెలంగాణ'లో కథనాలు ప్రచురితమవుతుండటంతో ఇటు ప్రభుత్వ లక్ష్యం, అటు రైతుల సమస్యలు తీరుతున్నాయి. రైతుల పక్షాన నిలబడి సమస్యలను తీరుస్తున్న పత్రికకు అన్నదాతల తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

**- పీ ఎర్రనర్సయ్య, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్, అర్వపల్లి, సూర్యాపేట జిల్లా**

# పండుగలా జెండావిష్కరణ

## మహనీయుల త్యాగాలను స్మరించుకొన్న ఉద్యోగులు

## ప్రతిఒక్కరూ జాతి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపు



అసెంబ్లీ ఆవరణలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు కూడా ఉన్నారు.



మండలి ఆవరణలో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీలు రామచందర్‌రావు, ఎమ్మెస్ ప్రభాకర్ తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎందరో మహనీయుల త్యాగఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రతి ఒక్కరూ జాతి పురోభివృద్ధికి తోడ్పడాలని ఉద్యోగులు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని వివిధ ప్రభుత్వశాఖల ప్రధాన కార్యాలయాల్లో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. బస్‌భవన్‌లో ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి, ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ జాతీయజెండాను ఆవిష్కరించగా, ఈడీలు పురుషోత్తం, వినోద్ కుమార్, యాదగిరి పాల్గొన్నారు. విజయడెయిరీలో చైర్మన్ లోక భూమారెడ్డి జెండాను ఆవిష్కరించగా, ఎండీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆవరణలో చైర్మన్ మందుల సామేల్ జెండాను ఆవిష్కరించగా, ఎండీ భాస్కరాచారి, ఈఈ మునగాల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. పరిశ్రమభవన్‌లో టీఎస్‌ఐఐసీ ఎండీ ఈవీ నరసింహారెడ్డి జాతీయజెండాను ఎగురవేయగా, సీఈవో మధుసూదన్, శక్తినాగప్పన్, సీఈ శ్యాంసుందర్ పాల్గొన్నారు. మిషన్‌భగీరథ ప్రధాన కార్యాలయంలో ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి జాతీయజెండాను ఎగురవేశారు. సీఈలు జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, సత్యనారాయణ, రవీంద్ర, షమీ పాల్గొన్నారు. వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో కమిషనర్ రాహుల్‌బొజ్జా జాతీయజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీలు నారీమణి, కే విజయకుమార్, జేడీలు బాలు, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు. బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఈ ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్ పాల్గొన్నారు. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ పాపిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, వైస్ చైర్మన్లు లింబాద్రి, వెంకటరమణ, టీఎఫ్‌ఆర్సీ చైర్మన్ స్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు. అగ్రి వర్సిటీలో వీసీ వీ ప్రవీణ్‌రావు, మైనార్టీస్ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ మహ్మద్ ఖమరుద్దీన్ జాతీయజెండాను ఆవిష్కరించగా, వైస్‌చైర్మన్ శంకర్‌లూక్, సభ్యులు గుస్తీ నోరియా, మహ్మద్ అర్షద్ అలీఖాన్, ఎంఏ అజీమ్, ముఖ్యసలహాదారు రియాజ్‌అహ్మద్, లీగల్ అడ్వయిజర్ ఎంఏ ఖాదిర్‌సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

### డీజీపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు



డీజీపీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న అదనపు డీజీ శివధర్‌రెడ్డి

డీజీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదనపు డీజీ(పర్సనల్) శివధర్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ సుమతి, సీఎస్వో యోగేశ్వర్ పాల్గొన్నారు. పోలీస్ అకాడమీలో టీఎస్‌పీఏ డైరెక్టర్ సంతోష్‌మెహ్రా జెండా ఎగురవేసి, గౌరవవందనం స్వీకరించారు. ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, క్యాష్ రివార్డులు అందజేశారు. అరణ్యభవన్‌లో జరిగిన వేడుకల్లో పీసీసీఎఫ్ ఆర్ శోభ పాల్గొన్నారు. ఉత్తమ పనితీరును కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



తెలంగాణ భవన్‌లో త్రివర్ణపతాకాన్ని ఎగురవేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

### అసెంబ్లీ, మండలిలో స్వాతంత్ర్య వేడుకలు


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభ ఆవరణలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం జాతీయజెండా ఎగురవేశారు. అంతకుముందు జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను గుర్తుచేసుకొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి వీ నరసింహాచార్యులు, ఎమ్మెల్సీలు ఎమ్మెస్ ప్రభాకర్‌రావు, రఘోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శాసనమండలి కార్యాలయంలో మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌రావు జాతీయజెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎన్ రాంచందర్‌రావు, ఎమ్మెస్ ప్రభాకర్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి వీ నరసింహాచార్యులు పాల్గొన్నారు. హైదర్‌గూడ, ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యేల నివాస భవనసముదాయాల్లో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు జాతీయ జెండా ఎగురవేశారు.



అగ్రి వర్సిటీలో జెండాను ఎగురవేసిన అనంతరం వందనం చేస్తున్న వైస్‌చాన్సలర్ వీ ప్రవీణ్‌రావు

### మన విద్యుత్ విధానం దేశానికే ఆదర్శం

#### సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో పురోగమనం: సీఎండీ ప్రభాకర్‌రావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అనతి కాలంలోనే సాధించిన విజయాలతో తెలంగాణ విద్యుత్‌రంగం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు చెప్పారు. గురువారం విద్యుత్‌సౌధలో జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముందుచూపున్న సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో విద్యుత్ రంగం పురోగమిస్తున్నదని చెప్పారు. విద్యుత్ సంస్థలు గ్రిడ్‌ను క్రమశిక్షణతో నిర్వహిస్తున్నాయని, అందుకే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ.. రాష్ట్ర స్టేట్ లోడ్ డిస్పాచ్‌సెంటర్‌ను అభినందించిందని గుర్తుచేశారు. ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ కూడా 80.13 శాతం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.


### తెలంగాణ భవన్‌లో మువ్వన్నెల జెండా రెపరెపలు

#### జెండా ఎగురవేసిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు జాతీయజెండా ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను గుర్తుచేసుకొని, వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్యే ఎన్ సుధాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పూల వీరందర్ తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరికి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అద్భుతమైన దేశం పట్ల భారతీయులంతా కలిసిమెలిసి ప్రేమతో ఉందామని పిలుపునిచ్చారు.

## మహారత్న కంపెనీలకు దీటుగా సింగరేణి

### సీఎం కేసీఆర్ సహకారం.. సమిష్టి కృషితోనే అద్భుత ప్రగతి: సీఎండీ శ్రీధర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐదేండ్లలో సాధించిన వృద్ధితో దేశంలోని మహారత్న కంపెనీలతో సమానంగా సింగరేణి ఉన్నదని, వచ్చే ఐదేండ్ల కాలంలో దేశంలో తొలిస్థానంలో నిలిపేందుకు కృషిచేద్దామని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ సహకారం, కార్మికులు, అధికారులు, కార్మిక సంఘాల కృషి ఫలితంగానే సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని చెప్పారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో గురువారం 73వ స్వాతంత్ర్య వేడుకల్లో శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేండ్లలో చరిత్రలో ఎప్పుడూ లేనంతగా అన్ని విభాగాల్లో సింగరేణి వృద్ధి నమోదుచేసిందని పేర్కొన్నారు. 2018-19లో రూ.25,828 కోట్ల టర్నోవర్, రూ.1,766 కోట్ల లాభాలను ఆర్జించిందని, మరో ఐదేండ్లలో టర్నోవర్‌ను రూ.50 వేల కోట్లకు, లాభాలను రూ.నాలుగు వేల కోట్లకు చేర్చేలా ప్రణాళికలు అమలుచేస్తున్నామని వివరించారు. ఒడిశాలోని నైనీ బొగ్గుబ్లాకు ఉత్పత్తికి సిద్ధమవుతున్నదని, మరికొన్ని బ్లాకుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ బొగ్గుబ్లాకులు సాధించేందుకు సీఎం కేసీఆర్ ద్వారా కేంద్ర బొగ్గుశాఖను సంప్రదిస్తున్నామని వివరించారు. సింగరేణిలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు మరే కంపెనీలోనూ లేవని స్పష్టంచేశారు. రెండేండ్లలో 220 మెగావాట్ల సామర్థ్యంతో సౌరవిద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయబోతున్నామని తెలిపారు. ఇదే ఒరవడితో ముందుకుసాగుదామని, బంగారు తెలంగాణలో కీలకపాత్ర పోషిద్దామని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈడీ జే ఆల్విన్, సలహాదారులు డీఎన్ ప్రసాద్, సురేంద్రపాండే, జీఎం ఆంటోనిరాజా పాల్గొన్నారు.



టీఎన్జీవో కార్యాలయంలో జాతీయగీతం ఆలపిస్తున్న కారం రవీందర్‌రెడ్డి తదితరులు



టీజీవో కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఉద్యోగులు

## ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంద్రాగస్టు వేడుకలను రాష్ట్రంలోని ఆయా ఉద్యోగ సంఘాలు గురువారం ఘనంగా నిర్వహించాయి. హైదరాబాద్‌లోని టీఎన్జీవోభవన్‌లో సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని, సిటీ అధ్యక్షుడు రాయకంటి ప్రతాప్, ఉమ తదితరులు పాల్గొన్నారు. టీజీవోభవన్‌లో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు బేగ్, సుజాత, కృష్ణమూర్తి, హైదరాబాద్ జిల్లా, నగర అధ్యక్షులు ఎంబీ కృష్ణాయాదవ్, గండూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. భాగ్యనగర్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్, టీఎన్జీవో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్‌లు జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలోసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### ఎఫ్‌ఆర్వో అనితకు బంగారు పతకం

#### ధైర్యసాహసాలకు గుర్తింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అటవీ భూముల రక్షణలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్వో) సీహెచ్ అనితకు.. కేవీఎస్ బాబు బంగారు పతకం ప్రదానం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దూలపల్లి అటవీ అకాడమీలో బంగారు పతకం అందుకొన్న అనిత మాట్లాడుతూ.. అటవీ అధికారిని అయినందుకు గర్వపడుతున్నానని అన్నారు. అటవీ సంరక్షణాధికారిగా పనిచేసిన కేవీఎస్ బాబు జ్ఞాపకార్థం ఏటా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి ఒక్కో ఎఫ్‌ఆర్వోకు బంగారు పతకాన్ని అందజేస్తున్నారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్ శోభ, కేవీఎస్ బాబు సతీమణి ప్రసూనాంబ, అధికారులు ఎస్కే దాస్ పాల్గొన్నారు.

## వారంలో గ్రూప్-2 ఇంటర్వ్యూలు పూర్తి

### టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రూప్-2 ఇంటర్వ్యూ ప్రక్రియ వారంలో ముగియనున్నదని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. ప్రభుత్వం భర్తీకి ఆదేశించిన అన్ని ఉద్యోగాల పరీక్షలు పూర్తిచేశామని వివరించారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-2లో 1,032 పోస్టులకు, 2,064 మందిని ఇంటర్వ్యూలకు పిలిచామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియతో మొత్తం 30,000 ఉద్యోగాల భర్తీ పూర్తవుతుందని వెల్లడించారు. వైద్యవిభాగంలోని కొలువులకు సంబంధించిన అంశం ఒక్కటే కోర్టులో పెండింగ్‌లో ఉన్నదని వివరించారు.



టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేస్తున్న చైర్మన్ ఘంటా చక్రపాణి

కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# హరితహారంపై ఇంత నిర్లక్ష్యమా?

**ఆరుగురు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేసిన కలెక్టర్**

**మరో 75మందికి షోకాజ్ నోటీసులు**

**వనపర్తి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హరితహారం నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు పంచాయతీ కార్యదర్శులపై వనపర్తి కలెక్టర్ శ్వేతామొహంతి శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఆరుగురు కార్యదర్శులను సస్పెండ్ చేయడమేగాక మరో 75 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీవోను ఆదేశించారు. గురువారం సాయంత్రం హరితహారంపై నిర్వహించిన సమీక్షలో నివేదికలను పరిశీలించిన కలెక్టర్.. ఏ మాత్రం పురోగతి లేదంటూ మండిపడ్డారు. ఇందుకు సంబంధించి ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూనే, మరో 75మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీవోను ఆదేశించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో శోభాయాత్రలో పాల్గొన్న పద్మశాలీలు

# నేత్రపర్వంగా నూలు పౌర్ణమి వేడుకలు

**సిరిసిల్ల టౌన్:** రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో గురువారం నూలు పౌర్ణమి వేడుక నేత్రపర్వంగా సాగింది. స్థానిక మార్కండేయ ఆలయం నుంచి మార్కండేయ స్వామి ఉత్సవ విగ్రహంతో గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, నేతన్నచౌక్, పెద్దబజార్ మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. పాతబస్టాండ్ వద్దగల నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. పురవీధుల్లో సుహాసినులు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. శోభాయాత్రలో భాగంగా మగ్గంపై నేసిన వస్త్రాన్ని మార్కండేయస్వామికి అలంకరించారు. ఈ వేడుకలో ఎంపీ బండి సంజయ్, టీఆర్ఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ పాల్గొన్నారు.





మహబూబ్‌నగర్‌లోని పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఊరూరా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. జిల్లా కేంద్రాల్లో మండలి డిప్యూటీ చైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, జెడ్పీ చైర్‌పర్సన్లు, మండలి విప్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం సిద్దిపేటలోని డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ



నిర్మల్ జిల్లా కేంద్రంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో గౌరవ వందనం స్వీకరిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



జగిత్యాల జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తదితరులు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జెండాను ఎగుర వేసి వందనం చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్



సూర్యాపేటలో జెండాను ఎగుర వేసి వందనం చేస్తున్న విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లాకేంద్రంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న రవాణా శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



కరీంనగర్‌లోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణం కాకతీయకాలనీలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 150 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. పలువురు చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ర్యాలీలో పాల్గొన్నారు. - హుజూరాబాద్‌టౌన్

# మురుగుకాల్వల రహిత జిల్లాగా పెద్దపల్లి

**పంద్రాగస్టు వేడుకలో ప్రకటించిన కలెక్టర్ శ్రీదేవసేన**

**కలెక్టరేట్:** అధికారులు, ప్రజల సమష్టికృషితో బహిరంగ మురుగు కాల్వల రహిత జిల్లాగా పెద్దపల్లి నిలిచిందని కలెక్టర్ శ్రీదేవసేన చెప్పారు. గురువారం పెద్దపల్లి శివారులోని పెద్దకల్వల ఎస్సారెస్పీ క్యాంపు ఆవరణలోని పోలీస్‌పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో కలెక్టర్ శ్రీదేవసేన పెద్దపల్లిని ఓపెన్ డ్రైన్స్ ఫ్రీ జిల్లాగా ప్రకటించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా జిల్లాలో ఆరునెలలుగా ఇంటింటికి ఇంకుడుగుంతల నిర్మాణంతోపాటు గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టి.. వందశాతం పూర్తిచేశామన్నారు. జిల్లాలో 1,23,036 కుటుంబాలు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 94, 378, అర్బన్‌లో 28,658 కుటుంబాలు పూర్తిస్థాయిలో ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కోగ్రామంలో 1 నుంచి 5 వరకు సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణం పూర్తిచేశామన్నారు.

# అక్కడక్కడా వర్షాలు

- భద్రాద్రి జిల్లాలో భారీగా..
- కామారెడ్డి జిల్లాలో ఓ మోస్తరు
- వచ్చే మూడ్రోజులు తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** రుతుపవనాల ప్రభావంతో గురువారం అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. వచ్చే మూడ్రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణకేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో గంటసేపు భారీవర్షం కురవడంతో కొత్తగూడెం అండర్‌బ్రిడ్జి వద్ద వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలా ల్లో వర్షంకురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కామారెడ్డిజిల్లాలో బుధవారం రాత్రి పలుప్రాంతాల్లో వానపడింది. గాంధారి, లింగంపేట్ మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గాంధారి మండలంలోని గుజ్జుల్ చెరువుతోపాటు కాటేవాడి చెరువు అలుగు పారుతున్నది. పెద్ద వాగుతోపాటు, పొతంగల్ వాగు, ముదెల్లి వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి.

**వర్షపాతం వివరాలు ఇలా..**

బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా గాంధారి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరుల్లో 7 సెం.మీ. చొప్పున, నిజామాబాద్ జిల్లా ధర్పల్లి, కామారెడ్డి జిల్లా నాగారెడ్డిపేటల్లో 6 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, మెదక్ జిల్లా పాపన్నపేటల్లో 5 సెం.మీ. చొప్పున వర్షపాతం రికార్డయింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని కొన్నిచోట్ల చిరుజల్లులు కురిశాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు రంగారెడ్డి జిల్లా కొందుర్గులో 7.8 మి.మీ.లు, హయత్‌నగర్‌లో 1.0 మి.మీ.లు, రాజేంద్రనగర్‌లో 1.0 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

**మూడ్రోజులు తేలికపాటి వానలు**

వాయవ్య ఛత్తీస్‌గఢ్, పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం గురువారం ఉదయం తీవ్ర అల్పపీడనంగా మారి వాయవ్య మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదన్నారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు చాలాప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాగా రాగల 24 గంటల్లో గ్రేటర్‌హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురియవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# కారు బోల్తా.. ఇద్దరు దుర్మరణం

- సంగారెడ్డి జిల్లా సత్వార్ శివారులో ఘటన

**జహీరాబాద్, నమస్తే తెలంగాణ:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ శివారులోని ముంబై - హైదరాబాద్ 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లికి చెందిన కొత్తపల్లి క్రాంతికుమార్ (27), అరుణ్‌కుమార్(24), సంతోష్, సుబ్రహ్మణ్యం, ప్రశాంత్, శేఖర్, జీవం స్నేహితులు. వీరంతా గత ఆదివారం ఇన్నోవా వాహనంలో ముంబై వెళ్లారు. పని ముగించుకొని గురువారం హైదరాబాద్ తిరిగివస్తుండగా సత్వార్ శివారులో వాహనం ముందుటైరు పగిలిపోవడంతో బోల్తాపడింది. దీంతో క్రాంతి కుమార్, అరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తుజరుపుతున్నారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగుర వేసి వందనం చేస్తున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



ఖమ్మంలో జాతీయ జెండా ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్



వనపర్తి జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# మధ్యాహ్న భోజనానికి ఎమ్మెల్యే చేయూత

- బాల్కఫౌండేషన్ ఆధ్వర్యంలో నేటినుంచి ప్రారంభం

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహకారంతో బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు శుక్రవారం నుంచి మధ్యాహ్నభోజనాన్ని అందించనున్నారు. ఇందుకోసం కళాశాలలు, మోడల్‌స్కూళ్లకు రూ.50వేల చొప్పున రూ. మూడు లక్షల విలువైన చెక్కులను బాల్క ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. అంతేగాక గురువారం నియోజకవర్గంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లోని 8 వేల మంది విద్యార్థులకు 40వేల నోటుపుస్తకాలను అందజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నదే ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆశయమని.. ఇందులో భాగంగానే చేయూతనందిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని తుమ్మిళ్ల లిఫ్ట్ నుంచి నీళ్లు వదలడంతో గురువారం ఆర్డీఎస్ డీ 26 కాల్వకు గండి పడింది. రైతులు సమాచారం ఇవ్వడంతో ఆర్డీఎస్ సిబ్బంది నీటి ప్రవాహాన్ని నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. - వడ్డేపల్లి

## 'తీలేరు' మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**ఒక్కో కుటుంబానికి రూ.6.3 లక్షలు**

**నారాయణపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరులో గత ఏప్రిల్ 10న మట్టి దిబ్బలు పడటంతో పది మంది కూలీలు మృతిచెందగా వారిలో ఎనిమిది కుటుంబాల వారికి ప్రభుత్వం తాజాగా ఆర్థిక సాయాన్ని అందజేసింది. కార్మికశాఖ నుంచి రూ.50.40 లక్షలు మంజూరు కాగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.6.30 లక్షల చొప్పున గురువారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, నారాయణ పేట ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ చేతన ప్రొసీడింగ్స్ అందజేశారు. కాగా సరైన పత్రాలు లేనికారణంగా మరో రెండు కుటుం బాలకు పరిహారం మంజూరు కాలేదని అధికారులు చెప్పారు. మృతుల కుటుంబాలకు అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున అందజేసిన విషయం తెలిసిందే.

# నేడు చేపపిల్లల విడుదల

**లక్ష్మీ బరాజ్‌లో ప్రారంభించనున్న మంత్రి తలసాని**

**ఈ ఏడాది 24,953 నీటి వనరుల్లో..**

**80.8 కోట్ల చేపపిల్లల విడుదలకు మత్స్యశాఖ ఏర్పాట్లు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో 2019-20 సంవత్సరంలో వందశాతం రాయితీపై నాలుగోవిడుత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభానికి సర్వంసిద్ధమైంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌లో చేపపిల్లలను వదిలే ఈ కార్యక్రమాన్ని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించేలా మత్స్యశాఖ కమిషనర్ డాక్టర్ సీ సువర్ణ ఆదేశాలు జారీచేశారు. నాలుగోవిడుత చేపపిల్లల పంపిణీలో భాగంగా ఈ ఏడాది 24,953 నీటి వనరుల్లో 80.86 కోట్ల చేపపిల్లలను, 5 కోట్ల రొయ్య పిల్లలను విడుదలచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించాక తొలిసారి 1.24 కోట్ల చేపపిల్లలు, 26 లక్షల రొయ్య పిల్లలను లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్, సరస్వతి (అన్నారం) బరాజ్, పార్వతి (సుందిల్ల) బరాజ్‌లో విడుదలచేసేందుకు ఏర్పాట్లుచేసినట్టు ఆమె చెప్పారు.

**ఏటా నీటి వనరుల్లో వదులుతున్న చేపపిల్లలు, లక్ష్యం, ఇందుకు వెచ్చిస్తున్న మొత్తం**

| సంవత్సరం | నీటి వనరులు | చేపపిల్లల సంఖ్య(కోట్లలో) | విలువ (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2016-17 | 3,939 | 27.85 | 22.46 |
| 2017-18 | 11,067 | 51.00 | 44.08 |
| 2018-19 | 10,772 | 49.15 | 43.10 |
| 2019-20 | 24,953 | 80.863 | 52.00 |



వికారాబాద్ జిల్లా పెద్దేముల్ ఎంపీపీ అనురాధకు గులాబీ కండువాకప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

# టీఆర్ఎస్‌లో చేరికలు

**పెద్దేముల్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ కాంగ్రెస్ ఎంపీపీ అనురాధ, ఆమె భర్త రమేశ్ వివిధ గ్రామాలకు చెందిన 80 మంది తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి సమక్షంలో గురువారం టీఆర్ఎస్‌లో చేరారు. గ్రామాల అభివృద్ధి కేవలం టీఆర్ఎస్‌తోనే సాధ్యమని రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శమని.. బంగారు తెలంగాణ సాధనలో భాగంగా చాలామంది నాయకులు కాంగ్రెస్ పార్టీని వీడి టీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు.



## సైక్లింగ్ జట్టుకు చరిత్రాత్మక స్వర్ణం

**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవం రోజున భారత పురుషుల సైక్లింగ్ జూనియర్ జట్టు చరిత్ర సృష్టించింది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో టీం స్ప్రింట్ విభాగంలో స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన ఈసో అల్బెన్, రొనాల్డో సింగ్, రోజిత్ సింగ్‌తో కూడిన మన జట్టు.. ప్రపంచ సైక్లింగ్ పోటీల్లో స్వర్ణం సాధించిన తొలి భారత జట్టుగా చరిత్ర లిఖించింది. 44.681 సెకన్లలో భారత్ లక్ష్యాన్ని ఛేదించి టాప్‌లో నిలిచింది. ఆస్ట్రేలియా రజతంతో సరిపెట్టుకోగా... మూడోస్థానంలో నిలిచిన బ్రిటన్ కాంస్య పతకాన్ని సాధించింది. పోటీ తొలి ల్యాప్‌లో ఆస్ట్రేలియా కంటే కాస్త వెనుకబడిన భారత్.. రెండు, మూడో ల్యాప్‌ల్లో విజృంభించి విజయం సాధించింది.

## శాస్త్రికే కిరీటం!



### కోచ్ రేసులో ముందున్న రవి
### నేడు తేలనున్న ఫలితం

**ముంబై:** భారత ప్రధాన కోచ్ ఎవరన్నది మరి కొన్ని గంటల్లో తేలబోతున్నది. ఇన్ని రోజులుగా ఆసక్తిరేపుతూ వస్తున్న కోచ్ పదవి ఎవరికి దక్కనుంది అన్నది దిగ్గజ కపిల్‌దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏసీ) శుక్రవారం తేల్చనుంది. ప్రస్తుత చీఫ్ కోచ్ రవిశాస్త్రి సహా టామ్‌మూడీ, మైక్ హెస్సెన్, లాల్‌చంద్ రాజ్‌పుత్, రాబిన్ సింగ్, ఫిల్ సిమ్మన్స్‌తో కూడిన కుదించిన జాబితాను కపిల్ కమిటీ ఇంటర్వ్యూ చేయనుంది. అయితే ఆది నుంచి రేసులో అందరికంటే ముందున్న రవిశాస్త్రి చీఫ్ కోచ్‌గా తిరిగి ఎంపికయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అనిల్ కుంబ్లే తర్వాత జట్టు కోచ్‌గా పగ్గాలు స్వీకరించిన శాస్త్రి రికార్డు కూడా మిగతావారితో పోల్చుకుంటే మెరుగ్గా ఉండటం కలిసొచ్చే అంశం కానుంది. ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్ట్ సిరీస్ చారిత్రాత్మక విజయానికి తోడు టెస్టుల్లో నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎదగడం రవి హయంలోనే జరిగింది. ఓవరాల్‌గా చూసుకుంటే రవి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు అందుకున్న జూలై 2017 నుంచి 21 టెస్టులాడిన టీమ్‌ఇండియా 13 విజయాలు సాధించింది. 36 టీ20ల్లో 25 విజయాలు, 60 వన్డేల్లో 43 విజయాలు సొంతం చేసుకుంది. మరోవైపు ఇటీవలి ప్రపంచకప్‌లో సెమీస్‌తో నిష్క్రమణ చేదు ఫలితం మినహా విజయాల సగటు పరంగా చూస్తే రవి హయంలో టీమ్‌ఇండియా మెరుగైన ఫలితాలనే సొంతం చేసుకుందని చెప్పొచ్చు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కెప్టెన్ కోహ్లీ మద్దతు రవికి ఉండటం బాగా కలిసిరానుంది.

**స్కైప్ ద్వారా ఇంటర్వ్యూకు**

పదవీ కాలం పొడిగించడంతో ప్రస్తుతం వెస్టిండీస్ పర్యటనలో ఉన్న రవిశాస్త్రి స్కైప్ ద్వారా ఇంటర్వ్యూలో పాల్గొననున్నాడు. ఇక రాజ్‌పుత్, హెస్సెన్, రాబిన్‌సింగ్ వ్యక్తిగతంగా హాజరై శాంతా రంగస్వామి, అన్షుమన్ గైక్వాడ్‌తో కూడిన కపిల్ కమిటీ ముందు తమ ప్రణాళికలను వివరించే అవకాశముంది. ఒక వేళ సీఏసీ శాస్త్రికే మొగ్గుచూపితే ప్రస్తుతం తనతో ఉన్న సహాయక బృందాన్ని కొనసాగించమని రవి కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఏసీ చీఫ్ కోచ్ ఎంపిక వరకు పరిమితం కానుండగా సహాయక బృందాన్ని ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించే చాన్స్ ఉంది.

## రిటైర్మెంట్‌పై ఏ ప్రకటన చేయలేదు



**పోర్ట్ ఆఫ్ స్పెయిన్ :** వెస్టిండీస్ ఓపెనర్ క్రిస్ గేల్ రిటైర్మెంట్ అంశం మరోసారి సందిగ్ధంలో పడింది. వన్డే ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతానని గతంలో ప్రకటించిన గేల్.. ఆ తర్వాత మనసు మార్చుకొని స్వదేశంలో భారత్‌తో సిరీస్ అనంతరం వైదొలుగుతానని చెప్పిన విషయం తెలిసిందే. జమైకాలోని సొంత మైదానంలో భారత్‌తో జరిగే టెస్టు అనంతరం కెరీర్‌ను ముగిద్దామనుకున్నా.. అతడికి సెలక్టర్లు టెస్టు జట్టులో చోటివ్వలేదు. దీంతో టీమ్‌ఇండియాతో బుధవారం జరిగిన మూడో వన్డేనే గేల్‌కు చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని అందరూ అనుకున్నారు. ఔటయ్యాక కూడా ఆటగాళ్లంతా క్రిస్ గేల్‌ను అభినందించారు. విండీస్ వీరుడు సైతం ఇక సెలవు అన్నట్టు బ్యాట్‌తో అభిమానులకు అభివాదం చేశాడు. అయితే, తాజాగా తన రిటైర్మెంట్‌పై గేల్ మరో ట్విస్ట్ ఇచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలుపై తాను ఎలాంటి ప్రకటన చేయలేదని గురువారం వెల్లడించాడు. తాను ప్రస్తుతం వెస్టిండీస్ జట్టుతోనే ఉన్నానని చెప్పాడు. ఈ వీడియోను విండీస్ క్రికెట్ బోర్డు ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. భారత్‌తో జరిగిన మూడో వన్డేలో గేల్(41 బంతుల్లో 71) ట్రేడ్‌మార్క్ ఇన్నింగ్స్‌తో అలరించిన విషయం తెలిసిందే.

# విరాట విజయం

“ రెండు మ్యాచ్‌ల్లోనూ శ్రేయస్ ప్రదర్శన ఆకట్టుకుంది. పరిస్థితులకు తగ్గట్లు నాతో కలిసి క్రీజులో నిలిచాడు. అతడి నుంచి జట్టు ఇలాంటి ప్రదర్శనే ఆశిస్తున్నది. అయ్యర్ ఒత్తిడిని అధిగమించిన విధానం ఆకట్టుకుంది. అతడో గేమ్ చేంజర్. ఇలాగే నిలకడ కొనసాగిస్తే.. అతడు మిడిలార్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదుగుతాడు. ఆరంభంలో గేల్, లూయిస్ జోరు చూస్తుంటే.. భారీ స్కోరు ఖాయమే అనిపించినా.. మా బౌలర్లు వారిని తక్కువ పరుగులకే కట్టడి చేయడం కలిసొచ్చింది.

-కోహ్లీ, భారత కెప్టెన్.



కోహ్లీ (114★)

**అచ్చొచ్చిన ప్రత్యర్థిపై టీమ్‌ఇండియా అదరగొట్టింది. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ వెస్టిండీస్‌ను వారి గడ్డపైనే చితక్కొట్టిన విరాట్‌సేన.. వన్డేల్లోనూ సేమ్ సీన్ రిపీట్ చేసి క్లీన్‌స్వీప్ చేసింది. వరుణుడు దోబూచులాడిన మ్యాచ్‌లో తొలుత ప్రత్యర్థిని ఓ మోస్తరు స్కోరుకే కట్టడి చేసిన కోహ్లీ అండ్ కో.. బ్యాటింగ్‌లో విశ్వరూపం ప్రదర్శించింది. రికార్డుల రారాజు, రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ మరో సూపర్ సెంచరీతో రెచ్చిపోతే.. మిడిలార్డర్‌లో తనపై నమ్మకమును చొచ్చని శ్రేయస్ అయ్యర్ చాటిచెప్పాడు. వన్డేల్లో తన అత్యధిక సగటు (60.31) నమోదు చేసిన విరాట్.. ఒకే దశాబ్దంలో 20 వేల అంతర్జాతీయ పరుగులు పూర్తి చేసిన బ్యాట్స్‌మన్‌గా సరికొత్త చరిత్ర లిఖించాడు. ఫలితంగా విండీస్‌పై భారత్ వరుసగా 9వ వన్డే సిరీస్ గెలుచుకుంది.**

**1** ఒక జట్టుపై అత్యధిక శతకాలు సాధించిన బ్యాట్స్‌మన్ జాబితాలో కోహ్లీ (9, వెస్టిండీస్‌పై), సచిన్ (9, ఆస్ట్రేలియాపై) సరసన చేరాడు.

**2** వన్డేల్లో అత్యధిక సెంచరీలు (21) చేసిన రెండో కెప్టెన్‌గా కోహ్లీ నిలిచాడు. ఆసీస్ మాజీ సారథి పాంటింగ్ (22) టాప్‌లో ఉన్నాడు.

**3** విండీస్ గడ్డపై కోహ్లీకిది హ్యాట్రిక్ సెంచరీ. ఈ సిరీస్‌లో రెండు వన్డేల్లోనూ శతక్కొట్టిన విరాట్ 2017లో విండీస్‌లో ఆడిన చివరి వన్డేలోనూ సెంచరీ బాదాడు.

**9** వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా 9వ వన్డే సిరీస్ విజయం.




### కోహ్లీకి గాయం!

ఈ మ్యాచ్‌లో కోహ్లీ బొటనవేలికి గాయమైంది. బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో రోచ్ విసిరిన బౌన్సర్ నేరుగా విరాట్ కుడి బొటనవేలికి తగిలింది. దీంతో ఫిజియో మైదానంలోకి రావాల్సి వచ్చింది. ఆ సమయంలో నొప్పితో విలవిల్లాడిన కోహ్లీ.. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. 'చీలిక వచ్చిందని అనుకోవడంలేదు. బంతి గోటిపై బలంగా తాకిందంతే. తొలి టెస్టుకు అందుబాటులో ఉంటా' అని స్పష్టం చేశాడు.

## సెంచరీతో అదరగొట్టిన కోహ్లీ.. శ్రేయస్ అయ్యర్ మెరుపులు
## చివరి వన్డేలో విండీస్‌పై 6 వికెట్లతో భారత్ జయభేరి.. 2-0తో సిరీస్ సొంతం

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** నాయకుడు ముందుండి నడిపించిన వేళ టీమ్‌ఇండియా మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమి అనంతరం విండీస్ టూర్‌లో ఉన్న భారత్ అపజయమన్నదే లేకుండా దూసుకెళ్తున్నది. విండీస్ గడ్డపై ఇప్పటికే టీ20 సిరీస్ చేజిక్కించుకున్న విరాట్ సేన తాజాగా.. వన్డే సిరీస్‌నూ 2-0తో కైవసం చేసుకుంది. గురువారం తెల్లవారుజామున ముగిసిన మూడో వన్డేలో టీమ్‌ఇండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. విండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా తొమ్మిదో వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. వర్షం కారణంగా పలుమార్లు ఆగిన మ్యాచ్‌ను తొలుత 35 ఓవర్లకు కుదించగా.. కరీబియన్లు 7 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేశారు. అనంతరం టీమ్ ఇండియా లక్ష్యాన్ని 35 ఓవర్లలో 255గా సవరించారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ (99 బంతుల్లో 114 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ శతకానికి, శ్రేయస్ అయ్యర్ (41 బంతుల్లో 65; 3 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులు తోడవడంతో భారత్ 32.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసి గెలిచింది. రెండో వన్డేకు యాక్షన్ రిప్లేలా సాగిన ఈ మ్యాచ్‌లో విరాట్ మరో సెంచరీతో కదంతొక్కితే.. మిడిలార్డర్‌లో అయ్యర్ అదరగొట్టాడు. సెంచరీ హీరో కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఈనెల 22 నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుంది.

**పాఠాలు నేర్చుకోని పంత్**

ప్రత్యర్థి చేసింది 240 పరుగులే అయినా.. డక్‌వర్త్ పద్ధతి ప్రకారం విరాట్ సేన లక్ష్యాన్ని 255గా నిర్దేశించారు. వర్షం అనంతరం అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై పరుగులు చేయడం కష్టంగా మారినా భారత్ ఎక్కడ వెనకడుగు వేయలేదు. ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను బౌండ్రీకి తరలించిన రోహిత్ శర్మ (10) తన ఉద్దేశం చెప్పకనే చెప్పాడు. మరో ఎండ్‌లో శిఖర్ ధావన్ (36) కూడా 3 ఫోర్లు కొట్టి జోరు కనబర్చాడు. అయితే లేని పరుగు కోసం యత్నించిన రోహిత్ రనౌటవడంతో భారత్‌కు మంచి ఆరంభం లభించలేదు. అక్కడి నుంచి శిఖర్‌కు జతైన కోహ్లీ ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత భుజానెత్తుకున్నాడు. ఫలితంగా 10 ఓవర్లు ముగిసే సరికి టీమ్‌ఇండియా వికెట్ నష్టానికి 83 పరుగులు చేసింది. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు అలెన్ బ్రేకులు వేశాడు. మూడు బంతుల వ్యవధిలో ధావన్‌తో పాటు రిషబ్ పంత్ (0)ను ఔట్‌చేశాడు. భారీ షాట్‌కు యత్నించిన శిఖర్ పాల్ చేతికి చిక్కితే.. ఎదుర్కొన్న తొలి బంతికే చెత్త షాట్ ఆడిన పంత్ గోల్డెన్ డక్‌గా పెవిలియన్ బాటపట్టాడు.

**గేల్ మెరిసినా..**

అంతకుముందు గేల్ (72), లూయిస్ (43) మెరుపులు మెరిపించినా.. మిగిలిన వారు అంతగా రాణించకపోవడంతో విండీస్ ఊహించిన దానికంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది. తొలి 10 ఓవర్లలో 114 పరుగులు చేసిన ఆ జట్టు మిగిలిన 25 ఓవర్లలో 126 రన్సే చేసింది. ఓ వైపు పేసర్లు ఖలీల్ (3/68), షమీ (2/50) వికెట్లు పడగొడుతుంటే.. మరోవైపు నుంచి చాహల్, జాదవ్, జడేజా పరుగులు కట్టడి చేస్తూ ఒత్తిడి పెంచారు. ఆఖర్లో పూరన్ (16 బంతుల్లో 30; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో విండీస్ పోరాడే స్కోరు చేయగలిగింది.

### స్కోరు బోర్డు

**వెస్టిండీస్:** గేల్ (సి) కోహ్లీ (బి) ఖలీల్ 72, లూయిస్ (సి) ధవన్ (బి) చాహల్ 43, హోప్ (బి) జడేజా 24, హెట్‌మైర్ (బి) షమీ 25, పూరన్ (సి) (సబ్) పాండే (బి) షమీ 30, హోల్డర్ (సి) కోహ్లీ (బి) ఖలీల్ 14, బ్రాత్‌వైట్ (సి) పంత్ (బి) ఖలీల్ 16, అలెన్ (నాటౌట్) 6, పాల్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 10, **మొత్తం:** 35 ఓవర్లలో 240/7. **వికెట్ల పతనం:** 1-115, 2-121, 3-171, 4-171, 5-211, 6-221, 7-236, **బౌలింగ్:** భువనేశ్వర్ 5-1-48-0, షమీ 7-1-50-2, ఖలీల్ 7-0-68-3, చాహల్ 7-0-32-1, జాదవ్ 4-0-13-0, జడేజా 5-0-26-1.

**భారత్:** రోహిత్ (రనౌట్) 10, ధావన్ (సి) పాల్ (బి) అలెన్ 36, కోహ్లీ (నాటౌట్) 114, పంత్ (సి) పాల్ (బి) అలెన్ 0, శ్రేయస్ (సి) హోల్డర్ (బి) రోచ్ 65, జాదవ్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు** 12, **మొత్తం:** 32.3 ఓవర్లలో 256/4. **వికెట్ల పతనం:** 1-25, 2-91, 3-92, 4-212, **బౌలింగ్:** రోచ్ 7-0-53-1, హోల్డర్ 4-0-39-0, పాల్ 5-0-39-0, అలెన్ 6-0-40-2, చేజ్ 7-0-43-0, బ్రాత్‌వైట్ 3.3-038-0.

**1** ఒక దశాబ్దంలో 20 వేల అంతర్జాతీయ పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా కోహ్లీ (20,018) చరిత్రకెక్కాడు. పాంటింగ్ (18,962) ఆ తర్వాతి స్థానంలో ఉన్నాడు.

## కుమ్మేసిన కోహ్లీ, అయ్యర్

శ్రేయస్ అయ్యర్ క్రీజులో అడుగుపెట్టే సమయానికి భారత్ లక్ష్యం 134 బంతుల్లో 164 పరుగులు. ఈ దశలో వీరిద్దరూ రెండో వన్డేను తలపిస్తూ చెలరేగిపోయారు. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడినా.. అలెన్ ఓవర్‌లో అయ్యర్ రెండు సిక్సర్లు బాది జోరుపెంచాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హోప్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన కోహ్లీ ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. ఈ జోడీ ఎలాంటి తడబాటు లేకుండా ముందుకు సాగడంతో చూస్తుండగానే లక్ష్యం కరుగుతూ వెళ్లింది. ముఖ్యంగా శ్రేయస్ తన స్ట్రోక్‌ప్లేతో ఆకట్టుకున్నాడు. రెండో వన్డేలో కోహ్లీకి సహకారమందించడానికే పరిమితమైన అయ్యర్ ఈ మ్యాచ్‌లో తనదైన శైలిలో రెచ్చిపోయాడు. ఫోర్ల కంటే ఎక్కువ సిక్సర్లు బాదుతూ 33 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అలెన్ బౌలింగ్‌లో అతడు కొట్టిన స్ట్రెయిట్ సిక్స్ మ్యాచ్‌కే హైలైట్. నాలుగో వికెట్‌కు 120 పరుగులు జోడించాక అయ్యర్ ఔటైనా జాదవ్ (19 నాటౌట్)తో కలిసి కోహ్లీ మిగిలిన పని పూర్తిచేశాడు. ఈ క్రమంలో వన్డేల్లో 43వ శతకం పూర్తి చేసుకున్న కోహ్లీ.. ఒక దశాబ్దంలో 20 వేల పరుగులు పూర్తిచేసిన తొలి క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు.



అయ్యర్ (65)

## ఇటు ఐదు అటు ఐదు

### జైపూర్‌కు 5వ గెలుపు.. పుణేరీకి 5వ ఓటమి



**అహ్మదాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ 7వ సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ ఐదో విజయాన్ని నమోదు చేసుకుంది. గురువారం ఇక్కడ జరిగిన ఏకపక్ష మ్యాచ్‌లో జైపూర్ 33-25 తేడాతో పుణేరీ పల్టన్‌పై గెలుపొందింది. లీగ్‌లో ఆరు మ్యాచ్‌లాడిన పాంథర్స్‌కు ఇది ఐదో విజయం కాగా.. పల్టన్‌కు ఐదో పరాజయం. జైపూర్ 25 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరగా.. పల్టన్స్ అట్టడుగున కొనసాగుతున్నది. పాంథర్స్ తరుపున దీపక్ హుడా 10 పాయింట్లతో ఆకట్టుకోగా.. పల్టన్ తరపున సబ్‌స్టిట్యూట్‌గా బరిలో దిగిన పంకజ్ (8 పాయింట్లు) మెరిశాడు. ప్రత్యర్థి జట్టును రెండు సార్లు ఆలౌట్ చేయడంతో పాటు ప్రారంభం నుంచి డిఫెన్స్‌లో ఆకట్టుకున్న జైపూర్ అలవోకగా విజయం సాధించింది.

తొలి రైడ్‌లో నితిన్ తోమర్ పాయింట్ తేవడంతో పుణేరీ ఖాతా తెరిస్తే.. మరుసటి రైడ్‌లోనే అతడిని ఔట్ చేసిన దీపక్ హుడా బదులు తీర్చుకున్నాడు. డూ ఆర్ డై రైడ్‌లలో మాత్రమే పాయింట్ల కోసం ప్రయత్నిస్తూ.. మిగిలిన సమయాల్లో డిఫెన్స్‌తోనే ఆకట్టుకుంటూ ముందుకు సాగిన జైపూర్ హాఫ్‌టైమ్ ముగిసేసరికి 17-11తో ఆధిక్యంలో నిలిచింది. తొలి అర్ధభాగంలోనే ప్రత్యర్థిని ఓసారి ఆలౌట్ చేసిన పాంథర్స్ రెండో సగంలోనూ మరోసారి ఆలౌట్ చేయడంతో ఆధిక్యం 27-16కు పెరిగింది. ఇక అక్కడి నుంచి ఎలాంటి తొందరపాటుకు పోకుండా కాలయాపన చేసిన జైపూర్ చివరకు 33-25తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

## కోల్‌కతా కోచ్‌గా మెక్‌కల్లమ్




**ముంబై :** ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్టు ప్రధాన కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, బ్రెండన్ మెక్‌కల్లమ్ ఎంపికయ్యాడు. వచ్చే సీజన్ నుంచి మెక్ బాధ్యతలను చేపట్టనున్నాడు. ఐపీఎల్‌లో 2008-10, 2012-13 మధ్య కేకేఆర్ తరపున మెక్‌కల్లమ్ ఆడాడు. 2008లో ఐపీఎల్ తొలి సీజన్ మొదటి మ్యాచ్‌లోనే కేకేఆర్ తరపున మెక్ ఏకంగా 73 బంతుల్లో 158 బాది అదిరే ఆరంభం ఇవ్వడం ఇప్పటికీ అభిమానుల మదిలో మెదులుతూనే ఉంటుంది. ఇప్పు డు అదే కోల్‌కతాకు హెడ్‌కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఐదో స్థానంలో నిలిచి ప్లేఆఫ్‌కు చేరడంలో కోల్‌కతా విఫలం కాగా.. 2015 నుంచి జట్టుకు హెడ్‌కోచ్‌గా ఉన్న దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ కలిస్‌ను యాజమాన్యం తప్పించింది. ఆ స్థానంలో బ్రెండెన్‌ను నియమిస్తున్నట్టు గురువారం ప్రకటించింది. 'ఈ బాధ్యతను చేపట్టడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. నైట్‌రైడర్స్ జట్లు ఐపీఎల్, సీపీఎల్‌లో ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఐకానిక్‌గా మారాయి. కేకేఆర్, టీకేఆర్ జట్లు అద్భుతంగా ఉన్నాయి' అని మెక్‌కల్లమ్ అన్నాడు.

## వీబీ చంద్రశేఖర్ కన్నుమూత




**న్యూఢిల్లీ:** భారత మాజీ క్రికెటర్, జాతీయ సెలెక్టర్ వీబీ చంద్రశేఖర్ గురువారం చెన్నైలో కన్నుమూశారు. తీవ్రమైన గుండెనొప్పితో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మరో ఆరు రోజుల్లో 58వ పడిలోకి ప్రవేశించనున్న చంద్రశేఖర్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భారత్ తరపున 1988 నుంచి 1990 మధ్య కాలంలో ఏడు వన్డేలాడిన చంద్రశేఖర్ 88 పరుగులు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో అంతగా ఆకట్టుకోలేకపోయిన వీబీకి ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మెరుగైన రికార్డు ఉంది. మొత్తం 81 మ్యాచ్‌ల్లో 43.09 సగటుతో 4999 పరుగులు చేశాడు. ఇందులో 10 సెంచరీలు, 23 అర్ధసెంచరీలు ఉన్నాయి. 25 ఏండ్ల వయసులో తమిళనాడు తరపున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన చంద్రశేఖర్‌కు డాషింగ్ బ్యాట్స్‌మన్ అన్న పేరు ఉంది. డబ్ల్యూవీ రామన్, దివాకర్ వాసు, లక్ష్మణ్ శివరామకృష్ణన్, భరత్ అరుణ్‌తో కలిసి వీబీ తమిళనాడుకు ఆడాడు. వీబీ ఆకస్మిక మృతి పట్ల సురేశ్ రైనా, హర్భజన్‌సింగ్, ఆకాశ్ చోప్రా, దీప్‌దాస్ గుప్తా విచారం వ్యక్తం చేశారు.

## ధోనీ-ఫ్లెమింగ్ అత్యుత్తమ జోడీ : వాట్సన్

**చెన్నై :** కెప్టెన్-కోచ్‌గా మహేంద్ర సింగ్ ధోనీ, స్టీఫెన్ ఫ్లెమింగ్‌ది ప్రపంచంలోనే అత్యుత్తమ కాంబినేషన్ అని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో ధోనీ కెప్టెన్‌గా, ఫ్లెమింగ్ కోచ్‌గా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ తరపున వాట్సన్ ఆడుతున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్ ఫైనల్లో ముంబైపై షేన్(59 బంతుల్లో 80) వీరోచితంగా పోరాడినా సూపర్ కింగ్స్‌కు టైటిల్ దక్కని సంగతి తెలిసిందే. అయితే, గాయమై రక్తం వస్తున్నా చివరి వరకు పోరాడిన వాట్సన్‌పై మాత్రం ప్రశంసల వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ అనుభవాలపై షేన్ గురువారం తన భావాలను వ్యక్తపరిచాడు. 'చెన్నై సూపర్‌కింగ్స్‌తో నా అనుభవం చాలా ప్రత్యేకమైనది. మైదానంలోనూ, బయట సీఎస్‌కే మొత్తం ప్రశాంత చిత్తంతో ఉంటుంది. ఫ్రాంచైజీని ఎలా ముందుకు నడిపించాలో జట్టు యజమాని ఎన్.శ్రీనివాసన్‌కు బాగా తెలుసు. అలాగే ఎంఎస్ ధోనీ, ఫ్లెమింగ్ ప్రపంచంలోనే అత్యుత్తమ కెప్టెన్-కోచ్ కాంబినేషన్ అని నేను నమ్ముతా. సూపర్ కింగ్స్ ఇంత విజయవంతమైన జట్టు అయ్యేందుకు రహస్యాలు ఏమీ లేవు. అది గొప్ప ఫ్రాంచైజీ, నిర్వహణ అంతే బాగా ఉంటుంది' అని వాట్సన్ అన్నాడు. అలాగే యాషెస్ సిరీస్ తొలి టెస్టులో రెండు శతకాలు సాధించిన ఆసీస్ మాజీ సారథి స్టీవ్ స్మిత్‌ను కూడా వాట్సన్ ప్రశంసించాడు.

## ఆసీస్, ఇంగ్లండ్ హోరాహోరీ



హాజిల్‌వుడ్ (3/58)

**లండన్:** ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య యాషెస్ సిరీస్ రెండో టెస్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగుతున్నది. గురువారం ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 77.1 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. పరుగుల ఖాతా తెరవకుండానే ఓపెనర్ జాసన్ రాయ్(0) వికెట్ కోల్పోయిన ఇంగ్లండ్‌ను జో బర్న్స్(53), బెయిర్‌స్టో(52) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. భారీ ఆశలు పెట్టుకున్న కెప్టెన్ జో రూట్(14) మరోమారు నిరాశపరుచగా, బట్లర్(12), స్టోక్స్(13) బ్యాట్లు ఝులిపించలేకపోయారు. పిచ్‌పై బౌన్స్‌ను తమకు అనుకూలంగా మలుచుకున్న ఆసీస్ ఫాస్ట్‌బౌలర్లు బౌన్సర్లతో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. కమ్మిన్స్(3/61), హాజిల్‌వుడ్(3/58), లియాన్(3/68) మూడేసి వికెట్లతో విజృంభించారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. వార్నర్(3) వికెట్ కోల్పోయి 13 ఓవర్లలో 30 పరుగులు చేసింది.

## పటేల్ పాంచ్ పటాకా

### శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 227/7



ఎజాజ్ పటేల్ (5/76)

**గాలె:** న్యూజిలాండ్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశామనుకున్న శ్రీలంక అదే స్పిన్‌కు పడిపోయింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ ఎజాజ్ పటేల్ (5/76) విజృంభణతో లంక తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 227 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (53, 7ఫోర్లు, సిక్స్), ఏంజెలో మాథ్యూస్(50, 7ఫోర్లు, సిక్స్) అర్ధ శతకాలతో రాణించారు. పిచ్ పూర్తిగా స్పిన్‌కు అనుకూలిస్తున్నా.. వీరిద్దరు కివీస్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకుంటున్న తరుణంలో మెండిస్‌ను ఔట్ చేసి మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యానికి పటేల్ ముగింపు పలికాడు. ఇక్కడినుంచి లంక ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. 18 పరుగుల తేడాతో లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 203/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 249 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ(5/80) ఐదు వికెట్లతో అదరగొట్టగా లక్మల్(4/29) రాణించాడు.

## రెండు రోజుల్లో రూ.29 వేల కోట్లు!



**రికార్డు స్థాయిలో పెరిగిన ముకేశ్ అంబానీ సంపద ■ మదుపరుల్లో ఇటీవలి ఏజీఎం ప్రకటనల ఉత్సాహం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారతీయ అపర కుబేరుడు ముకేశ్ అంబానీ సంపద విలువ మునుపెన్నడూ లేనివిధంగా రెండు రోజుల్లోనే దాదాపు రూ.29 వేల కోట్లు ఎగబాకింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) 42వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) జరిగిన దగ్గర్నుంచి ఆ సంస్థ ప్రధాన ప్రమోటర్‌గా ఉన్న అంబానీ సంపద విలువ రికార్డు స్థాయిలో ఎగిసింది మరి. దేశీయ స్టాక్ మార్కెట్లకు సెలవు రోజైన సోమవారం ఏజీఎం జరుగగా, మంగళ, బుధవారం ట్రేడింగుల్లో రిలయన్స్ మార్కెట్ విలువ విపరీతంగా పుంజుకున్నది. జియో ఫైబర్ ఆఫర్, సౌదీ ఆరామ్కో రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులు, 18 నెలల్లో రుణ రహిత రిలయన్స్ లక్ష్యం, బ్రిటిష్ పెట్రోలియం రూ.7 వేల కోట్ల పెట్టుబడులు తదితర ప్రకటనలు, ఒప్పందాలు మదుపరులను పెద్ద ఎత్తున ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే అంతర్జాతీయ ఆందోళనల కారణంగా స్టాక్ మార్కెట్లు భారీగా పతనమైనా.. రిలయన్స్ షేర్ విలువ మాత్రం 10 శాతం లాభపడింది. శుక్రవారం రూ.1,162 వద్ద ముగిసిన రిలయన్స్ షేర్ విలువ.. బుధవారం రూ.1,288.30 వద్ద నిలిచింది. దీంతో మంగళ, బుధవారాల్లో సంస్థ మార్కెట్ విలువ 4 బిలియన్ డాలర్లు (రూ.28,684 కోట్లు) పెరిగింది.

# పెట్టుబడులతో వృద్ధికి ఊతం

## 73వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ

రూ.100 లక్షల కోట్లతో మౌలిక రంగాభివృద్ధి

5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఆశయ సాధనకు ప్రణాళిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:**

దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న తీవ్ర మందగమన పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓ భారీ పెట్టుబడుల ఆధారిత వృద్ధి ప్రణాళికను సిద్ధం చేశారు. రూ.100 లక్షల కోట్లతో మౌలిక రంగాభివృద్ధికి నడుంబిగించారు. ఇది వచ్చే ఐదేండ్లలో 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని నెరవేర్చగలదన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. గురువారం 73వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రక ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి మోదీ ప్రసంగించారు. దేశ ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నాయన్న మోదీ.. సుస్థిర ప్రభుత్వం ఏర్పడటం వల్ల అంతర్జాతీయంగా భారత్‌లో పెట్టుబడులకు అవకాశాలు పెరిగాయని అన్నారు. '5 లక్షల కోట్ల డాలర్ల (దాదాపు రూ.358 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థను మేము లక్ష్యంగా చేసుకున్నాం. చాలా మంది ఇది కష్టతరమని అనుకుంటున్నారు. అయితే కష్టపడకపోతే మనం ఎలా అభివృద్ధి చెందుతాం' అని ప్రశ్నించారు. 'గడిచిన 70 ఏండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ 2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఒక్క గతేడాదే లక్ష కోట్ల డాలర్లు పెరిగింది. ఇదే మాకు రాబోయే ఐదేండ్లలో ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు పెంచగలమన్న ఆత్మ విశ్వాసాన్ని అందించింది' అని వ్యాఖ్యానించారు. అయితే ఈ లక్ష్యం మరిన్ని పెట్టుబడులతోనే సాధ్యం కాగలదు. ముఖ్యంగా మౌలిక రంగంలో భారీ పెట్టుబడులు పెట్టాలి అన్నారు. అందుకే దేశంలో ప్రపంచ శ్రేణి మౌలిక రంగాభివృద్ధికి రూ.100 లక్షల కోట్లను పెట్టుబడులుగా పెట్టాలని నిర్ణయించామని చెప్పారు. ప్రధానంగా రహదారుల నిర్మాణం, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థల్లో పెట్టుబడులుంటాయని వివరించారు.

### 1 వ్యాపార నిర్వహణ మరింత సులభం



దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేస్తామని, ప్రపంచ టాప్-50లో నిలబెడుతామని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి ఈ విషయంలో భారత్ ర్యాంకు ఎక్కడి నుంచి ఏ స్థాయికి వచ్చిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదన్నారు. ఏడాది వ్యవధిలో 23 స్థానాలు ఎగబాకి 100 నుంచి 77వ ర్యాంకుకు మెరుగైన విషయం తెలిసిందే. కఠిన చట్టాలను సరళతరం చేస్తున్నామని, మదుపరులకు అనువైన నిర్ణయాలను తీసుకుంటున్నామన్నారు. ఒకే దేశం.. ఒకే పన్ను తరహాలో, ఒకే దేశం.. ఒకే గ్రిడ్ పేరుతో ఇంధన రంగాన్నీ సంస్కరిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఒకే దేశం.. ఒకే మొబిలిటి కార్డుతో ప్రయాణాన్ని సులువు చేస్తున్నామనీ వివరించారు. పారదర్శకతలో భాగంగా దేశంలో నగదు రహిత సేవలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను డిజిటల్ బాట పట్టిస్తున్నామని ఆయన చెప్పారు.

### 2 కార్పొరేట్లను అనుమానంగా చూడొద్దు



కార్పొరేట్లకు మోదీ మరోసారి అండగా నిలబడ్డారు. వ్యాపార, పారిశ్రామిక వర్గాలు దేశ సంపద సృష్టికర్తలని, వారిని అనుమానంగా చూడవద్దని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వారిని గౌరవించాల్సిందేనన్నారు. సంపద సృష్టి అనేది జాతికి చేసే గొప్ప సేవగా అభివర్ణించిన ఆయన.. కార్పొరేట్లు దేశానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. 'సంపద సృష్టికర్తలను మనం ఎప్పటికీ అనుమానించవద్దు. సంపదను సృష్టించినప్పుడే దాన్ని పంపిణీ చేయగలుగుతాం' అన్నారు. గడిచిన ఏడాది కాలంలో కార్పొరేట్లకు బాసటగా మోదీ నిలువడం.. ఇది మూడోసారి కావడం గమనార్హం. గతేడాది జూలై, అక్టోబర్‌ల్లో కూడా మోదీ కార్పొరేట్ వర్గాలకు మద్దతుగా నిలబడగా, పరిశ్రమ సంస్కృతిని తాను గౌరవిస్తానని, దేశాభివృద్ధికి పారిశ్రామిక వర్గాలు ఎంతగానో దోహదపడుతున్నారని నాడు ప్రకటించారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతున్న కార్పొరేట్లను జాతి ఎప్పటికీ మరువబోదన్నారు.

### 3 ఆర్థిక పరిస్థితులపై సమీక్ష

దేశంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమీక్ష నిర్వహించారు. అమ్మకాలు లేక ఆటో, నిర్మాణ, ఎఫ్ఎంసీజీ రంగాలు.. నగదు కొరతతో ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎస్ఎంఈలు సంక్షోభంలో చిక్కుకోవడం, లక్షలాది ఉద్యోగాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో ఈ సమీక్ష అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సమీక్షా సమావేశంలో సీతారామన్‌తోపాటు ఆర్థిక శాఖలోని ఉన్నతస్థాయి వర్గాలంతా పాల్గొన్నాయి. మందగమనానికి గల కారణాలు, దీర్ఘకాలిక ప్రభావాలు, వాటి పరిష్కార మార్గాలను ఈ సందర్భంగా చర్చించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. దీంతో రంగాలవారీగా త్వరలోనే ఉద్దీపనలకు అవకాశం ఉందన్న సమాచా రం వినిపిస్తున్నది. ఇప్పటికే పలు రంగాల ప్రతినిధులతో నిర్మలా సమావేశమై, వా రి సమస్యలు తెలుసుకున్న విషయం తెలిసిందే. వీటిని ప్రధాని కి నివేదిక రూపంలో అందించినట్లు తెలుస్తున్నది.





### 4 వృద్ధిరేటుపై ఆందోళన

మోదీ మొదటి ఐదేండ్ల పాలనలో దేశ జీడీపీ పెరుగుతూపోయిన విషయం తెలిసిందే. 2016-17ల్లోనైతే 8 శాతం వృద్ధిరేటు నమోదైన సంగతీ విదితమే. అయితే ఈ సమయంలో వచ్చిన పాత పెద్ద నోట్ల రద్దు, తెచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వంటి సంస్కరణలు దేశ జీడీపీ పరుగులకు బ్రేక్‌లు వేశాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో వృద్ధిరేటు ఐదేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 5.8 శాతంగా నమోదైంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను లోక్‌సభలో గత నెల 5న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంపన్నులపై సర్‌చార్జీ ప్రతిపాదన.. మరింతగా పరిస్థితులను దిగజార్చింది. స్టాక్ మార్కెట్లు, రుణ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడులను వెనుకకు తీసుకుంటున్నది చూస్తూనే ఉన్నాం. మరోవైపు అంతర్జాతీయంగా అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కూడా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపగా, కొనుగోళ్ల శక్తి క్షీణించి ఆటో, నిర్మాణ, ఎఫ్ఎంసీజీ రంగాలు కుదేలైపోతున్నాయి. ఫలితంగా మోదీ సర్కారు 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంపై నీలిమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలోనే రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులతో వృద్ధికి ఊతమివ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## ఎరువుల ధరలు తగ్గించిన ఇఫ్కో

- ఒక్కో బ్యాగుపై రూ.50 కోత
- అమల్లోకి వచ్చిన కొత్త ధరలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:**

రైతులకు స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా అందించింది ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ ఇఫ్కో. డీఏపీతోపాటు కాంప్లెక్స్ ఎరువుల బస్తా ధరను రూ.50 తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో నిర్వహణ ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు స్వల్ప ఊరట లభించినట్లు అయింది. తగ్గించిన ధరలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. 73వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతులకు ఆర్థికంగా చేయూతనివ్వడంతోపాటు వ్యవసాయ వ్యయాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కంపెనీ తీసుకున్న తాజా నిర్ణయంతో డీఏపీ(డై-అమోనియం ఫాస్ఫేట్) 50 కిలోల బస్తా ధర రూ.1,300 నుంచి రూ.1,250కి తగ్గనుండగా, ఎన్‌పీకే 1 ధర కూడా రూ.1,250 నుంచి రూ.1,200కి, ఎన్‌పీకే 2 బస్తా విలువ రూ.1,260 నుంచి రూ.1,210కి తగ్గనున్నాయి. వీటితోపాటు ఎన్‌పీ బస్తా ధర కూడా రూ.1,000 నుంచి రూ.950కి కుదించింది. నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి కాంప్లెక్స్ ఎరువులను కలిపి ఎన్‌పీకేగా తయారు చేస్తున్నది సంస్థ. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాలకు అనుగుణంగా సంస్థ ఆ దిశగా కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగా ఎరువుల ధరలను తగ్గించినట్లు ఇఫ్కో ఎండీ యూఎస్ అవాస్థి తెలిపారు. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా ఉన్న 35 వేల కో-ఆపరేటివ్ సంఘాల ద్వారా 5 కోట్ల మంది రైతులకు సేవలు అందిస్తున్నది. ప్రపంచంలో అతిపెద్ద ప్రాసెసెడ్ ఎరువుల కో-ఆపరేటివ్ సంస్థయైన ఇఫ్కో..గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.27,852 కోట్ల ఆదాయాన్ని గడించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు ఉత్పత్తి కేంద్రాల ద్వారా 81.49 లక్షల టన్నుల ఎరువులను ఉత్పత్తి చేస్తున్నది. ఎరువులతోపాటు సాధారణ బీమా, గ్రామీణ మొబైల్ టెలిఫోన్, చమురు అండ్ గ్యాస్, ఇంటర్నేషనల్ ట్రేడింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్గానిక్స్ వంటి రంగాల్లో కూడా సేవలు అందిస్తున్నది.





## నాలుగింతలైన ఆర్-క్యాప్ లాభం

- తొలి త్రైమాసికంలో రూ.1,218 కోట్లుగా నమోదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ క్యాపిటల్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.1,218 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.295 కోట్లతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగింది. ఆదాయం భారీగా పుంజుకోవడం కంపెనీకి కలిసొచ్చింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 31 శాతం ఎగబాకి రూ.6,083 కోట్లుగా నమోదైంది. ఏడాది క్రితం రూ.83,973 కోట్లుగా ఉన్న కంపెనీ ఆస్తులు..గత త్రైమాసికానికిగాను రూ.79,207 కోట్లకు తగ్గాయి.

## జీఎంఆర్ నష్టం రూ.335 కోట్లు

**హైదరాబాద్, ఆగస్టు 15:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.334.85 కోట్ల కన్సాలిడేటెడ్ నికర నష్టాన్ని నమోదు చేసుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.237.63 కోట్ల నష్టంతో పోలిస్తే భారీగా పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.1,867.24 కోట్ల నుంచి రూ.2,205.91 కోట్లకు ఎగబాకింది. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో విమానాశ్రయ విభాగం నుంచి రూ.1,441.60 కోట్ల ఆదాయంపై రూ.457.67 కోట్ల లాభాన్ని గడించింది. గతేడాది రూ.1,246.77 కోట్ల ఆదాయంపై రూ.276.55 కోట్ల లాభాన్ని గడించింది. ఢిల్లీ విమానాశ్రయం నుంచి ప్రయాణికులు ఏడాది ప్రాతిపదికన 10 శాతం తగ్గి 1.57 కోట్లకు తగ్గారు. ఆర్థిక సంక్షోభంతో అర్ధాంతరంగా మూతపడిన జెట్ ఎయిర్‌వేస్‌తో ప్రయాణికులపై ప్రతికూల ప్రభావం చూపినప్పటికీ నికర లాభం మాత్రం రూ.186 కోట్లుగా నమోదైంది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ప్రయాణికుల సంఖ్య 8 శాతం పెరిగి 55 లక్షలకు చేరారు. వీటితోపాటు ఫిలిప్పీన్స్‌లోని మక్టాన్ సెబు ఎయిర్‌పోర్ట్ నిర్వహించడం ద్వారా సంస్థకు రూ.47 కోట్ల నగదు లాభం సమకూరింది. కాగా, వ్యాపార విస్తరణకు అవసరమైన నిధుల్లో రూ.2,500 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి ఈ నెల 8న సమావేశమైన కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిధులను ఈక్విటీ షేర్లను జారీ చేయడం లేదా డిబెంచర్లను జారీ చేయడం ద్వారా సేకరించాలనుకుంటున్నది.

## ఓఎన్‌జీసీ రూ.83 వేల కోట్ల పెట్టుబడి

- 25 ప్రాజెక్టుల్లో ఇన్వెస్ట్ చేసిన సంస్థ





**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ఇంధనరంగంలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ)... చమురు అండ్ గ్యాస్ రంగంలో ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవడానికి గతేడాదికాలంలో 25 అతిపెద్ద ప్రాజెక్టుల్లో రూ.83 వేల కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టింది. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్ మాట్లాడుతూ.. ఈ భారీ పెట్టుబడులతో గ్యాస్ అండ్ చమురు ఉత్పత్తి సామర్థ్యం 18 కోట్ల టన్నులకు చేరుకునే అవకాశం ఉందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 2.42 కోట్ల టన్నుల క్రూడాయిల్‌ను ఉత్పత్తి చేయగా, 25.81 బిలియన్ క్యూబిక్ మీటర్ల(బీసీఎం) సహజ వాయువును ఉత్పత్తి చేసింది. వీటితోపాటు విదేశాల్లో ఉన్న చమురు క్షేత్రాల్లో 10.1 మిలియన్ టన్నుల చమురును, 4.736 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ప్రొడ్యూస్ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి సహజవాయువు ఉత్పత్తి సామర్థ్యాన్ని 32 బీసీఎంలకు పెంచాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,09,655 కోట్ల ఆదాయం(29 శాతం వృద్ధి)పై రూ.26,716 కోట్ల నికరలాభాన్ని(34 శాతం వృద్ధి) నమోదు చేసుకున్నది. విదేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏర్పాటు చేసిన ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ 14.83 మిలియన్ టన్నుల చమురును ఉత్పత్తి చేసింది. అలాగే ఇటీవల కొనుగోలు చేసిన హెచ్‌పీసీఎల్‌తో అదనంగా 38.7 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసినట్లు అయింది.

## Paytm

## భారత్‌లో రూ.750 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** డిజిటల్ పేమెంట్ సేవల సంస్థ పేటీఎం.. భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టిన సంస్థ.. తాజాగా వచ్చే మార్చి నాటికి రూ.750 కోట్ల పెట్టుబడితో పాటు నెలవారి వినియోగదారుల సంఖ్య 25 కోట్లకు పెంచుకోవాలని చూస్తున్నది. ప్రస్తుతం పేటీఎం ఇన్‌బాక్స్ సర్వీసుల్లో 2.7 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మరో 6-7 కోట్ల మంది చేరుకునే అవకాశం ఉన్నదని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ అబ్బాట్ తెలిపారు. ప్రస్తుతం సంస్థకు నికరంగా 14 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. కంపెనీకి చెందిన యాప్ ద్వారా నగదు చెల్లింపులకు సంబంధించి 300 కోట్ల లావాదేవీలు జరిగాయని పేర్కొంది. చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది భారీ పెట్టుబడులు పెట్టాలని బోర్డు నిర్ణయించిందని ఆయన చెప్పారు. దీంతో రెండు కోట్ల మంది రిటైల్ వ్యాపారులను ఈ డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి తీసుకురావాలని కంపెనీ సంకల్పించింది.


## మళ్లీ సౌదీనే టాప్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత్‌కు చమురు సరఫరా చేస్తున్న దేశాల్లో మళ్లీ సౌదీ అరేబియాదే అగ్రస్థానం కానున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) చమురు శుద్ధి-రసాయనాల వ్యాపారంలో సౌదీ అరేబియా చమురు సంస్థ ఆరామ్కో 20 శాతం వాటాను కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇరాక్‌ను సౌదీ వెనుకకు నెట్టే వీలున్నది. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా భారత్‌కు చమురు సరఫరాలో ఇరాక్ టాప్‌లో ఉంటున్నది. 2018-19లో భారత్‌కు సౌదీ అరేబియా నుంచి 40.33 మిలియన్ టన్నుల ముడి చమురు దిగుమతి అవుతున్నది.

## వాహన ఉత్పత్తి ఢమాల్

- ఏప్రిల్-జూలైలో 13.18 శాతం పతనం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశీయ ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి ఈ ఏప్రిల్-జూలై కాలంలో 13.8 శాతం క్షీణించింది. మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, ఫోర్డ్, టయోట, హోండా తదితర ప్రధాన సంస్థలు తమ తయారీని తగ్గించాయి. హ్యుందాయ్, ఫోక్స్‌వాగన్ సంస్థల ఉత్పత్తి మాత్రమే పెరిగింది. అదికూడా స్వల్పంగానేనని భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) తెలియజేసింది. మొత్తం ఈసారి ఉత్పత్తి 12,13,281 యూనిట్లుగా ఉన్నదని, గతేడాది ఏప్రిల్-జూలైలో 13,97,404 యూనిట్లుగా ఉందని సియామ్ పేర్కొన్నది. మారుతి ఉత్పత్తి 18.06 శాతం తగ్గగా, మహీంద్రా 10.65 శాతం, ఫోర్డ్ 25.11 శాతం, టాటా 20.37 శాతం, హోండా 18.86 శాతం, టయోట 20.98 శాతం మేర పడిపోయాయి. హ్యుందాయ్ ఉత్పత్తి 1.77 శాతం, ఫోక్స్‌వాగన్ తయారీ 1.05 శాతం చొప్పున పెరిగింది. ఇకపోతే ద్విచక్ర వాహనాల విభాగంలోనూ ఇదే రకమైన పరిస్థితులు కనిపించాయని సియామ్ స్పష్టం చేసింది.



## ప్రతీకారం తప్పదు

### అమెరికా సుంకాల హెచ్చరికలపై చైనా



**బీజింగ్, ఆగస్టు 15:** తమ వస్తు, ఉత్పత్తులపై అమెరికా మరిన్ని సుంకాలు విధించినట్లైతే.. ప్రతీకార సుంకాలు తప్పవని చైనా మరోసారి తీవ్రంగా హెచ్చరించింది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న చైనా వస్తూత్పత్తుల్లో మరో 300 బిలియన్ డాలర్ల విలువైన వాటిపై సెప్టెంబర్ 1 నుంచి 10 శాతం టారీఫ్‌లు అమల్లోకి తెస్తామని ఈ నెల ఆరంభంలో ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే దీన్ని డిసెంబర్‌దాకా వాయిదా వేస్తూ బుధవారం నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ అమెరికాపై చైనా నిప్పులు చెరుగుతున్నది. సుంకాల భారం పెరిగితే తమ నుంచీ వడ్డింపులుంటాయని స్పష్టం చేసింది. మరోవైపు చైనాతో తాను అనుసరిస్తున్న కఠిన వాణిజ్య విధానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకుంటూనే ఉన్నారు. గత పాలకుల చేతకానితనంతో చైనా.. అమెరికా మార్కెట్‌ను తన వ్యాపార విస్తరణకు పెద్ద ఎత్తున వాడుకున్నదని, అమెరికన్లు చైనా ఉత్పత్తుల కోసం వెచ్చించినదాన్నే ఇప్పుడు సుంకాల రూపంలో రాబడుతున్నానని ట్రంప్ పునరుద్ఘాటించారు. కాగా, ఓ వైపు అమెరికా-చైనా మధ్య వాణిజ్య సంప్రదింపులు జరుగుతున్నా.. మరోవైపు ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తుండటం చైనాకు మింగుడు పడటం లేదు. అమెరికా విధించిన సుంకాలకు బదులుగా ఇప్పటికే తమ దేశంలోకి దిగుమతి అవుతున్న 110 బిలియన్ డాలర్ల విలువైన ఆ దేశ వస్తూత్పత్తులపై చైనా ప్రతీకార సుంకాలను వేసింది.

**ముదురుతున్న వాణిజ్య యుద్ధం**

అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ ముదురుతున్నది. ఒకానొక దశలో తగ్గినట్లు కనిపించినా.. మరుక్షణమే అది తీవ్రరూపం దాల్చుతున్నది. ట్రంప్ నిర్ణయాలకు చైనా ధీటుగా బదులిస్తుండటమే ఇందుకు కారణం. 'ఆర్థిక, వాణిజ్యపరమైన ఘర్షణలకు సుంకాలు పరిష్కారం చూపబోవు. ఇది సరైన విధానం కాదు' అని చైనా అంటున్నా.. ట్రంప్ మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా తన సహజ శైలిలోనే కాలుదువ్వుతున్నారు. ఈ క్రమంలో చైనా తమ దేశంలోని అమెరికా సంస్థలపై జరిమానాలను పొడిగించడం, వారి వస్తువులకు కస్టమ్స్ క్లియరెన్స్‌లు సులభంగా ఇవ్వకపోవడం, ఆర్థిక, ఇతర రంగాల్లో లైసెన్సుల జారీలో జాప్యం వంటి చర్యలకు దిగుతున్నది. అమెరికా సైతం హువావీ తదితర చైనా టెక్నాలజీ సంస్థలపై తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తమ నిబంధనలు, షరతులకు లోబడి చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ట్రంప్ అంటున్నారు.

### ట్రంప్ దుందుడుకు వైఖరి

అమెరికా అధ్యక్షుడి హోదాలో ప్రపంచ దేశాల గౌరవాన్ని అందుకుంటున్న ట్రంప్.. ఆ స్థాయిలో మాత్రం ప్రవర్తించడం లేదు. వివిధ దేశాల అంతర్గత అంశాల్లో తలదూర్చి అబాసు పాలవుతున్నారు. ఫలితంగా అగ్రరాజ్య పరువు, ప్రతిష్ఠలు గంగలో కలుస్తున్నాయి. దీంతో అమెరికాకు ఉన్న పెద్దన్న విలువను తగ్గిస్తూ వస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. భారత్-పాకిస్తాన్ మధ్య కశ్మీర్ అంశంలో తలదూర్చి బొప్పి కట్టించుకున్న ట్రంప్.. ఇప్పుడు చైనా-హాంకాంగ్ అంశంపైనా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. వాణిజ్య చర్చల కంటే ముందు హాంకాంగ్ నిరసనల్ని పరిష్కరించాలని చైనాకు సూచించడం ఆ దేశానికి పుండు మీద కారం చల్లినట్లు అవుతున్నది. దీంతో మున్ముందు ఇంకేం సమస్యలు వస్తాయోనన్న భయం ఇప్పుడు అగ్రరాజ్యానికి పట్టుకున్నది.



గురువారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకొంటున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



గురువారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు తిరుపతి ప్రసాదం అందజేసి ఆశీర్వాదం తీసుకొంటున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

# ఊపందుకున్న వరినాట్లు



వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలంలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

- రాష్ట్రవ్యాప్తంగా 5,94,728 హెక్టార్లలో సాగు
- మరో వారంలో మరింత పెరిగే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వానకాలం సీజన్‌లో వరినాట్లు పుంజుకొంటున్నాయి. వారంరోజులుగా కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. దీంతో ఆయకట్టు ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేశారు. ఇప్పటివరకు మందకొడిగా సాగిన వరినాట్లు.. సాగునీరు విడుదల కావడంతో వేగవంతమయ్యాయి. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు సాగునీటిని విడుదల చేయడంతో నాలుగురోజులుగా ఈ ఆయకట్టు జిల్లాలైన నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డిలో వరినాట్లు ఊపందుకున్నాయి. జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టుల నుంచి కూడా నీరు విడుదలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో.. ఎల్‌ఎండీ, ఎంఎండీ, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వరి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. దేవాదుల, కాళేశ్వరం, ఎస్సారెస్పీ నీటి విడుదలతో వరంగల్, నిజామాబాద్ జిల్లాలో.. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టు నీటితో ఆదిలాబాద్‌లో, మూసీ నీటితో సూర్యాపేట జిల్లాలో వరినాట్లు ఊపందుకొన్నట్టు వ్యవసాయఅధికారులు తెలిపారు. తొలకరి వర్షాలు, బోర్ల కింద వరినార్లు పోసిన రైతులు.. కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంతో నాట్లువేసే పనిలో మునిగిపోయారు. వానకాలం సీజన్‌లో వరి సాధారణ సాగులక్ష్యం 9,64,548 హెక్టార్లుగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. గురువారం వరకు 5,94,728 హెక్టార్ల విస్తీర్ణంలో వరినాట్లు వేసినట్టు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. సాగునీటి విడుదల కొనసాగుతుండటంతో రానున్న వారంరోజుల్లో పూర్తిస్థాయిలో వరినాట్లు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

| జిల్లా | సాధారణ సాగు అంచనా (హెక్టార్లలో) | ప్రస్తుతం సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|
| రంగారెడ్డి | 13,615 | 5064 |
| మేడ్చల్ మల్కాజ్‌గిరి | 3,216 | 1677 |
| వికారాబాద్ | 10,959 | 6,178 |
| నిజామాబాద్ | 83,409 | 81,331 |
| కామారెడ్డి | 40,078 | 33,268 |
| మెదక్ | 34,895 | 29,250 |
| సంగారెడ్డి | 16,062 | 8,897 |
| సిద్దిపేట | 29,993 | 14,373 |
| మహబూబ్‌నగర్ | 14,793 | 3,648 |
| నాగర్‌కర్నూల్ | 11,089 | 6,845 |
| వనపర్తి | 29,326 | 16,041 |
| జోగుళాంబ గద్వాల | 16,749 | 2,982 |
| నారాయణపేట | 16228 | 7,560 |
| నల్లగొండ | 66,436 | 21,458 |
| సూర్యాపేట | 72,306 | 22,440 |
| యాదాద్రి భువనగిరి | 38,091 | 31,886 |
| వరంగల్ రూరల్ | 31,465 | 18,744 |
| వరంగల్ అర్బన్ | 12,502 | 10,751 |
| జయశంకర్ భూపాలపల్లి | 24,716 | 14,434 |
| జనగామ | 20,127 | 15,444 |
| మహబూబాబాద్ | 31,889 | 11,810 |
| ములుగు | 34,012 | 17,999 |
| ఖమ్మం | 59,361 | 18,323 |
| భద్రాద్రి కొత్తగూడెం | 43,334 | 20,843 |
| కరీంనగర్ | 41,118 | 33,126 |
| జగిత్యాల | 44,254 | 44,132 |
| పెద్దపల్లి | 44,230 | 32,471 |
| రాజన్న సిరిసిల్ల | 21,235 | 24,150 |
| ఆదిలాబాద్ | 924 | 111 |
| మంచిర్యాల | 27,483 | 21,832 |
| నిర్మల్ | 21,159 | 13,625 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 9,494 | 3,743 |

# పండుగపూట విషాదం

- జేసీబీ ఢీకొని కుమార్తె, తల్లిదండ్రులు మృతి
- రాఖీ కట్టి వెళ్తుండగా ప్రమాదం
- రంగారెడ్డి జిల్లా సుభాన్‌పూర్‌లో దారుణం

**బడంగ్‌పేట, నమస్తే తెలంగాణ/ మొయినాబాద్:** రాఖీ పండుగ ఆ కుటుంబానికి దుఃఖాన్ని మిగిల్చింది. అప్పటివరకు కనిపించిన ఆప్యాయత ఆవిరైపోయింది. రాఖీ కట్టి తిరిగి ఇంటికి వెళ్తుండగా జేసీబీ ఢీకొని భార్యాభర్త, ఓ కుమార్తె మృత్యువాతపడగా, మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం సుభాన్‌పూర్‌కు చెందిన పోచారం బాల్‌రెడ్డి (40)కి భార్య జ్యోతి (38), కూతురు శిరీష(11), కుమారుడు సాయిచరణ్ ఉన్నారు. బాల్‌రెడ్డి కొత్తూరులోని హెచ్‌బీఎల్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, జ్యోతి ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. శిరీష శంషాబాద్‌లో 7వ తరగతి చదువుతున్నది. వీరు పిల్లల చదువుల కోసం ఈ ఏడాది జూన్‌లో సుభాన్‌పూర్ నుంచి శంషాబాద్‌కు మకాం మార్చారు. జ్యోతి గురువారం చేవెళ్లలో ఉంటున్న సోదరుడు శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కట్టేందుకు శంషాబాద్ నుంచి భర్త పిల్లలతో కలిసి బైక్‌పై బయలుదేరారు. శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కట్టి తిరిగి వస్తుండగా, మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గేట్ సమీపంలో ఎదురుగా వచ్చిన జేసీబీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. జ్యోతి, బాల్‌రెడ్డి, శిరీష అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన సాయిచరణ్‌ను స్థానికులు శంషాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాతపడటంతో సుభాన్‌పూర్ శోకసంద్రంలో మునిగింది. కుమారుడు బాల్‌రెడ్డితోపాటు కోడలు, మనుమరాలు మృతిచెందడంతో రాజిరెడ్డి, లక్ష్మమ్మ దంపతుల రోదనలు మిన్నంటాయి.



మృతులు పోచారం బాల్‌రెడ్డి, భార్య జ్యోతి, కూతురు శిరీష (ఫైల్)

# విద్యార్థులను ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు
- పాఠశాలలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్తుండగా లంగర్‌హౌస్‌లో ఘటన

**మెహిదీపట్నం:** స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని ఇంటికి వెళ్లేక్రమంలో రోడ్డు దాటుతున్న ఇద్దరు విద్యార్థులను వేగంగా వచ్చిన ఓ బొలెరో కారు ఢీకొట్టింది. ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకున్నది. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గోల్కొండ రేతిగల్లీకి చెందిన ఖదీర్ పెద్ద కుమారుడు అజీజ్‌అయాన్ (14) నానల్‌నగర్‌లోని నలంద హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. హకీంపేట కు చెందిన సయ్యద్ జాస్మిన్ తో కలిసి గురువారం ఉదయం పాఠశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా మెహిదీపట్నం వైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన అజీజ్ అయాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సయ్యద్ జాస్మిన్ తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అజీజ్‌అయాన్(ఫైల్)

## చిన్నారిని చిదిమేసిన ట్రాలీఆటో

- ఇంటిముందు ఆడుకుంటున్న 13 నెలల బాలుడిని కబళించిన మృత్యువు

**ఘట్‌కేసర్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం యానంపేటలో పండుగపూట విషాదఛాయలు అలుముకొన్నాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని ట్రాలీఆటో ఢీ కొట్టడంతో మృతిచెందాడు. వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన కోరాడ శ్రావణ్‌కుమార్ కుమారుడు సుశ్వంత్ గురువారం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ బయటకువెళ్లగా ట్రాలీఆటో ఢీకొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకొన్నాడు. ఘట్‌కేసర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు ఏపీలోని శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం పురుషరాంపురం నుంచి ఉపాధి కోసం వలసవచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# వ్యాపారికి రూ.15 లక్షలు టోకరా

- హరితహారం మొక్కల కాంట్రాక్టు ఇప్పిస్తామని మోసం
- కాంగ్రెస్ నేత గజ్జెల కాంతంతోపాటు మరో ఇద్దరిపై కేసు

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** హరితహారం కోసం వినియోగించే మొక్కల సరఫరా కాంట్రాక్టు ఇప్పిస్తామని వ్యాపారిని మోసగించిన వ్యవహారంలో కాంగ్రెస్ నేత గజ్జెల కాంతంతోపాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. అత్తాపూర్‌లోని ఫణి 9 స్క్వేర్‌లో నివాసం ఉంటున్న కే విజయ్‌కుమార్ మొక్కల వ్యాపారి. వివిధ రకాల మొక్కలను ఎగుమతి చేయడంతోపాటు ఖరీదైన మొక్కలను విదేశాలనుంచి తెప్పించి విక్రయిస్తుంటారు. వ్యాపారాన్ని మరింత విస్తరించాలనే ఆలోచనలో ఉన్న విజయ్‌కుమార్‌కు 2016 ఆగస్టులో స్నేహితుడైన గోపికృష్ణ ద్వారా కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం, జీ వెంకటేశ్వర్లు అలియాస్ జీవీటీ అనే వ్యక్తులు పరిచయమయ్యారు. తమకు ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉందని, హరితహారంలో పెద్దఎత్తున మొక్కలు సరఫరాచేసే ఆర్డర్‌ను ఇప్పిస్తామని చెప్పి గత సెప్టెంబర్‌లో బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో విజయ్‌కుమార్ నుంచి రూ.15 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. ఒకవేళ కాంట్రాక్టు ఇవ్వకపోతే డబ్బులు తిరిగి ఇస్తామని రూ.15 లక్షలకు బ్లాంక్ చెక్కును ఇచ్చారు. నెలలు గడిచినా కాంట్రాక్టు ఇప్పించకపోగా కాలయాపన చేస్తుండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశారు. నిందితులపై ఐపీసీ 420, 406, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తుచేపట్టారు.













నమస్తే తెలంగాణ
# జిందగీ
WWW. NTNEWS.COM
శుక్రవారం 16 ఆగస్టు 2019
/nt.zindagi

గౌను మనది కాకపోయినా.. మనదైపోయింది! పాశ్చాత్య సంస్కృతి నుంచి అరువు తెచ్చుకొని..
దానికి మరిన్ని సొబగులద్ది మరీ హొయలు పోతున్నారు..
గర్వంగా గౌన్లు వేసుకొని.. ర్యాంప్‌లపైనే కాదు.. అన్ని అకేషన్లలోనూ సొగసుగా వాక్ చేస్తున్నారు..
ఆడంబరంగా కనిపించే ఆ గౌన్ల సోయగాలు మీకోసం..

## గులాబీబాలకు..
# సొగసైన గౌన్లు



రాజకుమారిలా మెరిసిపోయేందుకు ఈ గౌన్ వేయాల్సిందే! సిమెంట్ రంగు నెట్ ఫ్యాబ్రిక్‌తో ఈ లాంగ్ గౌన్ కుట్టాం. దీని మీద మొత్తం స్టోన్ వర్క్ చేయించాం. పైన ఆర్గంజా ఉపయోగించాం. దీని మీద మొత్తం సిల్వర్ పైప్స్, బీడ్స్‌తో హెవీగా వర్క్ చేశాం. కుచ్చుల్లా వచ్చిన స్లీవ్స్ దీనికి అదనపు ఆకర్షణ.

లైమ్ గ్రీన్ కలర్ గౌన్ ఇది. దీన్ని శాటిన్ క్లాత్‌తో కాస్త డిఫరెంట్‌గా కుట్టాం. ముందు వైపు మధ్యలో కుచ్చిళ్లు వచ్చేలా చేశాం. ఇక పైన మొత్తం బీట్స్, మెటసీన్ ఎంబ్రాయిడరీతో ఫుల్‌గా నింపేశాం. స్లీవ్‌లెస్‌గా ఇవ్వడంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నది.

ఎర్రని క్రేప్ మెటీరియల్‌ని లాంగ్ గౌన్‌గా డిజైన్ చేశాం. ఫుల్ కలీస్‌తో పాటు, గేర్ ఎక్కువ ఉండేలా ఈ డ్రెస్‌ని కుట్టాం. పైన మాత్రం నల్లని లేస్ నెట్ ఫ్యాబ్రిక్‌ని కేప్‌లా ఇచ్చాం. కేవలం నెక్, స్లీవ్స్ వరకే ఇవ్వడంతో సూపర్‌గా మ్యాచ్ అయింది. పార్టీల్లో ప్రత్యేకంగా కనపడేందుకు ఈ డ్రెస్‌ని వార్డ్‌రోబ్‌లో పెట్టేసుకోండి.


స్టైల్ లుక్ సొంతం చేసుకోవాలంటే ఇలాంటి డ్రెస్‌ని ఎంచుకోండి. ఎర్రని టఫెటా ప్రింట్ వచ్చిన క్రేప్ మెటీరియల్‌ని ఉపయోగించాం. దీనికి మధ్యలో జిప్ ఇచ్చాం. ఇక కింద భాగంలో ఎర్రని సిల్క్ మెటీరియల్‌ని అటాచ్ చేశాం. దాని పైన మళ్లీ నెట్ ఫ్యాబ్రిక్‌తో ఫ్రిల్స్‌ని కుట్టాం. ఒకవైపు ఇచ్చిన హెవీ టస్సెల్స్ డ్రెస్ లుక్‌నే మార్చేశాయి.

వన్‌పీస్ గౌన్‌లు చూడచక్కగా ఉంటాయి. అందుకే ఆ డిజైన్‌తో ఈ గౌన్‌ని కుట్టాం. బ్లాక్ కలర్ క్రేప్ సిల్క్‌ని లాంగ్ ఫ్రాక్ డిజైన్ చేశాం. దీనికి గ్రీన్ షేడ్ ఆర్గంజా మెటీరియల్‌ని బార్డర్‌గా, స్లీవ్స్ చివరన, బెల్ట్‌లా ప్యాచ్ వేశాం. బ్లాక్ ఆర్గంజాని కేప్‌లా డిజైన్ చేసి.. దాని మీద హెవీగా వర్క్ చేయించడంతో సూపర్‌గా మెరిసిపోతున్నది.

అర్చితా నారాయణం
బంజారాహిల్స్, హైదరాబాద్
archithanarayanam@gmail.com

## గుండెపోటును ఎలా నివారించాలి?


అడుగండి చెబుతా



**నా వయసు 24 సంవత్సరాలు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. నన్ను ఒక అనుమానం తీవ్రంగా కలచివేస్తున్నది. యేడాది కిందట మా నాన్న తీవ్ర గుండెపోటుతో చనిపోయారు. మా నానమ్మ కూడా ఇలాగే చనిపోయారు. ఒకే కారణంతో రెండు తరాల వారు మృతి చెందడంతో నాకు భయమేస్తున్నది. బీపీ.. షుగర్ మాదిరిగా గుండెపోటు కూడా వంశపారంపర్యంగా వస్తుందా? ఒకవేళ వస్తే ముందస్తుగా దానిని నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? దయచేసి తెలుపగలరు.**

**- డి. మాధురి,** సఫిల్‌గూడ

గుండెపోటుకు రకరకాల కారణాలు ఉంటాయి. అందులో ఒకటి వంశపారంపర్యం. జన్యుపర లోపాలు దీనికి కారణం. మీరు సరైన ఆరోగ్యకర జీవనశైలి ఏర్పరచుకుంటే మీ గుండెకు సంపూర్ణ రక్షణ ఇవ్వవచ్చు. సాధారణంగా గుండెకు రక్తసరఫరా నిలిచిపోయినప్పుడు రక్తపోటుతో గుండెపోటు వస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ వంటివి పేరుకుపోయి రక్త సరఫరా మార్గం క్రమేపీ మూసుకుపోతుంది. దీనివల్ల రక్త సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. శరీరానికి ఆక్సీజన్‌తో కూడిన రక్తాన్ని అందించడంలో గుండె విఫలమవుతుంది. రక్తంలో ఎల్‌డీఎల్, హైబ్లడ్ ప్రెజర్, రక్తంలో పరిమితికి మించిన చక్కెర శాతం లాంటి హానికరమైన కొవ్వు పదార్థాలు చేరడంతో గుండెపోటు వస్తుంది. కూర్చున్న చోటు నుంచి కదలని ఉద్యోగాలు, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం, ధూమపానం, మద్యపానం, జంక్‌ఫుడ్స్, మానసిక ఒత్తిడి లాంటి వాటివల్ల రక్తనాళాలు మూసుకుపోయి గుండెకు హాని కలుగుతుంది. కాబట్టి మీరు అనుమానం నుంచి బయటకు రండి. ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పరచుకోండి. ఎలాంటి ఇబ్బందులూ రావు.



**డాక్టర్ నరసరాజు
సీనియర్
ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్**
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ

## ఆటో అక్క ఆదర్శం

**రాత్రి వేళ్లల్లో మహిళలు బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతుంటారు. అటువంటి వారిలో ధైర్యాన్ని నింపుతూ అర్ధరాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలను గమ్యస్థానాలకు చేరుస్తున్నది ఓ మహిళా డ్రైవర్. పిల్లలకు, వృద్ధులకు ఉచిత సేవలందిస్తూ ఔదార్యాన్ని చాటుకుంటున్నది.**



కేరళలోని పలక్కడ్ ప్రాంతానికి చెందిన రాజీ అనే మహిళ డిగ్రీ వరకూ చదివింది. కొన్నాళ్లకు అశోక్ అనే వ్యక్తిని ప్రేమించి పెండ్లి చేసుకున్నది. పెండ్లైన తర్వాత చెన్నైకి మకాం మార్చింది. ఇల్లు గడవడానికి రాజీ ఓ ట్రావెల్ కంపెనీలో అకౌంటెంట్‌గా చేరింది. ఆమె భర్త ఆటో డ్రైవర్. చాలీచాలని జీతంతో విసిగిపోయిన రాజీ అతని దగ్గర ఆటోడ్రైవింగ్ నేర్చుకున్నది. ఆటోడ్రైవర్‌గా పనిచేయడం మొదలు పెట్టింది. రోజుకు 9 గంటలపాటు ఆటో నడుపుతూ నెలకు రూ. 40 వేల వరకూ సంపాదిస్తున్నది. ఆమె సంపాదనలో కొంత మొత్తాన్ని మహిళల్లో ధైర్యాన్ని నింపేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నది. చెన్నైలోని అనేక మహిళా కళాశాలలకు వెళ్లి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నది. రాత్రి వేళల్లో కార్యాలయాలకు వెళ్లొచ్చే మహిళలను, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి అండగా నిలుస్తుండడంతో అక్కడి వారంతా రాజీని 'ఆటో అక్క'గా పిలుచుకుంటున్నారు. వృద్ధులు, పిల్లలకు ఉచిత సేవలందిస్తూ ఔదార్యాన్ని చాటుకుంటున్నది. రాత్రి సమయాల్లో డ్రైవింగ్ చేయాలంటే రాజీకి మొదట్లో భయం వేసేది. అయినా ధైర్యంతో ముందడుగు వేసింది. కొన్నాళ్లకు అన్నిరకాల సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా డ్రైవింగ్ చేస్తున్నది. 20 యేండ్ల నుంచి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నా ఏ రోజు ప్రమాదం జరుగకుండా నడపడం విశేషం. మహిళాలోకాన్ని చైతన్యపరుస్తున్న ఆటో అక్క రాజీని అందరూ ఆదర్శంగా తీసుకుంటున్నారు. తమిళనాడు సర్కారు ఆమె సేవలను గుర్తించి ఉత్తమ మహిళా డ్రైవర్‌గా అవార్డు కూడా అందించింది.

### వంటింటి చిట్కాలు

- రవ్వదోశలు వేసిన తర్వాత పైన క్యారెట్ తురుము, కొబ్బరి తురుము, సన్నగా తురిమిన అల్లం, పచ్చి మిరపకాయ ముక్కలు చల్లితే రవ్వ దోశలు రుచిగా ఉంటాయి.
- మెంతికూర వండేటప్పుడు కాసింత బెల్లం చేర్చుకుంటే అందులోని చేదు తొలిగి తీపి రుచి చేకూరుతుంది.
- అరటికాయలు తరిగేటప్పుడు చేతులకు కాస్త సాల్ట్ ఉప్పును రుద్దితే చేతులు నలుపు రంగుకు మారవు.
- బజ్జీలు చేసుకునేందుకు కట్ చేసిన అరటి, ఆలూ ముక్కలకు కారం, ఉప్పు చేర్చి 30 నిమిషాల పాటు పక్కనబెట్టాలి. తర్వాత నూనెలో బజ్జీలు తయారు చేసుకుంటే టేస్టీగా ఉంటాయి.



## చర్మసౌందర్యానికి కరివేపాకు



**కరివేపాకు కూరలకు అదనపు రుచినిస్తుంది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదే విధంగా చర్మ సౌందర్యానికి కూడా కరివేపాకు ఎంతో మేలు చేస్తుంది. ఇంటిముక్కగా లభించే కరివేపాకులో చర్మం మెరిసేందుకు ఎన్నో అద్భుత గుణాలున్నాయి.**

- ముందుగా కరివేపాకును శుభ్రంగా కడిగి మెత్తగా రుబ్బుకోవాలి. ఒక స్పూను కరివేపాకు ముద్దలో కొద్దిగా పసుపు కలిపి మోచేతులకు రాసుకొని పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు మూడు సార్లు చేస్తే మోచేతుల దగ్గర నలుపు పోతుంది.
- ఒక స్పూన్ కరివేపాకు ముద్దలో ఒక స్పూన్ తులసి ఆకుల పొడి, కొద్దిగా పుదీనా ఆకుల పొడి, రెండు టీ స్పూన్ల రోజ్ వాటర్ వేసి బాగా కలిపి చేతులకు, కాళ్లకు రాసుకుంటే చర్మం మృదువుగా అవుతుంది. ఇలా వారం రోజులు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- వేడి నీళ్లలో కరివేపాకులు వేసి పావుగంట తర్వాత ఆకుల్ని తీసేసి అందులో చల్లని నీళ్లు కలుపుకొని వాటితో ముఖాన్ని కడుక్కోవాలి. వర్షాకాలంలో ఇలా చేస్తే మంచిది. తరచూ ఇలా చేయడం వల్ల మొటిమల సమస్య కూడా తగ్గుతుంది.
- కరివేపాకులో కార్బొహైడ్రేట్లు, ఫైబర్, క్యాల్షియం, ఫాస్ఫరస్, ఇనుము, మెగ్నీషియం ఉంటాయి. దీంతో డయేరియాను దూరం చేయొచ్చు. బరువును తగ్గించేందుకు, జుట్టు పెరిగేందుకు, కంటికి మేలు చేస్తాయి.
- మందార, ఉసిరికాయలు, గోరింట, గుంటకలగర ఆకులరసంతోపాటు కరివేపాకు రసం కూడా సమపాళ్లలో కలిపి కాచి, కొబ్బరి నూనెతో కలిపి ఎండబెట్టి 'తలనూనె'లా రాసుకుంటే జుట్టు బలపడుతుంది. తలపోటు పోవడంతో పాటు జుట్టు సహజంగా నల్లబడుతుంది.

## ఇంటి గోడలు ఇలా శుభ్రం

**ఇంట్లో పిల్లలు ఉంటే గోడలు ఏ తీరులో ఉంటాయో చెప్పనక్కర్లేదు. దీంతోపాటు గాలి ద్వారా వ్యాపించే దుమ్ము, ధూళి గోడలపై చేరుతుంది. ఈ చిట్కాలు పాటిస్తే గోడలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు.**



పొడి బట్టతో గోడలపై ఉన్న బూజు, దుమ్ము, ధూళిని పూర్తిగా శుభ్రపరుచాలి. బట్టతో శుభ్రం చేసినప్పుడు గోడలకు తగిలించిన వస్తువులు, క్యాలెండర్లను తీయనవసరం లేదు. ఎక్కువ మరకలు ఉన్న ప్రదేశంలో గట్టిగా తుడిచి శుభ్రపరుచాలి.

పిల్లల జీవితాలు రంగులతో కూడిన హరివిల్లులా చాలా అందంగా ఉంటాయి. వారి జీవితాల్లో అదే అనుకూలతను కలిగి ఉండేటట్లు చూసుకోవాలి. మీ ఇంటి గోడలు వారికి కాన్వాస్ కాకూడదు. గోడలపై రాయకూడదని చెప్పడం ద్వారా గోడలు శుభ్రంగా ఉంటాయి.

వంటగది, స్నానపు గదిలో ఉన్న గోడలు ఎక్కువగా పాడవడానికి ఆస్కారముందని గుర్తుంచుకోవాలి. వంటలు వండేటప్పుడు నూనె, గ్రీజు మరకలు ఎక్కువగా పేరుకుపోతాయి. వంటగది, బాత్రూం గోడలు శుభ్రం చేసిన తర్వాత పాత బట్టతో గోడలను తుడువాలి.

బొరాక్స్ పౌడర్, డిష్ వాష్ లిక్విడ్‌ను సామానంగా జోడించి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని డిజైన్లు కలిగిన గోడలను శుభ్రం చేయడానికి వాడుతారు. ఈ మిశ్రమం మార్కెట్లో కూడా అందుబాటులో ఉంటుంది.

గోడలపై చిన్న రంధ్రాలు ఉంటే అవి మరింత పెద్దవిగా అయ్యే అవకాశం ఉంది. ఆ ప్రదేశంలో ఉన్న పెయింటింగ్‌ను నిర్మూలించి రంధ్రాలను పూడ్చాలి. ఆ ప్రాంతం చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా సరిపోయే పెయింటింగ్ వేయాలి.

చాలామంది ఇళ్లలో ఉపయోగించే వాల్ పెయింటింగ్‌లు నీటితో కడుక్కుని శుభ్రం చేసుకునే విధంగా ఉండాలి. అయినా జాగ్రత్తగా శుభ్రపరుచుకోవాలి.

నమస్తే తెలంగాణ
# శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 16 ఆగస్టు 2019

## తుప్పునుండి విద్యుదుత్పత్తి!

పదార్థశాస్త్రం

**తుప్పపొరల మీదుగా ఉప్పనీటిని ప్రవహింపజేయడం వల్ల విద్యుదుత్పత్తికి అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. దీనికి అనుగుణమైన సాంకేతిక విధానాన్ని ఇటీవల వారు అభివృద్ధి పరిచారు.**



అందుబాటులో ఉన్న సౌరఫలకల పద్ధతిలోకంటే కూడా ఈ సాంకేతికత ద్వారా అధిక విద్యుత్తును తయారుచేయవచ్చునని వారంటున్నారు. క్యాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాల్‌టెక్), నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ (అమెరికా)కి చెందిన పరిశోధకులు అభివృద్ధి పరిచిన ఈ సాంకేతికతను 'ఫిజికల్ వేపర్ డిపోజిషన్' (పీవీడీ) విధానంగా పిలుస్తున్నారు. ఇందులో ప్రధానంగా తుప్పు పదార్థం (Iron oxide) మీదుగా ఉప్పునీటిని ప్రవహింపజేస్తారు. ఫలితంగా జరిగే రసాయనిక చర్యతో విద్యుచ్ఛక్తి ఉత్పత్తవుతుందని వారు పేర్కొన్నారు. ఐరన్ ఆక్సైడ్‌తోనే కాకుండా, గ్రఫేన్‌పైనా ఉప్పునీటిని ప్రవహింపజేసినా విద్యుదుత్పత్తి సాధ్యమేనని, కాకపోతే ఇది ఒకింత కష్టమని వారు తెలిపారు. మామూలు నీటివల్ల ఇనుము తుప్పు పట్టిపోతే, ఆ పాడైన పదార్థాన్ని ఉప్పునీటితో కలపడం ద్వారా తిరిగి విద్యుత్ రూపంలో వినియోగంలోకి తేగలగడం విశేషమే. 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' ఆన్‌లైన్ జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది.

## 12 గంటల్లో 35 కోట్ల మొక్కలు!

పర్యావరణం

**తూర్పు ఆఫ్రికాకు చెందిన ఇథియోపియా దేశంలో అనూహ్యంగా కేవలం 12 గంటల్లోనే 350 మిలియన్ (35 కోట్లు) మొక్కలను నాటినట్లు అక్కడ్నించి అధికారిక సమాచారం వెలువడింది.**

ఆ దేశ ప్రధానమంత్రి అబి అహ్మద్ (Abiy Ahmed Ali) ప్రవేశపెట్టిన 'గ్రీన్ లెగసీ ఇనీషియేటివ్' కార్యక్రమంలో భాగంగా ఇటీవల (జూలై చివరన) ఈ అరుదైన రికార్డును సాధించారు. ప్రభుత్వోద్యోగులు సైతం కార్యాలయాలను మూసేసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆయన ఇచ్చిన పిలుపు బ్రహ్మాండంగా పనిచేసినట్టు చెబుతున్నారు. అక్కడ సుమారు 35 శాతం మేర వున్న అడవుల విస్తీర్ణం 2000 సంవత్సరం కల్లా 4 శాతానికి పెద్ద ఎత్తున పడిపోయిన క్రమంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో విస్తృతరీతిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకరోజు



24 గంటల్లో 1,000 ప్రదేశాలలో 20 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయిస్తే, దీనిని అధిగమిస్తూ కేవలం 12 గంటల్లోనే 35 కోట్ల మొక్కలు నాటినట్లు అధికారులు ప్రకటించారు. అయితే, ఒకే రోజులో 50 మిలియన్ (5 కోట్లు) మొక్కలు నాటిన ప్రపంచ రికార్డును మన భారతదేశం 2016లో సాధించగా, దీనిని ఇప్పుడు ఇథియోపియా అధిగమించింది.

# ద్విలింగ చేపల రహస్యం!

**ఆడ, మగ.. ఏదైనా పుట్టినప్పుడు జరిగిన లింగ నిర్ధారణలో ఇక మార్పులుండవన్న నియమం ఒక్క మనుషులకే వర్తిస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. అనేక జీవజాతుల్లో ఉభయలింగ జీవులు (Hermaphrodites) సహజమే. ఏకకాలంలో రెండు (స్త్రీ-పురుష) రకాల పునరుత్పాదక అవయవాలను ఇవి కలిగి ఉంటాయి. ఇదే సమయంలో 'ఏదనుకొంటే దానికి మారే' అనూహ్య సౌలభ్యాన్ని కలిగి ఉన్న ద్విలింగ జీవులూ (Sequential hermaphroditism) సృష్టిలో అనేకం ఉన్నట్టు వారు చెబుతున్నారు. మరి, వీటిలో ఈ 'లింగమార్పిడి' ఎప్పుడు, ఎందుకు, ఎలా సంభవమవుతున్నది? అన్నది పెద్ద మిస్టరీ. దీనినే కొందరు పరిశోధకులు తాజాగా ఛేదించారు.**



జీవశాస్త్రం

**స్విచ్ వేసి,** బంద్ చేసినంత తేలిగ్గా ప్రత్యేకించి కొన్ని రకాల ద్విలింగజాతి చేపలలో 'లింగమార్పిడి ప్రక్రియ' జరిగిపోతున్నవైనం అత్యంత ఆశ్చర్యకరం. ఆడచేపలు మగచేపలుగా, మగచేపలు ఆడచేపలుగా, మళ్లీ కావాలనుకుంటే పూర్వస్థితికి అవి మారిపోతున్న అద్భుత జీవకణజాల- జన్యుమార్పులు శాస్త్రవేత్తలను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. దీనినే శాస్త్రవేత్తలు ఇటీవల ప్రయోగాత్మకంగా బట్టబయలు చేశారు. సృష్టిలో ద్విలింగ (ఉభయచరాల వలె) జీవుల (ప్రత్యేకించి చేపలు) వ్యవస్థ ఎంత సర్వసాధారణమో ఇది రుజువు చేస్తున్నది.


లింగభేదం మానవులలో ఉన్నంత స్పష్టంగా, విస్తృతంగా ప్రత్యేకించి చేపలలో లేదనడానికి ఇంతకంటే వేరే నిదర్శనం అక్కర్లేదు. మానవ శరీరావయవాల వ్యవస్థలకు, ఇతరేతర జీవజాతుల దేహధర్మాలకూ చాలా తేడాలు ఉంటాయనడంలో సందేహం లేదు. పలు జీవజాతుల శరీర నిర్మాణాలకు సంబంధించి ఇటీవలి కాలంలో జరుగుతున్న పరిశోధనల్లో అత్యంత ఆసక్తికరమైన ఫలితాలే వెల్లడవుతున్నాయి. మనకంటే ఎంతో చిన్నజీవులైన వాటి శరీరావయవాల భౌతిక నిర్మాణాల ముందు మనిషి ఎంత అల్పజీవియో దీనినిబట్టి అర్థమవుతున్నది. వాటన్నింటినీ మించిన స్థాయిలో మనకే పరిమితమైన ఒకే ఒక్క గొప్ప భౌతిక బలం మన మెదడు. ఇదే మానవజాతికి బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడుతున్నది. మహాసముద్రాలు (అట్లాంటిక్, హిందూ, పసిఫిక్ వంటివి), ప్రత్యేకించి ఉష్ణమండల, ఉపోష్ణమండల సాగరజలాల్లోనే ప్రధానంగా కనిపించే వ్రాస్సే (wrasse) చేపలలో పైన పేర్కొన్నట్టు సహజసిద్ధమైన పద్ధతిలో లింగమార్పిడి ప్రక్రియ జరుగుతున్న తీరును శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా కనిపెట్టారు. ఇవే కాదు, అనేక రకాల మత్స్యజాతులలో 'లింగ పరివర్తన' అన్నది వాటి జీవన విధానంలో అత్యంత సహజసిద్ధ కార్యమని వారంటున్నారు. అయితే, పై జాతి చేపల్లో ఇది ఎలా సంభవమవుతున్నదన్న దానిని మాత్రం వారు మొట్టమొదటిసారిగా కనిపెట్టారు. నీలితలతో కూడిన 'వ్రాస్సే' జాతి చిన్న చేపలలో దీనిని ఇటీవల వారు పరిశోధనాత్మకంగా గుర్తించారు.

ఫ్లోరిడా (అమెరికా రాష్ట్రం)లోని కీ లార్గో (Key Largo) కు చెందిన సాగరదిబ్బ (Reefs) ల్లో న్యూజీలాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఒటాగో (University of Otago) పరిశోధకులు అంతర్జాతీయ శాస్త్రవేత్తల సహకారంతో పై పరిశోధన నిర్వహించారు. అక్కడి చేపల సమూహాల్లోంచి కొన్ని మగచేపలను ఏరిమరీ తొలగించి వేశారు. దీంతో ఆయా జలప్రదేశాలలో ఆడచేపలే చాలావరకు మిగిలాయి. అప్పుడు వాటికి మగచేపల అవసరం ఏర్పడక తప్పదన్నది వారి ఆలోచన. అనుకొన్నట్లుగానే కొన్ని ఆడచేపలే మగచేపలుగా పరివర్తన చెందడం కొద్దిరోజుల్లోనే మొదలైంది. రోజురోజుకూ అక్కడి ఆడచేపలలో వస్తున్న మార్పులను శాస్త్రవేత్తలు గమనిస్తూ పోగా, కొన్నాళ్లలోనే ఆసక్తికరమైన పరిణామాలను వారు చూశారు. వాటి శరీరధర్మాలలో పూర్తి వ్యతిరేక మార్పులు వచ్చేశాయి. ఆడచేపల బీజకోశంలోని అండోత్పత్తి కణజాలాలు ముడుచుకొని పోయి, వాటి స్థానాల్లోకి వీర్యోత్పత్తి కణజాలాలు ఉద్భవించడాన్ని వారు స్పష్టంగా గుర్తించారు.

కేవలం 8 నుంచి 10 రోజుల్లోనే ప్రౌఢ అండాశయాలు (mature ovaries) కాస్తా వృషణాలు (testes) గా పరివర్తన చెందడాన్ని పై పరిశోధకులు కండ్లారా చూశారు. ఇక, ఆ మగచేపలు తోటి ఆడచేపలతో జతకూడి సంతానోత్పత్తికి కావలసిన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించగల స్థితి (sire offspring) కి వచ్చేశాయి. 20 రోజుల తర్వాత ఆ పరివర్తిత మగచేపలు పూర్తి స్థాయిలో దేహవర్ణాన్ని కూడా సంతరించుకొన్నట్టు పై శాస్త్రవేత్తల బృందం నాయకురాలు ఎరికా టోడ్ (Erica Todd) వెల్లడించారు. ఈ జాతి ఆడచేపలు పసుపు, గోధుమ వర్ణాల్లో ఉంటే, మగచేపలు నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉంటాయి. ఈ చేపల రంగుల ప్రపంచం అత్యంతాసక్తికరమైందిగా పేరు పడింది కూడా.

సుమారు 500 రకాల జాతుల చేపలలో ఇలా సహజసిద్ధమైన లింగమార్పిడి జరుగుతున్నట్టు జీవశాస్త్రవేత్తలు ఇదివరకే గుర్తించారు. అయితే, 2017లో 'బ్లూ ప్లానెట్-2' పేరున 'బిబిసి నేచురల్ హిస్టరీ యూనిట్' ఆధ్వర్యంలో సాగరగర్భ జీవులపై డేవిడ్ అటెన్‌బరో (David Attenborough) రూపొందించిన ఒక డాక్యుమెంటరీతో 'ఏసియన్ షీప్‌హెడ్ వ్రాస్సే' జాతి చేపల లింగమార్పిడి వ్యవహారం ప్రముఖంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఎరికా టోడ్ బృందం వారు పై పరిశోధనలు నిర్వహించారు. మగచేపల కొరతతో సదరు ఆడచేపలు ఆగ్రహానికి వచ్చినట్లు కనిపించిందని, ఫలితంగా వాటిలోనే 'లింగ మార్పు' సంభవమైనట్టు వారు పేర్కొన్నారు.

### అవి మగవిగా మారితే ఇక అంతే!



ఆడచేపలు మగచేపలుగా మారడం సర్వసాధారణమే అయినా, క్లౌన్ ఫిష్ (clownfish) జాతి చేపల్లో మాత్రం మగచేపలు ఆడచేపలుగా మారిపోతాయని తెలుస్తున్నది. దక్షిణాది జపాన్ పరిసర సాగరజలాల్లో కనిపించే హ్యాక్‌ఫిష్‌లలో అయితే మరింత ఆసక్తికరంగా ఆడచేపలు మగవిగా మారడమే కాక, అలా మారిన మగచేపలు మళ్లీ అవసరాన్నిబట్టి ఆడచేపలుగా యథాస్థితికి సైతం రాగలవని శాస్త్రవేత్తలు అంటున్నారు. ష్రింప్ (shrimp) జాతి జలచరాలలో ఇలా యథాపూర్వ స్థితి సంభవం కాదని వారు అంటున్నారు. వీటిలోని ఆడజీవులు మగవిగా మారితే ఇక అంతే! అవి అలా ఉభయలింగ జీవుల్లా ఉండిపోవాల్సిందే. అంటే, ఏకకాలంలో ద్వి(స్త్రీ పురుష) లింగావయవాలను అవి కలిగి ఉంటాయి.

**దోర్బల బాలశేఖరశర్మ**

ఎవరేమన్నారు?



నిజాయితీగా చెబుతున్నాను, నాకే ఆశ్చర్యమేస్తుంది కూడా.. చంద్రునిపైకి వెళ్లాలని నేను కల కనలేదు.

**-నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్**

అమెరికన్ వ్యోమగామి, ఏరోనాటికల్ ఇంజినీర్, చంద్రునిపై నడయాడిన తొలి మానవుడు

* జయంతి: ఆగస్టు 5, జీవితకాలం: 1930-2012

ప్రకృతి పాఠం

## అగ్గి పురుగుల ఆకర్షణ శక్తి

మన కంటికి కనిపించనంత దూరంలో చెలరేగే మంటల్ని అద్భుతమైన తమ ఇంద్రియ శక్తిద్వారా గుర్తుపట్టే 'అగ్గివేట పురుగులు' ఇప్పుడు శాస్త్రవేత్తల పరిశోధనలకు సరికొత్త స్ఫూర్తినిస్తున్నాయి. ఫలితంగా రాబోయే అగ్ని ప్రమాదాలను ముందే పసిగట్టే అవకాశం లభిస్తుందని వారంటున్నారు.



చల్లని కాంతిని విరజిమ్మే మిణుగురు పురుగుల (Firefly) గురించి తెలిసినంతగా మనకు కాంతివాసనను పట్టేసి అగ్గివేట కీటకాల (fire-chaser beetles) ఆకర్షణ శక్తి అంతగా తెలియదు. అడవుల్లో చెలరేగే మంటల్ని వాతావరణంలో వ్యాపించే పొగలు, పరారుణ కాంతి వికిరణ (Infrared radiation) ప్రభావం ద్వారా ఈ పురుగులు పసిగడుతున్న సంగతిని 1960లలోనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. 'మెలనోఫిలా' (Melanophila) తరగతికి చెందిన ఈ అగ్గివేట కీటకాలపై జరిపిన లోతైన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. అడవులు తగులబడుతున్న (కార్చిచ్చు) ప్రదేశంలో ఈ పురుగుల లార్వాకు ఆహారం పుష్కలంగా దొరుకుతున్నట్టు వారు గుర్తించారు.

ఈ పురుగుల రెండు కాళ్లకింద ఉష్ణవాసనను పసిగట్టే గ్రాహకాలు (సెన్సర్లు) ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇవి కొన్ని వెంట్రుకల మందంతో, 70కి పైగా సంఖ్యలో, డోమ్ ఆకారంలో ఉంటాయి. కొన్ని కీటకాల కండ్ల మాదిరిగానే ఈ సెన్సర్లు ఉంటాయని, మంటలతోపాటు వేడి వస్తువుల నుండి వెలువడే పరారుణ కిరణాలను వీటి ఆధారంగానే అవి గుర్తిస్తాయని వారు తెలిపారు. సూక్ష్మమైన ఈ సెన్సర్లు ఒక విధమైన ద్రవంతో నిండి ఉండి, పరారుణ కాంతిని



శోషించుకొనే శక్తిని కలిగి ఉంటున్నట్టు వారు కనుగొన్నారు. ఈ రకంగా వాటికి అంతటి శక్తి సమకూరుతున్నది.

'మెర్రిమాన్' (merriman) తరగతికి చెందిన అగ్గివేట పురుగు ఆధారంగా యూనివర్సిటీ ఆఫ్ బోన్న్ పరిశోధకులు 'మైక్రోబోలోమీటర్' (microbolometer: సూక్ష్మవిద్యుదయస్కాంత వికిరణ శక్తిని కొలిచే పరికరం)ను రూపొందించారు. పై పురుగుల వలె దీనిలోనూ కృత్రిమ 'థర్మోసెన్సర్ల'ను వారు ఏర్పరిచారు. దీనిని మరింతగా అభివృద్ధి పరచడం ద్వారా కార్చిచ్చుల వంటి విపత్తుల నివారణ సాధ్యపడగలదని వారు అంటున్నారు.

**-డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి**

# ప్రజల కోసమే సైన్సు

శాస్త్రీయం



సారాభాయ్

'అభివృద్ధి చెందుతున్న (ఇంకా ఇప్పటికీ) భారత్ వంటి దేశానికి సైన్సు, అంతరిక్ష పరిశోధనల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం అవసరమా?' అన్న విమర్శనాత్మక ప్రశ్నకు ఏడు దశాబ్దాల కిందటే ఆనాటి యోధులైన కీలక నాయకులు, శాస్త్రవేత్తల నుంచి అత్యంత సమర్థవంతమైన జవాబే లభించింది. కాకపోతే అది తదుపరి, ప్రస్తుత తరాలు అందిపుచ్చుకున్నట్టు లేదు.

భారత అంతరిక్ష యుగానికి ఆద్యుడు, రోదసీ కార్యక్రమ పితామహుడు (Father of Space Programme), ఖగోళ భౌతిక శాస్త్రవేత్త అయిన విక్రమ్ అంబాలాల్ సారాభాయ్ (జీవితకాలం: 1963-71) శతజయంతి సంవత్సరం (1919-2019) సందర్భంగా ఆయనతోపాటు ప్రసిద్ధ అణుభౌతిక శాస్త్రవేత్త డా॥ హోమీ జహంగీర్ భాబా (జీవితకాలం: 1909-1966), నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ త్రయం కలిసి పంచుకొన్న 'ఏకాభిప్రాయం' పై ప్రశ్నకు సరిగ్గా సమాధానమిస్తుంది. 'మన దేశంలోని ఆకలి, పేదరికం, అపరిశుభ్రత, నిరక్షరాసత్య వంటి సమస్యలన్నింటికీ సైన్సు మాత్రమే పరిష్కారం చూపగలదు' అన్నది వారి దృఢ విశ్వాసం. పండిట్ నెహ్రూ దీనినే స్వయంగా ఒకానొక సందర్భంలో వెల్లడించారు కూడా.

అంతేకాదు, భారతదేశంలో ప్రాచీనకాలం నుంచీ కొనసాగుతున్న మూఢ విశ్వాసాలు, కాలం చెల్లిన ఆచార-సంప్రదాయాల నిర్మూలనకూ విజ్ఞానశాస్త్ర ప్రగతే ఏకైక పరిష్కారమని పై ముగ్గురితోపాటు పలువురు ఆనాటి ప్రసిద్ధ నాయకులు, శాస్త్రవేత్తలూ అభిప్రాయ పడేవారు. 'సుసంపన్నమైన మన భారతదేశంలో అపార వనరులెన్నో ఉన్నాయి. అయినప్పటికీ వాటిలో అనేకం సద్వినియోగానికి నోచుకోక వ్యర్థమవుతున్నాయి. మరోవైపు దేశ ప్రజలు క్షుద్బాధతో అలమటించే పరిస్థితి. దీనికంతటికీ ఒకే ఒక్క పరిష్కారంగా 'సైన్సును అభివృద్ధి పరచుకోవడమే' అని వారంతా నమ్మేవారు.

భారత అంతరిక్ష యుగావిర్భావం నుంచి ప్రస్తుత 'ఇస్రో'వంటి పలు సంస్థల ఆధ్వర్యంలో విజయవంతంగా సాగుతున్న పరిశోధనల వరకు సారాభాయ్ సల్పిన కృషి వెలకట్టలేనిది. హోమీ భాబా (మరణం: 1966) లేని లోటును ఆయన ఒకింత తీర్చినా మరో అయిదేళ్లలోనే భాయ్‌కూడా (మరణం: 1971) అర్థాంతరంగానే తనువు చాలించడం పెద్ద విషాదం. రాజకీయ రంగంలోనే కాకుండా, శాస్త్ర సాంకేతిక రంగాలలోనూ నాటి స్వాతంత్ర్య కాలం నాటి యోధానుయోధులు పలువురిని ఇలా దేశం అనుకోకుండా కోల్పోవడం ప్రజల దురదృష్టమే. అటువంటి వారంతా మరికొన్నేండ్లు జీవించి వుంటే వివిధ రంగాలలో అభివృద్ధి వేగం పెరిగేదే. అయినప్పటికీ వారు వేసిన పునాది, ఇచ్చిన స్ఫూర్తి, అందించిన మార్గదర్శకత్వాల పైనే నేటికీ దేశం ప్రగతిపథంలో దూసుకెళుతున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. సైన్సు, టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధనలన్నీ చివరాఖరకు సామాన్య ప్రజానీకానికి మెరుగైన జీవితాన్ని అందించడం కోసమేనని విక్రమ్ సారాభాయ్ ఎప్పుడూ చెప్పేవారు. విజ్ఞాన శాస్త్రం, సాంకేతికతలను ప్రజలు అర్థం చేసుకొని, ఆచరణలోకి తెచ్చుకోవాలని, దీనితోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉంటుందని ఆయన అనేవారు.

ఆహారశాస్త్రం

## తిరుగులేని పోషకం కొవ్వు




మన ఆహారంలో మనకు శక్తినిచ్చే ప్రబలమైన పోషక పదార్థం కొవ్వు (Fat). నిత్య జీవితంలో మనం తీసుకొనే ఆహారంలో దీనిది చాలా ముఖ్యమైన పాత్ర. శరీర పోషణ, ఆరోగ్య రక్షణల్లో కొవ్వు పదార్థాలది కీలక భాగస్వామ్యం. మనిషి భౌతిక మనుగడకు వీటి అవసరం తప్పనిసరి. వెన్న, నెయ్యి, చమురు వంటి వాటిలో కొవ్వు పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి. వీటితోసహా పాలు, విత్తులు, మాంసం వంటి ఆహార పదార్థాల్లోనూ ఎంతో కొంత మొత్తంలో కొవ్వు ఉంటుంది. కొవ్వువల్ల మనకేంటి లాభం? ఇది నిర్వర్తించే విధి ఏమిటి? ఏఏ తినుబండారాలు, పదార్థాలలో కొవ్వు పదార్థాలు లభ్యమవుతాయి? ఇవి 'తక్కువ-ఎక్కువ' అయితే ఏమిటి నష్టం? ఇవన్నీ ప్రతి ఒక్కరూ విధిగా తెలుసుకోదగ్గవి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

### యంగ్ ప్రొఫెషనల్స్

**నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 30
- **పోస్టు:** యంగ్ ప్రొఫెషనల్ (లీగల్)
- **అర్హత:** లా డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 32 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 60,000/-
- **ఎంపిక:** క్లాట్ -2018 స్కోర్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.nhai.org





### పీడీఐఎల్‌లో ఇంజినీర్లు

**ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్ (పీడీఐఎల్) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పనిచేసే ప్రదేశాలు:** హెడ్ ఆఫీస్ నోయిడా, కోల్‌కతా, చెన్నై, ముంబై, హైదరాబాద్, రీజినల్ ఆఫీస్ వడోదర
- **మొత్తం ఖాళీలు:** 391
- డిప్లొమా హోల్డర్స్-50 ఖాళీలు
- డిగ్రీ హోల్డర్స్-341 ఖాళీలు
- **అర్హత:** సంబంధిత బ్రాంచీల్లో ఐటీఐ, మూడేండ్ల డిప్లొమా లేదా బీఈ/బీటెక్, సీఏ, ఐసీడబ్ల్యూ, ఎంబీఏ (ఫైనాన్స్,పీఎం & ఐఆర్ ), ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), పీజీ లేదా రెండేండ్ల పీజీ డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.pdilin.com

### సీడీఆర్ఐలో సైంటిస్టులు

**సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సైంటిస్టు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం పోస్టులు-18
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఎండీ/ఎంవీఎస్సీ, ఎంబీబీఎస్+పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 30
- **వెబ్‌సైట్:** www.cdriindia.org

### హెచ్‌ఈసీఎల్‌లో 126 ఖాళీలు

**హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఈసీఎల్)లో ట్రేడ్ అప్రెంటిస్ నోటిఫికేషన్ విడుదలైంది.**





- **మొత్తం ఖాళీలు:** 169
- **విభాగాలవారీగా:** ఎలక్ట్రీషియన్-12, ఫిట్టర్-23, మెషినిస్ట్-22, వెల్డర్-9, టర్నర్-11, క్రేన్ ఆపరేటర్-32, ఫార్జర్ అండ్ హీట్ ట్రీటర్-8, కార్పెంటర్-32, ప్లంబర్-2, ఫౌండ్రీమ్యాన్/మౌల్డర్-3
- **అర్హత:** ఎనిమిదో తరగతి, పదోతరగతి, సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక:** అకడమిక్ మార్కుల ద్వారా
- **చివరితేదీ:** ఆగస్టు 26
- **వెబ్‌సైట్:** www.hecltd.com



# అలనాటి నటి విద్యాసిన్హా కన్నుమూత

- అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ మృతి
- రజనీగంధా, ఛోటీసీ బాత్, పతీ పత్నీ ఔర్ వో సినిమాల్లో మెరిసిన విద్య

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** అలనాటి నటి విద్యాసిన్హా (71) కన్నుమూశారు. గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆమెను గతవారం ముంబైలోని క్రిటికేర్ దవాఖానకు తరలించారు. అనంతరం ఐసీయూలో ఉంచి చికిత్సను అందించగా గురువారం ఆమె మరణించారు. విద్యాసిన్హా తన నట జీవితాన్ని 18 ఏండ్ల వయసు ఉన్నప్పుడే ప్రారంభించారు. రజనీగంధా, ఛోటీసీ బాత్, పతీ పత్ని ఔర్ వో సినిమాలు ఆమెకు మంచి పేరును తెచ్చిపెట్టాయి. సినిమాలకు కొంతకాలం విరామం ఇచ్చిన ఆమె.. ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ నటించిన బాడీగార్డ్ సినిమాలో మళ్లీ వెండితెరపై కనిపించారు. 2006లో వచ్చిన టీవీ సీరియల్ కావ్యాంజలిలోనూ నటించారు. 1968లో వెంకటేశ్వరన్ అయ్యర్‌ను పెండ్లి చేసుకున్న విద్యాసిన్హా ఓ బాలికను దత్తత తీసుకున్నారు. 1996లో వెంకటేశ్వరన్ మరణించడంతో 2001లో నేతాజీ భీంరావ్ సాలంఖీని రెండో పెండ్లి చేసుకున్నారు. తర్వాత ఇరువురి మధ్య విభేదాలు తలెత్తడంతో 2009లో విడాకులు తీసుకున్నారు.

# పొలంలో దిగిన విమానం

**మాస్కో, ఆగస్టు 15:** రష్యాకు చెందిన విమానానికి గురువారం పెనుముప్పు తప్పింది. మాస్కోలోని ఝుకోవ్‌స్కీ విమానాశ్రయం నుంచి క్రిమియాలోని సింఫర్‌పూల్‌కు బయలుదేరిన ఎయిర్‌బస్ విమానం 'ఏ321'ను టేకాఫ్ అయిన సెకన్లలోనే పక్షులు ఢీకొట్టాయి. ఫలితంగా విమానంలోని రెండు ఇంజిన్లు పనిచేయకపోవడంతో పైలట్ విమానాశ్రయానికి ఐదు కి.మీ. దూరంలోని మొక్కజొన్న పొలంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ప్రమాద సమయంలో విమానంలో 226 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది ఉన్నారు. విమానం ల్యాండింగ్ కాగానే గాలితో నింపిన ర్యాంప్‌ల సాయంతో ప్రయాణికులను కిందకు దించేశారు. ఐదుగురు పిల్లలతోపాటు 23 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి డిశ్చార్జి చేశామని అధికారులు తెలిపారు. రష్యా అధికార రొసవియాస్టియా విమానయాన సంస్థ అధిపతి అలెగ్జాండర్ నెరాడ్కో మీడియాతో మాట్లాడుతూ విమాన సిబ్బంది సరైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు.






# కశ్మీరీలకు ముప్పురాదు!

అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకుంటాయి ■ రాష్ట్ర సంస్కృతి, ఉనికి, భాషకు ప్రచారం లభిస్తుంది

- నవ కశ్మీర్ రూపకల్పనలో యువత భాగస్వామ్యం కావాలి
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గవర్నర్ సత్యపాల్ మాలిక్ పిలుపు
- భారీ భద్రత మధ్య పంద్రాగస్టు వేడుకలు

**శ్రీనగర్, ఆగస్టు 15:** జమ్ముకశ్మీర్ ప్రజల ఉనికికి ఏమీ ప్రమాదం లేదని ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ అన్నారు. జమ్ముకశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు చేసి కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన అనంతరం తొలిసారిగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని షేర్-ఏ-కశ్మీర్ స్టేడియంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వయంప్రతిపత్తిని రద్దుచేయడం వల్ల జమ్ముకశ్మీర్ ప్రజల ఉనికికి ఎలాంటి ప్రమాదం లేదని, అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకునేలా చారిత్రాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయని అన్నారు. ఈ వేడుకలకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యపాల్ మాలిక్ మాట్లాడుతూ..'జమ్ముకశ్మీర్ ప్రజల ఉనికికి ఎప్పటికీ ముప్పు వాటిల్లదని నేను భరోసా ఇస్తున్నాను. ప్రాంతీయ సంస్కృతులకు భారత రాజ్యాంగం ఎంతో విశిష్టతను కల్పించింది. ఇటీవల కేంద్రం తీసుకొన్న నిర్ణయం వల్ల తమ ఉనికికి భంగం వాటిల్లుతుందని ఎవరూ కలత చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా రాష్ట్ర సంస్కృతి, ఉనికి, భాషకు ప్రచారం లభిస్తుంది' అని అన్నారు. ప్రజల కనీస అవసరాలైన రోటీ, కాప్డా, మకాన్ (ఆహారం, దుస్తులు, నివాసం) వంటి సమస్యలపై గత కొన్నేండ్లుగా జరుగుతున్న ఎన్నికల్లో ఎవరూ దృష్టి సారించలేదని మాలిక్ అన్నారు. నవ కశ్మీర్ రూప కల్పనలో యువత భాగస్వామ్యం కావాలని మార్గనిర్దేశం చేశారు. 'చదువు, ఆటల్లో మీకు (యువత) మంచి పట్టు ఉన్నది. నవ కశ్మీర్ రూపకల్పన కోసం మీరు రాజకీయ ప్రక్రియలో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉన్నది' అని అన్నారు. కొత్త వ్యవస్థలో స్థానిక ఆదివాసీ తెగలకు రాజకీయ ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని అన్నారు. 'కశ్మీరీ, డోగ్రీ, గోజ్రీ, పహరి, బాల్టి, షీనా ఇతర భాషల ప్రజలకు ఇప్పటివరకూ సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేదు. ఇకపై, కొత్త వ్యవస్థలో పలు కులాలు, తెగలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు. కశ్మీరీ పండిట్లను తిరిగి తమ సొంత ప్రాంతానికి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఉగ్రవాద నిరోధానికి తీసుకుంటున్న చర్యల్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు.



శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్

### భద్రత కట్టుదిట్టం

అధికరణం 370 రద్దు తర్వాత జరుగుతున్న తొలి స్వాతంత్ర్య వేడుకలు కావడంతో జమ్ముకశ్మీర్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రముఖ రాజకీయ నాయకులెవరూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరుకాలేదు. పాసులు కలిగి ఉన్న వ్యక్తులను మాత్రమే స్టేడియంలోకి అనుమతించారు.




## స్వాతంత్ర్య వేడుకల్లో లడఖ్ ఎంపీ డ్యాన్స్

**లడఖ్, ఆగస్టు 15:** జమ్ముకశ్మీర్‌ను విభజించి ఏర్పాటు చేసిన లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో లడఖ్ బీజేపీ ఎంపీ జమ్ యాంగ్ సెరింగ్ నాంగ్యల్ పాల్గొని నృత్యం చేయడం అందిరినీ ఆకట్టుకుంది. వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన ఎంపీ సంప్రదాయ వస్త్రాలు గౌచాను ధరించి స్థానికులతో కలిసి నృత్యం చేశారు. దాదాపు 28 సెకన్లు ఉన్న ఎంపీ నృత్యం వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో పలువురు ప్రశంసలు కురిపించారు. ఇటీవల పార్లమెంట్‌లో జమ్ముకశ్మీర్ విభజన బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఎంపీ జమ్ యాంగ్ ప్రసంగించారు. ఆయన ప్రసంగంపై ప్రధాని మోదీ ప్రశంసలు కూడా కురిపించారు.

# కశ్మీర్‌పై రహస్యంగా చర్చించాలి

- భద్రతామండలికి చైనా వినతి
- పాకిస్థాన్ లేఖకు మద్దతు
- నేడు భద్రతామండలి సమావేశమయ్యే అవకాశం

జువన్నా రోయెంకా, షా మహమ్మద్ ఖురేషీ

**ఐక్యరాజ్యసమితి/ ఇస్లామాబాద్, ఆగస్టు 15:** కశ్మీర్‌పై ఐక్యరాజ్య సమితి భద్రతామండలి సమావేశం జరుపాలని పాకిస్థాన్ చేసిన విజ్ఞప్తికి చైనా మద్దతు పలికింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370వ అధికరణాన్ని రద్దుచేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని పాక్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కశ్మీర్ అంశంపై సమావేశం ఏర్పాటుచేయాలని ఐరాస భద్రతామండలి అధ్యక్షురాలు జువన్నా రోయెంకాకు పాకిస్థాన్ విదేశాంగమంత్రి షా మహమ్మద్ ఖురేషీ లేఖ రాశారు. పాక్ లేఖ ఆధారంగా కశ్మీర్ అంశంపై ఐరాస భద్రతామండలిలో రహస్యంగా చర్చించాల్సిందిగా చైనా లాంఛనంగా లేఖ రాసింది. దీనిపై ఐరాస త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని పేరు చెప్పడానికి ఇష్టపడని దౌత్యవేత్త ఒకరు తెలిపారు. శుక్రవారం ఐరాస భద్రతామండలి సమావేశం కావచ్చునని, ప్రధాన ఎజెండా కశ్మీర్ అంశమేనని పేర్కొన్నారు. చైనా అభ్యర్థనపై ఆగస్టు నెలలో భద్రతామండలికి అధ్యక్షత వహిస్తున్న పోలండ్ ప్రతినిధి జువన్నా రోయెంకా.. సభ్య దేశాలతో చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం భద్రతామండలి సమావేశమయ్యే అవకాశం ఉన్నదని రోయెంకా కూడా సూచనప్రాయంగా చెప్పారు. భారత్ మాత్రం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370 అధికరణం రద్దు తమ అంతర్గత అంశం అని అంతర్జాతీయ సమాజానికి తేల్చి చెప్పింది. పాకిస్థాన్ కూడా వాస్తవాలను అంగీకరించాలని హితవు పలికింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటేరస్ స్పందిస్తూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి అంశంపై భారత్, పాకిస్థాన్ నిగ్రహం పాటించాలని ఇప్పటికే సూచించారు. దీనిపై మూడోపక్షం జోక్యానికి అవకాశం లేదని, సిమ్లా ఒప్పందం ప్రాతిపదికన ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. పాక్ విదేశాంగ మంత్రి ఖురేషీ స్పందిస్తూ కశ్మీర్ అంశంపై నాలుగు దశాబ్దాల తర్వాత ఐరాస భద్రతామండలి సమావేశమైతే.. తాము దౌత్యపరంగా సాధించిన గొప్ప విజయం అవుతుందని చెప్పారని ఆ దేశ మీడియా పేర్కొంది. గతవారం చైనాకు వెళ్లిన ఖురేషి.. కశ్మీర్ అంశంపై భద్రతామండలిలో చైనా తమకు మద్దతు పలుకుతుందన్నారు. ఈ అంశంపై సంప్రదింపుల కోసం పాక్, చైనా డీజీ స్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. సోమవారం చైనాలో పర్యటించిన భారత్ విదేశాంగమంత్రి జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ ఈతో జరిగిన సమావేశంలో కశ్మీర్ అంశం తమ అంతర్గత వ్యవహారమని తేల్చి చెప్పారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దుచేసినందు వల్ల నియంత్రణ రేఖ (ఎల్వోసీ)పై ఎటువంటి ప్రభావం ఉండబోదన్నారు.

# జపాన్‌లో 'క్రోసా' తుఫాను బీభత్సం

- ఒకరు మృతి.. 21 మందికి గాయాలు

**టోక్యో, ఆగస్టు 15:** జపాన్‌ను 'క్రోసా' తుఫాను అతలాకుతలం చేస్తున్నది. బలమైన గాలులు, భారీ వర్షాలతో విరుచుకుపడుతున్నది. తుఫాను బీభత్సానికి గురువారం ఒకరు మరణించగా పలువురికి గాయాలయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, వరదలు పోటెత్తడంతో లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. దక్షిణ హిరోషిమా ప్రాంతంలో క్రోసా తన ప్రభావాన్ని చూపుతున్నది. గంటకు 126 కి. మీ. వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయి. సుమారు 4,30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా అధికారులు హెచ్చరించారు. తుఫాను బీభత్సానికి 82 ఏండ్ల ఓ వ్యక్తి మరణించినట్టు, మరో 21 మంది గాయపడినట్టు అధికారులు తెలిపారు.



జపాన్‌లో క్రోసా తుఫానుకు ఎగిసిపడిన అలలు




గురువారం తన పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్‌చేస్తున్న టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ తదితరులు

# ప్రజల సంక్షేమానికి ఉద్యోగులు పనిచేయాలి

- ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం చూసుకుంటుంది
- టీఎన్జీవో నేత కారం రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో అందించి, అర్హులకు న్యాయంచేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉన్నదని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. టీఎన్జీవో భవన్‌లో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం సెంట్రల్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి ప్రస్థానంపై స్ఫూర్తి శిబిరం పేరిట డాక్యుమెంటరీని విడుదల చేశారు. కార్యక్రమంలో దేవీప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే అంశం ప్రభుత్వం చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి జేఏసీ అధ్యక్షుడిగా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. ఉద్యోగుల ఇబ్బందులను సొంతవిగా భావించే టీఎన్జీవో కార్యవర్గం ఉందన్నారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యోగవర్గాలు కలిసిరావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా ఉద్యోగ సంఘాలు రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి, టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షురాలు బండారు రేచల్, ప్రతినిధులు ఎస్ఎం ముజీబ్, రాయకంటి ప్రతాప్, కొండల్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీకాంత్, బీటీఎన్జీవో నేత సత్యనారాయణగౌడ్, పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు తెలగమల్ల పర్వతాలు, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పున్నారెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



గురువారం రాఖీపౌర్ణమి సందర్భంగా టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్‌కు రాఖీ కడుతున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు

# టీఎన్జీవోభవన్‌లో రాఖీ వేడుకలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎన్జీవోభవన్‌లో గురువారం రాఖీపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్‌తోపాటు కార్యవర్గానికి అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఖీలు కట్టారు. అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం భిక్షవమ్మతోపాటు నిర్మల, శ్రీలత, ఉమ, రాజేశ్వరి, శోభ, అనిత, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌తోపాటు పలువురికి రాఖీలు కట్టారు.

# ముదిగొండ.. పచ్చనిదండ

## సత్ఫలితాలిస్తున్న తెలంగాణకు హరితహారం

**ముదిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమం సత్ఫలితాలిస్తున్నది. 'కోతులు వాపస్ పోవాలి, వానలు వాపస్ రావాలి' అన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కల నిజమవుతున్నది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాలుగువిడుతల్లో నాటిన మొక్కలు.. ప్రస్తుతం ఏపుగా పెరిగి వృక్షాలుగా ఎదుగుతున్నాయి. మండలంలో నాటిన ఆరులక్షల మొక్కల్లో.. 80 శాతం వరకు బతికి రహదారులకు ఇరువైపులా పచ్చని తోరణాలను తలపిస్తున్నాయి. 2014 సంవత్సరానికి ముందు ముదిగొండ మండలంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న కొద్దిపాటు చెట్లను వివిధ కారణాలతో నరికేశారు. రహదారులు వేసే సమయంలో చెట్లు నరికితే వాటిని తిరిగి నాటాలనే నిబంధన ఉన్నప్పటికీ దాన్ని గాలికొదిలేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమం నాలుగువిడుతల్లో కలిపి మండలంలో ఆరు లక్షల వరకు మొక్కలు నాటారు. వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. వాటిలో 80 శాతం వరకు బతికాయి. అవన్నీ ప్రస్తుతం ఏపుగా పెరిగి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ ఏడాది ఐదోవిడుతలో మరో ఐదు లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటుచేసింది. మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీలు ఉండ గా, అటవీశాఖ ఆధ్వర్యంలో మరో ఐదు ఉన్నా యి. ఈ నర్సరీల్లో మొత్తం 12 లక్షల మొక్క లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 5 లక్షలు మొక్కలు మండలపరిధిలో నాటనుండగా, మిగిలిన మొక్కలను రైతులకు అందజేయనున్నారు. ముదిగొండ మండలకేంద్రానికి వెళ్లే మార్గంలో లక్ష్మీపురం నుంచి సువర్ణాపు రం రహదారిలో నాటిన హరితహారం మొక్క లు ఏపుగా పెరిగి ఆకట్టుకుంటున్నాయి.






ఖమ్మం జిల్లా ముదిగొండ - లక్ష్మీపురం రహదారిలో ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు

## చంద్రబాబు కష్టాలు పగవాడికి కూడా రావద్దు

- ట్విట్టర్‌లో వైఎస్సార్సీపీ నేత విజయసాయిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు

**అమరావతి:** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన అపచారాలకు ఆగ్రహించి కృష్ణమ్మ జల కొరడా ఝుళిపించిందని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. కరకట్టలో పల నిర్మించిన ఇంటికి వరద ముప్పు ఉందని తెలియడంతో ఆయన హైదరాబాద్‌కు పారిపోయారని, చంద్రబాబుకు వచ్చిన కష్టాలు పగవాడికి కూడా రాకూడదని గురువారం ట్విట్టర్‌లో ఎద్దేవాచేశారు. ఇసుక దోపిడీ, నదిని పూడ్చి దీవుల ఏర్పాటు, గెస్ట్‌హౌస్ నిర్మాణం వంటి చర్యలతో బరాజ్‌లో నీటినిల్వను కుదించేశారని మండిపడ్డారు. అందుకే ఇప్పుడు ఉప్పొంగిన నదిని చూసి ప్రజలు సంతోషిస్తుంటే చంద్రబాబు మాత్రం హైదరాబాద్‌లో దాక్కున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కరకట్టలో పల నిర్మించిన ఇంటి ఆవరణలోని కార్లు, విలువైన సామగ్రిని మరోచోటకు తరలించిన చంద్రబాబుకు.. నదిని పూడిస్తే ప్రకృతి ప్రకోపం ఎలా ఉంటుందో ఇప్పటికైనా అర్థమైందా? అని ప్రశ్నించారు.

### గాంధీ, అంబేద్కర్ ప్రేరణతోనే

# నవరత్నాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

**అమరావతి:** మహాత్మాగాంధీ గ్రామస్వరాజ్యం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనావిధానం తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, ఆ మహానుభావుల ప్రేరణతోనే 'నవరత్నాలు' పథకాలను రూపొందించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 72 ఏండ్లు పూర్తవుతున్నా.. నేటికీ సమాజంలో కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక అసమానతలు మాయనిమచ్చలుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా వైఎస్ జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో సాహసోపేతంగా వ్యవహరించిన పలువురు రాష్ట్ర పోలీసులకు పతకాలు అందజేశారు. అనంతరం తమ ప్రభుత్వ ప్రాథమ్యాలు, నవరత్నాలు, సామాజిక ప్రగతికి పెద్దపీటవేస్తూ ఇటీవల తీసుకొచ్చిన చట్టాలు, ప్రభుత్వ నిర్ణయాలను తన ప్రసంగంలో ప్రస్తావించారు.

### ఏపీలో 2,66,796 మంది వాలంటీర్ల నియామకం

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే వాలంటీర్ల వ్యవస్థను విజయవాడలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భగా ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామ, పట్టణ వార్డుల్లో నియమించిన 2,66,796 మంది వాలంటీర్లు గురువారం నుంచే విధుల్లో చేరనున్నారు. వీరిలో సగం మంది మహిళలు ఉన్నారు. గ్రామీణప్రాంతాల్లో ప్రతి 50 ఇండ్లకు, గిరిజనప్రాంతాల్లో ప్రతి 35 ఇండ్లకు, పట్టణప్రాంతాల్లో ప్రతి 50-100 ఇండ్ల ఒకరు చొప్పున వాలంటీర్లను నియమించారు.

### అమెరికా పర్యటనకు వైఎస్ జగన్

ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం రాత్రి అమెరికా పర్యటనకు బయలుదేరారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా అమెరికా పర్యటనకు వెళ్తున్న జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు ప్రవాసాంధ్రులు భారీ ఏర్పాట్లుచేస్తున్నారు.



గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జెండా వందనం చేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

### కృష్ణా, గోదావరి అనుసంధానానికి

# సాయంచేయండి

- కేంద్రానికి ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు గోదావరి జలాల మళ్లింపు పథకం' ప్రాజెక్టుకు సాయంచేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జగన్ రాసిన లేఖను వైఎస్సార్సీపీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్‌కు అందించారు. నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులున్నాయని, పదేండ్లలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని లేఖలో ప్రస్తావించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు నిర్మిస్తున్న ప్రాజెక్టులతో ఏపీలోని ప్రాజెక్టులకు నీరు రావడంలేదని తెలిపారు. ఆల్మట్టి ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.2 మీటర్లకు పెంచుతున్నారని, దీంతో ఏపీకి వచ్చే 100 టీఎంసీల నీళ్లు కూడా రావని లేఖలో జగన్ ఆవేదన వ్యక్తంచేశారు. గోదావరి జలాలు పెద్దఎత్తున సముద్రంలో కలుస్తున్నాయని, గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీనికి తెలంగాణ రాష్ట్రం కూడా అనుకూలంగా ఉందని లేఖలో వివరించారు.

## హట్యతండాలో మద్య నిషేధం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం

**పర్వతగిరి:** వరంగల్‌రూరల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చౌటపెల్లి శివారు హట్యతండాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్యం విక్రయాలపై నిషేధం విధించారు. గురువారం సర్పంచ్ బాదావత్ నీలమ్మ, గ్రామ కార్యదర్శి సామరాజు, ఉపసర్పంచ్ అనురాధ, వార్డుసభ్యులు మద్యపానం నిషేధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ. 50 వేల జరిమానాతోపాటు ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని సర్పంచ్ నీలమ్మ హెచ్చరించారు. గ్రామంలోని మహిళల ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ యూత్ ఫోరం అధ్యక్షుడు మారుతీనాయక్, తండావాసులు బద్దునాయక్, కిషన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ

# చిత్రం

[ కరీంనగర్ ]

శుక్రవారం 16 ఆగస్టు 2019



'సైరా' చిత్రంలో చిరంజీవి


## పాగల్ ప్రేమకథ



విశ్వక్‌సేన్

'ఫలక్ నుమాదాస్' ఫేమ్ విశ్వక్‌సేన్ కథానాయకుడిగా లక్కీ మీడియా పతాకంపై 'పాగల్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనున్నది. బెక్కెం వేణుగోపాల్ నిర్మించనున్నారు. ఈ చిత్రం ద్వారా నరేష్‌రెడ్డి కుప్పిలి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సెప్టెంబర్ ద్వితీయార్థంలో ఈ సినిమా ప్రారంభంకానుంది. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ''హుషారు' విజయం మంచి చిత్రాల్ని నిర్మించడానికి, కొత్త వాళ్లను చిత్రసీమకు పరిచయం చేయడానికి స్ఫూర్తినిచ్చింది. ఆ నూతనోత్సాహంతోనే నరేష్‌రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాను. నవ్యమైన ప్రేమకథతో రూపుదిద్దుకోనున్న చిత్రమిది. ఆసక్తికరమైన అంశంతో వైవిధ్యంగా ఉంటుంది. త్వరలో చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తాం' అని చెప్పారు.

## సల్వాజుడుం కథాంశంతో 'స్టోరీ ఆఫ్ భీమాల్'



సమర్

'సినిమా బాలేదని ఒక్కరన్నా ఇంకోటి చేయం' అనే ఉపశీర్షికతో తొలి ప్రచార చిత్రాన్ని విడుదల చేసి 'స్టోరీ ఆఫ్ భీమాల్' అనే చిన్న సినిమా చిత్రరంగాన్ని ఆకట్టుకుంది. కథా రచయిత, జర్నలిస్ట్ నారాయణ మూర్తి బల్లెడ రచించి, దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో సమర్ అనే సెంట్రల్ యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ విద్యార్థి హీరోగా పరిచయం అవుతున్నారు. కొన్ని పాత్రలకు తెలంగాణ గురుకుల కళాశాలల విద్యార్థులను తీసుకున్నారు. వర్మ-అమితాబ్ కాంబినేషన్‌లో వచ్చిన 'నిశ్శబ్ద' సినిమా తర్వాత అతి తక్కువ రోజుల్లో పూర్తి చేసుకున్న సినిమా ఇదని చిత్ర యూనిట్ చెబుతున్నది. చత్తీస్‌గఢ్‌లో మొదలై దేశంలో సంచలనం రేపిన సల్వాజుడుం కథాంశం సినిమాగా రూపొందడంతో తెలుగు తెరపైకి మరో వివాదస్పద కథాంశం రాబోతున్నట్లుగా అందరూ అనుకుంటున్నారు. ఎస్ఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో పోసాని కృష్ణమురళి, నక్షత, హరిచంద్ర రాయల, రాజవర్ధన్, రేఖశ్రీ, శ్రవణ్, శ్రీధర్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రసు, కెమెరా: సునీల్ కుమార్, ఎడిటింగ్: బొంతల నాగేశ్వర రెడ్డి, కో-ప్రొడ్యూసర్స్: బోయిన్ చంద్రశేఖర్ ముదిరాజ్, వీర బాబు, నిర్మాత: ఆరూరి సుధాకర్, రచన, దర్శకత్వం: నారాయణ మూర్తి బల్లెడ.



## అల వైకుంఠపురములో..

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పూజా హెగ్డే కథానాయిక. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అల వైకుంఠపురములో' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. తొలి ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు. హీరో అల్లు అర్జున్ నటిస్తున్న 19వ చిత్రమిది. త్రివిక్రమ్, అల్లు అర్జున్ కలయికలో వస్తున్న మూడవ సినిమా కావడంతో ఈ చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. గురువారం విడుదల చేసిన టీజర్‌లో హీరో అల్లు అర్జున్ మధ్య తరగతి యువకుడిలా కనిపించారు. 'ఏంట్రోయ్ గ్యాప్ ఇచ్చావ్?' అని మురళీ శర్మ ప్రశ్నిస్తే..'ఇవ్వలా.. వచ్చింది' అంటూ అల్లు అర్జున్ చెప్పడం ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కాకినాడలో జరుగుతోంది. కాగా ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. టబు, రాజేంద్రప్రసాద్, సచిన్ ఖేడేకర్, మురళీశర్మ, సముద్రఖని, జయరాం, సునీల్, నవదీప్, సుశాంత్, నివేదా పేతురాజ్, గోవింద పద్మసూర్య, బ్రహ్మాజీ, హర్షవర్ధన్, అజయ్, రాహుల్ రామకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఫైట్స్: రామ్ లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: పి.డి.వి.ప్రసాద్.

## 23న 'కౌసల్యకృష్ణమూర్తి'



భీమనేని శ్రీనివాసరావు, కె.ఎస్.రామారావు, హనుమాన్ చౌదరి

'ఈ మధ్య కాలంలో స్పోర్ట్స్ నేపథ్యంలో వచ్చిన చిత్రాల్లో హీరోలు నటించారు. తొలిసారి మన తెలుగమ్మాయి ఐశ్వర్యరాజేష్ నటించిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ఓ పెద్ద సినిమా స్థాయిలో ఈ నెల 23న విడుదల చేస్తున్నాం' అన్నారు కె.ఎస్. రామారావు. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. భీమనేని శ్రీనివాసరావు దర్శకుడు. ఐశ్వర్యరాజేష్ ప్రధాన పాత్రలో నటించింది. నిర్మాత కె.ఎస్. రామారావు మాట్లాడుతూ ' సీనియర్ నటుడు అమర్‌నాథ్ మనవరాలు, నటుడు రాజేష్ కుమార్తె ఐశ్వర్యరాజేష్. తమిళంలో ఆమె నటించిన ఓ చిత్రాన్ని తెలుగులో 'కౌసల్యకృష్ణమూర్తి' పేరుతో రీమేక్ చేస్తున్నాం. అందులో ఆమె నటన చూసి ఆశ్చర్యపోయాను. ఐదు పెద్ద చిత్రాలు విడుదలైనా ఈ సినిమాకే ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. తమిళంలో నటిగా మంచి పేరు తెచ్చుకున్న మన తెలుగమ్మాయిని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రీమేక్ చేశాను. ఈ చిత్రానికి హనుమాన్ చౌదరి అద్భుతమైన డైలాగులు రాశాడు. సినిమా రిలీజ్ తరువాత అతన్ని అభినందిస్తారు. ఈ నెల 18న ప్రీరిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో భీమినేని శ్రీనివాస రావు, హనుమాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధాకర్‌గౌడ్, నరేందర్

### 'ఆదిత్య'కు భారత వరల్డ్ రికార్డు

బాలల చిత్రం 'ఆదిత్య'కు భారత వరల్డ్ రికార్డు అవార్డు దక్కింది. ఈ అవార్డును రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మరియు భారత వరల్డ్ రికార్డ్ ప్రతినిధి నరేందర్ చిత్ర దర్శకుడు భీమగాని సుధాకర్‌గౌడ్‌కు అందజేశారు. శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్, సంతోష్ ఫిల్మ్స్ పతాకాలపై నిర్మించిన 'ఆదిత్య' చిత్రం ఉభయ తెలుగురాష్ట్ర ప్రభుత్వాల వినోదపు పన్నురాయితీ పొంది అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవంలో అవార్డును కైవసం చేసుకుంది. భారత్‌తో పాటు పలు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడి అనేక పురస్కారాలను పొందింది. ఈ చిత్రం 1000రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ అవార్డును అందజేశారు.

## గేయరచయిత శివగణేష్ కన్నుమూత



సినీ గేయరచయిత శివగణేష్ బుధవారం హైదరాబాద్‌లోని గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన స్వస్థలం కాకినాడ. 1985లో పాటల రచయితగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన దాదాపు వెయ్యి సినిమాలకుపైగా పాటలు రాశారు. 2000లకుపైగా భక్తిగీతాలు, జింగిల్స్‌తో తనకంటూ ప్రత్యేకమైన ముద్రను సృష్టించుకున్నారు. అనువాద చిత్రాల గీత రచయితగా శివగణేష్ ప్రాచుర్యాన్ని పొందారు. జీన్స్, 7 జీ బృందావనకాలనీ, ఒకే ఒక్కడు, బాయ్స్, పరవశం, నరసింహా, ప్రియురాలు పిలిచింది పాటు పలు అనువాద చిత్రాల్లో శివగణేష్ రాసిన పాటలన్నీ ప్రజాదరణను చూరొగన్నాయి. నెల్లూరి నెరజానా, తలచి తలచి చూశా, కన్నులతో చూసేదీ, పలికే గోరింకా..ఇలా శివగణేష్ రాసిన పాటలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. శివగణేష్‌కు భార్య నాగేంద్రమణితో పాటు ఇద్దరు కుమారులు సుహాస్, మానస్ ఉన్నారు. గురువారం శివగణేష్ అంత్యక్రియల్ని వనస్థలిపురంలో నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ముక్కోణపు ప్రేమాయణం



అజిత్, దీక్షిత

అరవింద్‌రెడ్డి, సుభాంగిపంత్, అజిత్ రాధారామ్, దీక్షిత పార్వతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నీ కోసం'. అవినాష్ కోకటి దర్శకుడు. అల్లూరమ్మ (భారతి) నిర్మాత. ఈ చిత్ర ట్రైలర్ శనివారం విడుదలైంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం భావోద్వేగభరితంగా సాగుతుంది. ప్రతి పాత్రతో ప్రేక్షకులు సహానుభూతి చెందుతారు. చెదిరిపోయిన బంధాల్ని గుర్తుచేస్తూ హార్ట్‌టచింగ్‌గా ఉంటుంది. యువతతో పాటు కుటుంబప్రేక్షకుల్ని కూడా మెప్పిస్తుంది' అన్నారు. 'ఈ కాన్సెప్ట్‌తో నేటి యువత అందరూ రిలేట్ అవుతారు. తమ జీవితాల్లో జరిగిన సంఘటనల్ని గుర్తుచేసుకుంటారు' అని హీరో అరవింద్‌రెడ్డి చెప్పారు. కథానుగుణంగా మంచి పాటలు కుదిరాయని సంగీత దర్శకుడు శ్రీనివాస్‌శర్మ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శివక్రిష్ణ యెడులపురమ్, నిర్మాణ సంస్థ: తీర్థసాయి ప్రొడక్షన్స్, రచన-దర్శకత్వం: అవినాష్ కోకటి.





